Estd 1938
ఆంధ్రప్రభ
www prabhanews com
Journalism first!

Lalithaa
సోమాజిగూడ సర్కిల్,
హైదరాబాద్.
ఆదివారం, 27.8.2017

సంపుటి: 56 • సంచిక: 133 • బుధవారం 23 ఆగస్టు 2017 • హైదరాబాద్ ❇ పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad | Khammam

తాగునీటికి 45 టీఎంసీలు

● కృష్ణా బోర్డును కోరిన తెలంగాణ ● ప్రోరేటా మేరకే నీటి పంపిణీ

● కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర పరిధిలోని కృష్ణానది బేసిన్ కింద తాగునీటి అవసరాలకోసం 40టీఎంసీల నీటిని అందచేయాలని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డును కోరింది. తొలిసారి మంగళవారం నాడు అంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కృష్ణారివర్ బోర్డు సమావేశం జరిగింది. బోర్డు ఛైర్మన్ శ్రీవాత్సవ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఈ ఏడాది జూన్ ప్రారంబం నుంచి కృష్ణానదిలో నీటి ప్రవాహాలు , ప్రధాన జలాశయాల్లోకి చేరిన నీరు, ప్రస్తుత నీటి నిలువలు , నీటి కొలతకు సంబంధించి టెలీమెట్రీ పరికరాల ఏర్పాటు, తెలంగాణ , ఏపీ రాష్ట్రాల పరిధిలో తాగు నీటి అవసరాలు తదితర అంశాలను చర్చించారు.

ఎగువన కర్నాటకలో కృష్ణా నదిపై ఉన్న ఆలమట్టి, నారాయణ పూర్ జలాశయాల్లోకి చేరిన నీరు, ప్రస్తుత నీటి నిలువలు తదితర అంశాలు కూడ చర్చకు వచ్చాయి. ఆలమట్టిలోకి జూన్ నుంచి ఇప్పటివరకూ 155టీఎంసీల నీరు చేరి జలాశయం 20రోజుల కిందటే పూర్తిస్థాయిలో నిండినప్పటికీ కర్నాటక ప్రభుత్వం వచ్చిన నీటిని వచ్చినట్టే సాగునీటి అవసరాలకు వినియోగించుకుంటూ దిగువకు నీటిని విడుదల చేయకపోవటం పట్ల సమా వేశంలో తెలంగాణతోపాటు ఏపీ అధికారులు కూడా ఆందోళన వెలిబుచ్చారు. తాగు నీటి అవసరాలనిమిత్తం 15టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఇదివరకే కర్నాటక ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు బోర్డు దృష్టికి తీసుకు పోయారు. రాజధాని హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకోసం 18టీఎంసీలు, నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద 5 టీఎంసీలు , నల్లగొండ జిల్లా అవసరాలకోసం 5టీఎంసీలు నీరు అవసరం అని బోర్డును కోరారు.

విభజన చట్టం మేరకే నీటి పంపిణీ

తెలంగాణ , ఏపీరాష్ట్రాల మధ్యన పునర్విభజన చట్టం మేరకే కృష్ణాజలాలను పంపిణీ చేయాలని బోర్డులో నిర్ణయించారు. టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు కూడా రెండు రాష్ట్రాల పరిధిలో రెండవ దశకింద 29 ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. శ్రీశైలం జలాశయానికి ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకూ 4.47టీఎంసీల నీరు మాత్రమే చేరింది. నాగార్జున సాగర్ జలాశయంలోనూ నీటి లభ్యత తక్కువగా ఉన్నందున ప్రోరేటా ఆధారంగానే రెండు రాష్ట్రాలు నీటిని పంచుకోవాలని బోర్డు ఛైర్మన్ శ్రీవాత్సవ సూచించారు. తెలంగాణ , ఏపీ రాష్ట్రాల పరిధిలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఎగువన కర్నాటక పరిధిలోని అలమట్టి జలాశయం నుంచి నీటిని విడుదల చేయించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం బోర్డు ఛైర్మన్ శ్రీవత్సవ మాట్లాడుతూ నీటి విడుదలకోసం త్వరలోనే కేంద్రప్రభుత్వానికి లేఖ రాస్తామని పేర్కొన్నారు.

సెస్‌కు రూ. కోటి నిధులు విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సెస్(సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్)కు రూ. 1కోటి నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కలెక్టర్లకు అత్యవసర నిధి నిధులు విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అన్ని జిల్లాల్లో కలెక్టర్లు అత్యవసర ప్రభుత్వ పథకాలు, ప్రజల అవసరాలకు ఖర్చుల నిమిత్తం క్రూషియల్ బాలెన్సింగ్ ఫండ్(సీబిఎఫ్)ను విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో జిల్లాకు రూ. 75 లక్షల చొప్పున రూ. 23.25 కోట్ల నిధులను మంజూరీ చేసింది. గతంలో ఖర్చు చేసిన నిధుల యుటిలైజేషన్ పత్రాలను సమర్పించాలని ఈ ఉత్తర్వుల్లో ఆదేశించింది.

గీతం దూర విద్యకు జాతీయ గుర్తింపు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: గీతం విశ్వ విద్యాలయానికి చెందిన దూరవిద్యా కేంద్రం(సీడీఎల్)కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలోని తొలి 12 సంస్థల్లో గీతం యూనివర్సిటీ సీడీఎల్ నిలించింది. స్థాపించిన 8 సంవత్సరాల్లోనే గీతం ఈ ఘనత సాధించిందని అందుకు యూనివర్సిటీ అధ్యక్షులు డాక్టర్ ఎంవివిఎస్ మూర్తి మంగళవారం హర్షం ప్రకటించారు. కెరీర్ కనెక్ట్ నిర్వహించిన సర్వేలో సీడీఎల్‌కు 5 స్టార్లకు గానూ 4.5 సాట్లరను ఇచ్చినట్టు తెలిపారు. నిబద్ధతతో పనిచేస్తున్న సిబ్బందికి, సహచరులను ప్రోత్సహిస్తున్న సీడీఎల్ అధికారులను మూర్తి అభినందించారు.



బుద్వేల్‌లో రెడ్డిహాస్టల్ శంకుస్థాపన సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఎడ్యుకేషన్ హబ్‌లా రెడ్డిహాస్టల్

● ప్రముఖుల పేర్లు చరిత్రలో నిలిచేలా చర్యలు ● సమైక్య రాష్ట్రంలో మహనీయుల పేర్లు కనుమరుగు

● పేదవారికోసం నిరంతరం తపించిన ఆర్‌బీవీఆర్ ● రెడ్డిహాస్టల్ శంకుస్థాపన సభలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రెడ్డి హాస్టల్‌లో ఒకగొప్ప ఎడ్యూకేషన్ టవర్ ఏర్పాటు కావలసి ఉందని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. దానికి రాజాబహదూర్ వెంకట్రామారెడ్డి పేరు పెట్టాలని కోరారు. ఎడ్యూకేషన్ టవర్‌లో ప్రత్యేకమైన కోర్సులు అందించా లన్నారు. రెడ్డి హాస్టల్‌లో కులమతాలకు అతీతంగా ప్రవేశాలు కల్పించాలని, అద్భుతమైన విద్యాసంస్థల సదుపాయాలు అందుబాటులోకి తేవాలని సూచించారు. రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బుద్వేల్‌లో రాజబహుదూర్ వెంకట్రామారెడ్డి ఎడ్యూకేషన్ సొసైటీకి ప్రభుత్వం కేటాయించిన పది ఎకరాల స్థలంలో ముఖ్యమంత్రి కెసిఆర్ మంగళవారం హాస్టల్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. హాస్టల్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ. 10 కోట్ల ప్రభుత్వ సహాయాన్ని ఎడ్యూకేషన్ సొసైటీకి అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో మాయమైపోయిన తెలంగాణ మహనీయుల పేర్లన్నీ పునరుద్దరించుకొనవలసి ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడి తెరాస ప్రభుత్వం ఏర్పాటైన వారం రోజుల్లోనే పోలీస్ ఆకాడమీకి రాజాబహుదూర్ వెంకట్రామారెడ్డి పేరు పెట్టా మన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టి గౌరవించుకున్నామన్నారు. తెలంగాణ మహనీయులకు రాబోవు తరాల వారు స్మరించుకొనే విధంగా వివిధ సంస్థలకు మహనీయుల పేర్లు పెట్టి గౌరవించుకొనే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తెలంగాణ ప్రముఖుల పేర్లు చరిత్రలో నిలిచేలా చర్యలు చేపట్టామని వెల్లడించారు. తెలంగాణ వైతాళికుల కీర్తిని స్మరించుకొనే అవకాశం దక్కినందుకు సంతోషగా ఉందన్నారు. ఒకటిన్నర శతాబ్దం క్రితం వికసించిన కుసుమం రాజబహుదూర్ వెంకట్రా మారెడ్డి, ఆయన పుట్టుకతోనే శ్రీమంతుడు, అలాంటి వ్యక్తి అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత పదవిని చేపట్టారు, నిజామ్ ప్రభుత్వంలో 14 సంవత్సరాల పాటు కొత్వాల్‌గా సేవలం దించారు, పేద పిల్లలు చదువుకొనేందుకు ఎంతో కృషి చేశారు. ఆయన పేదవారి కోసం నిరంతరం తపించారు, సమాజ పురోగమనానికి కంకణబద్దులై కృషి చేశారు. రెడ్డి హాస్టల్‌ను ఏర్పాటు చేసి అందరికీ విద్యను అందించేప్రయత్నం చేశారు. బాలికల విద్యమీద ఆయన ప్రత్యేక దృష్టికేంద్రీకరించారు.

రెడ్డి హాస్టల్‌లో ఇతర కులాల విద్యార్ధులకు అవకాశం కలిగించారు, దళితుల కోసం పాతబస్తీలో ఒక పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆయన గొప్ప మహనీయుడు, ప్రాతస్మరణీయులు, పొద్దున లేచి తలచుకోవలసిన గొప్ప వ్యక్తి, తెలుగులో విద్యావకాశాలు కల్పించడానికి ఆనాడే అయన శ్రీకారం చుట్టారు, దాదాపు 14 విద్యా సంస్థలను స్థాపించారు. అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. సురవరం ప్రతాపరెడ్డి రాజబహదూర్ వెంకట్రామారెడ్డి చరిత్ర రాసి సమాజానికి అందించారు, ఆయన నెలకొల్పిన విద్యా సంస్థల్లో చదువుకున్న వారిలో అనేక మంది దేశ విదేశాల్లో గొప్ప స్థానాల్లో మంది ఉన్నారు. దేశానికి ప్రధానమంత్రిని అందించిన గొప్ప సంస్థ రెడ్డి హాస్టల్ అని ముఖ్యమంత్రి వివరించారు. బుద్వేల్లో కేటాయించిన పది ఎకరాల సమీపంలోని మరో ఐదు ఎకరాలను కూడా రెడ్డి హాస్టల్‌కు కేటాయించడం జరుగుతుందని ప్రకటించారు. నారాయణ గూడలోని ఐపిఎంలో ఉన్న మరో 1500 గజాల స్థలాన్ని కూడా బాలికల పాఠశాల విస్తరణ కోసం అందించబోతు న్నామని ప్రకటించారు. ప్రభుత్వ ఆర్ధిక తోడ్పాటులో పాటు వివిధ సంస్థల నుండి విద్యాసంస్థల విస్తరణకు ఆర్ధిక తోడ్పాటు పొందవలసి ఉందని నిర్వాహకులకు సూచించారు. దేశ విదేశాల్లో స్ధిరపడిన అనేక మంది రాజబహదూర్ వెంకట్రా మిరెడ్డి అభిమానులు కూడా ఆర్ధిక సహాయం అందించేందుకు ముందుకొస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. శాంత బయోటిక్ వర ప్రసాద్, జివికె, రెడ్డిల్యాబ్ సతీస్ రెడ్డిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వేదిక పైకి ఆహ్వానించి వారు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు.

మంచి విద్యా సంస్థల సమాహరంగా రాజబహుదూర్ వెంటట్రామారెడ్డి ఎడ్యూకేషన్ సొసైటీ విస్తరించవలసి ఉందన్నారు. తెలంగాణ వైతాళికుల్లో భాగ్యారెడ్డి వర్మ ఒకరు. ఆయన అంబేద్కర్ అంతటి మహనీయుడు, ఆది హిందూ సంస్థను ఏర్పాటు చేసి తెలుగులో బాలికా విద్యను ప్రోత్సహించారని గుర్తు చేశారు. కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డులో అతి పెద్ద గృహసముదాయాన్ని నిర్మించిన ధర్మారెడ్డిని కూడా సమైక్య రాష్ట్రంలో విస్మరించారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. రాజబహుదూర్ వెంకట్రామారెడ్డి ఎడ్యూకేష్ సొసైటీ అధ్యక్షులు రఘుపతిరెడ్డి కార్యక్రమానికి స్వాగతం పలికారు. మంత్రులు నాయిని నరసింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు విశ్వేశ్వర్ రెడ్డి, శాసన సభ్యులు ప్రకాశ్‌గౌడ్ మాట్లాడిన వారిలో ఉన్నారు. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, ఈటెల, లక్ష్మారెడ్డితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున సభలో పాల్గొన్నారు.

రెడ్డి హాస్టల్ నిర్మాణానికి రూ. 10 కోట్లు విడుదల

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నోటివెంట భరోసా ఇచ్చిందే తడువుగా బుద్వేల్‌లో రెడ్డి హాస్టల్ నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద ఈ నిధులను విడుదల చేస్తూ మంగళవారం ప్రణాళికాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య మంగళవారం జీవో విడుదల చేశారు. ఆర్‌బివిఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీకి ఈ నిధులను విడుదల మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'ఉపాధి చూపండి సాగుభూములివ్వండి'



అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఇన్‌చార్జీ కలెక్టర్ రవీందర్ రెడ్డి

నిజామాబాద్, కెఎన్ఎన్ బ్యూరో : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం మంచిప్ప వద్ద నిర్మిస్తున్న కొండెం మంచిప్ప రిజర్వాయర్‌కు సంబంధించి నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో పర్యావరణ అభిప్రాయ సేకరణ జరిగింది. ఇన్‌చార్జి కలెక్టర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. రిజర్వాయర్ నిర్మాణంపై అధికార పార్టీకి చెందిన శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు పలు ప్రతిపాదనలు చేశారు. మంచిప్ప, బైరాపూర్ గ్రామాలకు చెందిన రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎన్నో ఏళ్ళుగా తాము పంట భూములను నమ్ముకుని బతుకుతున్నామని, రిజర్వాయర్ పేరుతో విలువైన తమ భూములను, ఇళ్లను బలవంతంగా లాక్కుంటే తమ బతుకు ఆగమౌతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని, వ్యవసాయం చేసుకోవడానికి సాగుకు అనువైన భూములను కేటాయించాలని రైతులు కోరారు. అలాగే వందలాది ఇళ్ళు ఈ ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతాయని, అంతే విలువైన ఇళ్ళను తమకు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రాజెక్టులు నిర్మిస్తున్న ప్రభుత్వం భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా మొండి కేస్తుందని అభిప్రాయ సేకరణలో పాల్గొన్న పలు ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కొండెం చెరువు రిజర్వాయర్ విషయంలో ఇది పునరావృతం కావద్దని, రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి, మార్కెట్ ధరకు అనుగుణంగా నష్టపరిహార చెల్లింపు ప్రక్రియలు పూర్తి అయిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అలా చేస్తేనే తాము రిజర్వాయర్ నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు. అలా కాకుండా ముందుగా పనులు మొదలుపెడితే తాము అడ్డుకుని తీరుతామని వారు స్పష్టం చేశారు. బాధితుల పక్షాన అన్ని పక్షాలు ప్రజా సంఘాలు ఒక్క తాటికి మీదకి వచ్చి ఆందోళన చేస్తాయని వారు చెప్పారు.

సీఎం కేసీఆర్‌కు ఈ రిజర్వా యర్‌కు సంబంధించి ముంపు బాధితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించడానికి స్పష్టమైన హామీ ఇచ్చారని నిజామాబాద్ రూరల్ శాసనసభ్యుడు బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజా సంఘాల నాయకులకు తెలిపారు. బాధితులను అన్ని రకాలుగా ఆదుకున్న తర్వాతే ప్రాజెక్టు పనులు మొదలు పెడుతామన్నారు. రైతులు, ప్రజాప్రతినిధుల సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఇంఛార్జ్ జిల్లా కలెక్టర్ రవీందర్ రెడ్డి తెలిపారు. కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 49 మంది తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు కలెక్టర్ వివరించారు.

ఇది అభిప్రాయ సేకరణే

కలెక్టర్ అనితా రామచంద్రన్

యాదాద్రి, కెఎన్ఎన్ : కాళేశ్వర ప్రాజెక్టులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో గంధమల్ల, బస్వాపురంలో ప్రాజెక్టులను నిర్మించతలపెట్టిన నేపథ్యంలో పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయసేకరణకు మంగళవారం భువనగిరి మండలంలోని రాయగిరి సోమరాధా క్రిష్ణకల్యాణ మండపం వేదికయ్యింది. ఈ సమావేశం జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్ అధ్యక్షతన సాగింది. ప్రాజెక్టులకు అనుకూలంగా పలు గ్రామాల రైతులు అభిప్రాయాలను వెల్లడించగా ప్రతికూలంగా ముంపు గ్రామాల రైతులు, ప్రజలు గగ్గోలు పెట్టారు. వీరిని భువనగిరి, చౌటుప్పల్ ఏసీపీలు సాదు మోహన్‌రెడ్డి, స్నేహిలత ఆధ్వర్యంలో అదుపు చేయడానికి యత్నించారు. కాని నిర్వాసితులు మాత్రం ఆందోళన తీవ్రం చేయడంతో సమావేశ ప్రాగణంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకోగా ముంపు బాధితులు సమావేశ మందిరం ఎదుట ఆందోళన చేపట్టారు.

భిన్నవాదనలు, అభిప్రాయాలు

సమావేశ ప్రారంభంలో ముందు పేర్లు నమోదు చేసుకొన్న విధంగా జాయింట్ కలెక్టర్ గుగులోతు రవినాయక్ ప్రకటించగా భువనగిరి ఎంపి బూర నర్సయ్య, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, కర్నె ప్రభాకర్, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహరెడ్డి 50టీఎంసీల సామర్థ్యం గల మల్లన్నసాగర్‌తో కొండపోచమ్మ, బస్వాపురం, గంధమల్ల ప్రాజెక్టులు నిండి జిల్లాలోని ఆయకట్టు ప్రాంతమంత సస్యశ్యామలం అవుతుందని అభిప్రాయాలు వినిపించారు. జిల్లాలోని రెండు ప్రాజెక్టులతో 8వేల ఎకరాలకు సాగునీరందుతుందని, అందు కోసం జిల్లాలో ఈ రెండు ప్రాజెక్టులు నిర్మాణం చేయాలని అనుకూలంగా తమ అభిప్రాయాలను తెలిపారు. దీంతో వలసలుకూడా పూర్తి తగ్గిపోతాయని వారు అభిప్రాయపడ్డారు. ఇంద్రపాలనగరం (రామన్నపేట మండలం తుమ్మలగూడెం) 9వందల ఎకరాల విస్తీర్ణంతో ఉన్న చెరువుతో ఆ గ్రామానికి సుమారు యేటా 2కోట్ల ఆదాయం పొందుతున్నారని ఎంపి బూర నర్సయ్య చెప్పారు.



వీరితో పాటు జిల్లాలోని యాదాద్రిభువనగిరి జిల్లా తెదేపా కన్వీనర్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గంథ్రాలయ సంస్థ అధ్యక్షుడు జడల అమరేందర్, తెలంగాణ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి,రాష్ట్ర నాయకుడు చందుపట్ల వెంకటెశ్వరరావు, ఎడ్ల సత్తిరెడ్డి, ఆత్మకూర్ (ఎం) మండల కూరెళ్ల సర్పంచ్ ఉప్పలయ్య, మునుగోడు నియోజకవర్గం ఇక్కుర్తి రైతు మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ ఎస్ఈ మేకల సతీష్‌రెడ్డి, అలాగే ఐబి రిటైర్డ్ ఉద్యోగి మేడి రాంనర్సయ్య, మోత్కూర్ మార్కెట్ వైస్ ఛైర్మన్ (ఆత్మకూర్ (ఎం) మండలం పారుపల్లి) లగ్గాని రమేష్, ఆలేరు మండల కేంద్రం నుంచి ఆకవరపు మోహన్‌రావు, తుర్కపల్లి మండలం మాజీ ఎంపీపీ బోరెడ్డి రాంరెడ్డితో పాటు ఇతర రైతులు ప్రాజెక్టు నిర్మాణం చేపడితే జిల్లా సస్యశ్యామలం అవుతుందనే అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇలా సాఫీగా సాగుతున్న అభిప్రాయసేకరణలో ముంపు బాధితుల నుంచి ఒక్కసారిగా వ్యతిరేకత ఎదురైంది. ముందస్తుగా ముంపు బాధితుల అభిప్రాయాలు సేకరించాలని కొంతమంది పట్టుబట్టారు. గందరగోళం నడుమ అనుకూలంగా మాట్లాడే వారు మాట్లాడుతుండగానే మధ్యలోంచి అలజడి మొదలు కావడంతో పోలీసులు వారిని నివారించే ప్రయత్నం చేశారు. బాధితులే సమావేశ ప్రాంగణం నుంచి బయటకు వెళ్లి ఆందోళన చేపట్టారు. వారికి తోడుగా కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు కోట పెద్ద స్వామి కార్యకర్తలతో బాధితులకు న్యాయం చేయాలని నిరసనలు తెలిపారు.

వామపక్షాలు.. బాధితుల పక్షాన

సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రాజెక్టుల నిర్మాణానికి తమ పార్టీలు వ్యతిరేకం కాదని ఇరువురు చెబుతూనే బాధితులకు అన్యాయం జరిగితే మాత్రం ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. నష్టపోతున్న రైతుల న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలని వారి అభిప్రాయం వెల్లడించారు. బాధితుల న్యాయమైన డిమాండ్లు నేరవేరే వరకు ప్రజల పక్షాన పోరాడుతామని ముగించారు. ఎంపి బూర మాట్లాడిన మాటలను పరోక్షంగా సిపిఎం కార్యదర్శి ఎండి జహంగీర్ విమర్శించారు.

రద్దుకుపట్టుబట్టిన బీజేపీ నేత నర్ల

ఈ ప్రజాభిప్రాయసేకరణలో ముందుగా ముంపు బాధితులకు అభిప్రాయాలు వెల్లడించే అవకాశమివ్వాలని భాజపా యాదాద్రిభువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగరావు సభలో పట్టుబట్టారు. ఇప్పటి వరకు మాట్లాడిన వారంత రైతులు కాదు అధికార పార్టీ నాయకులని ఆయన నేరుగా ఆరోపించారు. ఆయన మాటలకు ముంపు గ్రామాల బాధితులు మద్దతు లభించగా ఇతర గ్రామాల రైతుల నుంచి వ్యతిరేకత ఎదురైంది. ఈ ప్రజాభిప్రాయ సేకరణ రద్దు పర్చి కలెక్టరేట్‌లో బాధితులతో సమావేశం నిర్వహించాలని ప్రధానంగా డిమాండు చేశారు.

కలెక్టర్ స్పందన

ఈ మేరకు కలెక్టర్ అనితా రామచంద్రన్ జోక్యం చేసుకొని ఇది బాధితుల అభిప్రాయ సేకరణ కాదు... కేవలం పర్యావరణపై అభిప్రాయ సేకరణ మాత్రమే అని వివరణిచ్చారు. ముంపు గ్రామాల్లోనే బాధితులు సమస్యలు విని అక్కడి అభిప్రాయాలను సర్కార్‌కు నివేదిక అందజేస్తామని ఆమె చెప్పారు. దీంతో సమావేశ ప్రాంగణంలోని వారంత ఒక్కసారిగా కొంత మెత్తబడ్డారు.



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కాళేశ్వరం త్వరగా కట్టండి

ప్రజాభిప్రాయ సేకరణలో వినతులు

కరీంనగర్, కెఎన్ఎన్ బ్యూరో : కాళేశ్వరంతో తెలంగాణ భూములు సస్యశ్యామలం కానున్నాయని, ఈ ప్రాజెక్టు పనులను త్వరిగతిన పూర్తి చేయాలని మూడు నియోజకవర్గాలకు చెందిన ప్రజలు తమ అభి ప్రాయం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళ వారం కరీంనగర్ మండలం రేకుర్తిలోని రాజశ్రీ గార్డెన్‌లో పర్యావరణ అభిప్రాయ సేకరణ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ అపర భగీరథుడని, తెలంగాణలో కోటి ఎకరాలకు సాగు నీరు అందించడానికి ప్రాజెక్టులను రూపకల్పన చేశారని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయ సేకరణలో తెలంగాణ సాంస్కృతిక సారథి, మాన కొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ తుల ఉమ, శాసనమండలి సభ్యుడు నారదాసు లక్ష్మన్‌రావు, కరీంనగర్, చొప్ప దండి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, బొడిగె శోభ, కరీంనగర్ ఎంపీపీ వాసాల రమేశ్, రామడుగు ఎంపీపీ వీర్ల కవిత తోపాటు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీ సీలు, రైతులు, వివిధ కుల వృత్తుల వారు పాల్గొని కాళేశ్వ రం ప్రాజెక్టు పర్యా వరణ అనుమతులపై వారివారి అభిప్రాయా లను వ్యక్తం చేశారు. తొలుత కరీం నగర్ మండలం గోపాల పూర్‌కు చెందిన మండల రాజ మల్ల య్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాజెక్టు రీ-డిజైన్ ద్వారా మేడిగడ్డ వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టుతో తెలంగాణ భూములు సస్యశ్యామలం కానున్నా యన్నా రు. రిటైర్డ్ ఎస్ఈ కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలంగాణలో 30 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పర్యావరణానికి ఏ విధమైన నష్టం జరగదన్నారు. బద్దిపల్లికి చెందిన శ్రీనివాస్ మాట్లాడుతూ నీటి కరవుతో అల్లాడుతున్న ప్రజలకు కాళేశ్వరం ద్వారా సాగునీరు అందు తుందని, ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలన్నారు. మాజీ సైనికుడు బోయినపల్లి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టును సీఎం అపర భగీరథ పథకం లాగా చేపట్టారని, ఇది తెలంగాణ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. రేకుర్తికి చెందిన పవన్‌కుమార్ మాట్లాడుతూ కాళేశ్వరం పూర్తి చేయడం ద్వారా నీటి సంపద లభిస్తుందన్నారు. బొమ్మకల్ గ్రామానికి చెందిన మల్లయ్య మాట్లా డుతూ ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలన్నారు. చేగుర్తి గ్రామానికి చెందిన బల్మూరి ఆనంద్‌రావు మాట్లాడుతూ గ్రామ ప్రజల తరపున సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ త్వరగా పూర్తిచేయాలని కోరారు. చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ప్రజలకు నీరు ముఖ్యమని, రాజకీయమం కాదని, అందరు సహకరించాలని కోరారు. . ఇంకా మైలారం నకు చెందిన కుసుమ, ఎలగం దులకు చెందిన ప్రభాకర్, చొప్పదండికి చెందిన మల్లారెడ్డి, చెర్లభూత్కూ రుకు చెందిన సత్యనారాయణ, రిటైర్డ్ ఎస్ఈ జియా ఉద్దీన్, శశి భూషణ్ కాచే తదితరుల తమ అభిప్రా యాలను వెల్లడిం చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల జరిగే , కలిగే సామాజిక , ఆర్థిక ప్రభావాల పూర్తిస్థాయి రిపోర్టు తెలు గులో ప్రజల ముందు ఉంచి అభిప్రాయాలను స్వీ కరించాలని సీపీఐ, సీపీఐఎం ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం సమర్పించారు. ప్రజల ముందు తెలుగులో రిపోర్టు ఉంచి వారిని చైతన్య వంతులను చేసిన తరువాతే అభి ప్రాయాన్ని సేకరించా లని కాని, ఇలా ఒకే పార్టీవారితో అభిప్రాయం సేకరించి సై అనిపించుకోవడం తగదని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకట్రా జయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పైడిపల్లి రాజు, కాలువ నర్సయ్య యాదవ్‌లతోపాటు సీపీఎం కార్యదర్శి ము కుందరెడ్డిలు కోరారు.

ఖాళీ స్థలాలు, ఇళ్ల వివరాలు.. ఇక క్షణాల్లో లభ్యం

● క్రయ విక్రయాల్లో మరింత పారదర్శకత ● ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టిన మునిసిపల్‌శాఖ ● 72 యుఎల్‌బీల్లో అమలు ● ఈజ్ ఆఫ్ బిజినెస్‌లో మరో ముందడుగు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈజ్ ఆఫ్ బిజినెస్ (పాలనలో మరింత సులభతరం)లో రాష్ట్ర మునిసిపల్ శాఖ మరో ముందడుగు వేసింది. ఇప్పటికే అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఈ శాఖ ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తోంది. తాజాగా ఖాళీ స్థలాలు. ఇళ్లకు సంబంధించిన పూర్తి వివరాలను క్షణాల్లో తెలుసుకునే విధంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. సదరు ఇళ్ళు నిషేధిత ప్రాంతాల్లో నిర్మించారా? లేదా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నిర్మించారా? స్థానిక పట్టణ సంస్థ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించారా? బఫర్ జోన్‌లో ఏమైనా నిర్మాణాలు చేపట్టారా? అనుమతులు తీసుకుని దానికి విరుద్ధంగా ఎన్ని అంతస్థులు నిర్మించారు? దానిని ఏ సంవత్సరంలో కట్టారు? ప్రస్తుత యజమాని ఎవరు? సదరు భవనంపై కడుతున్న ఆస్తి పన్ను ఎంత? ఇలా పలు రకాల సమాచారాన్ని తెలుసుకునే వెసులుబాటును కల్పించింది. సీడీఎంఏ వెబ్‌సైట్‌కు వెళ్ళి ల్యాండ్ రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంచుకుని ఇంటి నంబర్‌ను సూచిస్తే చాలు..... మనకు కావాల్సిన వివరాలన్నీ లభ్యమవుతాయి.

రిజిస్ట్రేషన్ శాఖతో ఒప్పందం చేసుకుని ప్రతిస్థలం, ఇంటికి సంబంధించిన వివరాలను జియోట్యాగ్ ద్వారా సమాచారాన్ని సేకరించారు. 72 స్థానిక పట్టణ సంస్థల పరిధిలోని సుమారు పన్నెండున్నర లక్షల ఇళ్ళకు సంబంధించిన పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపరిచామని రాష్ట్ర సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. దీంతో పాటు స్థానిక పట్టణ సంస్థల పరిధిలో కొత్తగా సాగుతున్న ఇళ్ళనిర్మాణాలు, అనుమతులకు విరుద్ధంగా వెలుస్తున్న భవనాలు, ఆస్తిపన్ను తక్కువగా కడుతున్న వారి వివరాలను సులువుగా తెలుసుకునే అవకాశముం టుందన్నారు. ఇళ్ళ రిజిస్ట్రేషన్ పూర్తికాగానే మ్యుటేషన్ కూడా వెనువెంటనే చేసుకునే అవకాశము ఉంటుందన్నారు.

సిటిజన్ సర్వీసు కేంద్రాలు, ఈ సేవా కేంద్రాల ద్వారా కూడా స్థానిక పట్టణ సంస్థల సేవలను నిర్ణీత వ్యవధిలోగానే అందిస్తామన్నారు. అలాగే టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యంలో భవనాల అనుమతులు కూడా ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్నామని వివరించారు. ఇందుకోసం గతంలో ఉన్న నిబంధనలకు పూర్తిగా పక్కనపెట్టి కామన్ అప్లికేషన్ ఫాంను అందుబాటులోకి తీసుకవచ్చినట్లు సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవి వివరించారు. ప్రస్తుతం స్థానిక పట్టణ సంస్థలకు చెందిన మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరుగుతోందని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆమె వెల్లడించారు.

Estd 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 133 • బుధవారం 23 ఆగస్టు 2017 • హైదరాబాద్ * పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad | Khammam

ముహూర్తం
శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: శుద్ధ విదియ రా. 9.58 వరకు, అనంతరం తదియ; నక్షత్రం: పుబ్బ మ. 3.54 వరకు, అనంతరం ఉత్తర;
అమృతకాలం: ఉ. 9.35 నుండి 11.10 వరకు; వర్జ్యం: రా. 11.08 నుండి రా.12.44 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.42 నుండి 12.33 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు



ట్రిపుల్ తలాఖ్ రాజ్యాంగ విరుద్ధం

6 నెలల్లో చట్టం చేయండి

చారిత్రక తీర్పిచ్చిన జడ్జిలు వీరే...


చీఫ్ జస్టిస్ ఖెహర్


జస్టిస్ నారిమన్


జస్టిస్ కె.జోసెఫ్


జస్టిస్ యు.లలిత్


జస్టిస్ ఎ.నజీర్

- లేకపోతే నిషేధం కొనసాగుతుంది
- సమానత్వ హక్కుకు భంగం
- ఖురాన్ మూలసూత్రాలకు వ్యతిరేకం
- చూస్తూ ఊరుకోలేం
- ఇస్లాం దేశాలే నిషేధించాయి... ఇక్కడెందుకు కొనసాగించాలి?
- 3-2 మెజారిటీతో సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం చారిత్రాత్మక తీర్పు

10

ముస్లిమ్ మహిళలకు సమానత్వం ప్రసాదించింది: మోడీ
ఆత్మ గౌరవంతో బతికే హక్కు ఇచ్చింది: అమిత్ షా
తీర్పు చరిత్రాత్మకం... స్వాగతిస్తున్నా: రాహుల్
సుప్రీం తీర్పును గౌరవిస్తాం: ముస్లిం పర్సనల్ లా బోర్డు
తీర్పును గౌరవిస్తాం... అమలు తేలిక్కాదు: అసదుద్దీన్
మాకు ఇది మరిచిపోలేని రోజు: సైరాభానో (పిటిషనర్)
అకృత్యాలకు ఇక తెర: అఫ్రీన్ రెహ్మాన్ (పిటిషనర్)

పోరాడింది ఐదుగురు నారీమణులే


కరీంనగర్: ప్రాజెక్టును త్వరగా నిర్మించాలంటూ చొప్పదండి ఎమ్మెల్యే శోభ, ఎంపీపీ, సర్పంచ్‌ల వినతులు

- సీఎం కేసీఆర్ అపర భగీరథుడని పొగడ్తలు
- కరీంనగర్ జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ
- సానుకూలంగా వినతుల వెల్లువ
- మరో రెండు జిల్లాల్లోనూ అభిప్రాయ సేకరణ
- ప్రాజెక్టు కావాలంటూనే సమస్యలు చెప్పిన రైతులు
- ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని అభ్యర్థన
- ప్రత్యామ్నాయంగా సాగుభూములివ్వాలని వినతి
- ఇళ్లకు ఇళ్లు కావాలని బాధితుల ప్రతిపాదన
- నిర్వాసితులను చైతన్యం చేసి ఒప్పించడంలో అధికార యంత్రాంగం సఫలీకృతం

కాళేశ్వరం జయహో

త్వరగా కట్టండి

ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు విజ్ఞప్తి

కాళేశ్వరం ప్రాజెక్టుని త్వరితగతిన పూర్తి చేయాలని వివిధ జిల్లాల రైతులు కోరుతున్నారు. అది గనక పూర్తయి, దాని ఫలాలు అందుబాటులోకి వస్తే తెలంగాణ జిల్లాలు సస్యశ్యామలమవుతాయని ఆయా ప్రాంత రైతులు అభిప్రాయపడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల్లో మంగళవారం జరిగిన పర్యావరణ అభిప్రాయ సేకరణలో రైతుల నుంచి సానుకూల స్పందన వ్యక్తమైంది. కరీంనగర్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు తమ మనోగతాన్ని స్పష్టంగా వినిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తమ భూములు సస్యశ్యామలం అవుతాయని, అందుకే ఈ ప్రాజెక్టుని వీలైనంత త్వరగా పూర్తిచేయాలని వారు కోరారు. అంతేకాదు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అపర భగీరథుడు అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. అలాగే నిజామాబాద్ జిల్లా మోపాలల్ మండలం మంచిప్ప వద్ద నిర్మిస్తున్న కొండెం మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణానికి రైతులు సమ్మతిస్తూనే..భూములు కోల్పోయే తమకు పూర్తి న్యాయం చేయాలని కోరారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, సాగుభూములు చూపించాలని, ఇళ్లకు బదులుగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తమ డిమాండ్లను కమిటీ ముందు పెట్టారు. బాధితులకు అన్ని రకాలుగా న్యాయం చేశాకే ప్రాజెక్టు పనులు ప్రారంభం అవుతాయని స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ దీనికి సంబంధించి అభిప్రాయ సేకరణ జరగ్గా పలువురు రైతులు సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. ముంపు గ్రామాల ప్రజలు తమ ఆందోళనను వ్యక్తపరిచారు. వామపక్షాల నాయకులు, రైతు సంఘాల నాయకులు బాధితుల పక్షాన మాట్లాడారు. ప్రాజెక్టులకు తాము వ్యతిరేకం కాదంటూనే బాధితులకు న్యాయం చేయాలని మూడు చోట్లా ఒకే రకమైన అభిప్రాయాన్ని వారు వెల్లడించారు. కలెక్టర్లు ఈ ప్రాజెక్టు విశిష్టతను వివరించడం ద్వారా రైతులను చైతన్యం చేయడం ద్వారా వారిని ఒప్పించే ప్రయత్నం చేయడంలో కృతకృత్యులయ్యారు.

వివరాలు 2లో...

తాగునీటి అవసరాలకు

45 టీఎంసీలు

- కృష్ణా బోర్డు సమావేశంలో తెలంగాణ నీటిపారుదలశాఖ ప్రతిపాదన
- ప్రోరేటా ప్రకారం నీటి పంపిణీ చేస్తామని తేల్చిచెప్పిన కృష్ణా బోర్డు
- కేంద్రానికి లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం
- టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకు ఇరు రాష్ట్రాల అధికారులు ఆమోదం

2


హైదరాబాద్: బుద్వేల్‌లో రెడ్డి హాస్టల్ కాంప్లెక్స్‌కు భూమిపూజ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, చిత్రంలో మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎంపీలు జితేందర్ రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, రాజాబహద్దూర్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి తదితరులు

ఎడ్యుకేషన్ హబ్‌లా రెడ్డిహాస్టల్

- పేదలకోసం నిరంతరం తపించిన వ్యక్తి రాజాబహుదూర్ వేంకటరామిరెడ్డి
- బుద్వేల్‌లో రెడ్డిహాస్టల్ శంకుస్థాపన సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

2


తమిళనాట మళ్ళీ శిబిర రాజకీయాలు

9



సురేఖ, సాకేత్‌లకు అర్జున అవార్డు





- దేవేంద్ర, సర్దార్ సింగ్‌లకు ఖేల్‌రత్న
- ఏడుగురికి ద్రోణాచార్య పురస్కారాలు
- 17మందికి అర్జున అవార్డులు
- ముగ్గురికి ధ్యాన్‌చంద్ పురస్కారాలు
- కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ వెల్లడి
- 29న రాష్ట్రపతి చేతులమీదుగా ప్రదానం

వివరాలు 11లో...





సిద్ధార్థ్@ డ్రగ్స్ దందా

సినీ ప్రముఖులతో డ్రగ్స్ సంబంధాలు

- మసాజ్ సెంటర్ల ముసుగులో హైటెక్ వ్యభిచారం నిర్వహణ
- పోలీసు విచారణలో చేదు నిజాలు వెల్లడి చేసిన సిద్ధార్థ్
- కొకైన్‌కూ అలవాటు పడ్డాడు.. సిద్ధార్థ్‌ని పట్టించింది ప్రేయసే!

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సైబరాబాద్ పరిధిలో మసాజ్ సెంటర్ల ముసుగులో హైటెక్ వ్యభిచారం గుట్టుగా నడిపించడంలో కీలక పాత్ర పోషించిన సిద్ధార్థ పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించినట్లు సమాచారం. స్పా, మసాజ్ సెంటర్లలో వ్యభి చారం మాత్రమే కాకుండా డ్రగ్స్ వినియోగం కూడా జరుగుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సిద్ధార్థకు సినీ రంగానికి చెందిన ఇద్దరితో సంబంధం ఉందని కూడా పోలీసులు గుర్తించారు. వారిలో ఒకరు క్యారెక్టర్ ఆర్టిస్టు, మరొకరు వ్యాంప్ పాత్రలు చేసే నటి అని పోలీసుల విచారణలో సిద్ధార్థ వెల్లడించినట్లు సమాచారం. ఓ రియాలిటీ షోలో నటించే నటి, నటుడు స్పాలకు వచ్చే సన్నిహితుల కోసం, వీఐపీ కస్టమర్ల కోసం వెండితెర, బుల్లితెరల నుంచి కొందరని సరఫరా

8వ పేజీలో...

భవానీ జాతరకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం



8

కురంపల్లిలో జంటహత్యలు

మృతులిద్దరు అన్నదమ్ములు..భూ వివాదమే కారణమా?





8

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

బుధవారం 23 ఆగస్టు 2017

వివక్ష చెల్లదన్న 'సుప్రీం'

మహిళలు వివక్షకు గురి కావడం అనాదిగా సాగుతున్నదే. కుల, మతాల పేరిట సాగే దురాచారాలపై పోరాటాలు నాగరిక సమాజంలో భాగమయ్యాయి. సంప్రదాయం, ఆచారం పేరిట లింగ వివక్ష కొనసాగేందుకు ఊతం ఇచ్చేవారు మనలోనే ఉన్నారు. వివక్షకు వ్యతిరేకంగా విద్యావంతులైన మహిళలు సామాజిక ఉద్యమాలను నిర్వహించడమే కాకుండా, న్యాయ పోరాటాలు సాగిస్తున్నారు. ఉన్నత విద్యావంతురాలైన షయరా బానో అనే తలాఖ్ బాధితురాలు జరిపిన న్యాయపోరాటం ఫలించింది. ఇస్లామిక్ సమాజంలో ఒక పురుషుడు తన భార్యకు మూడు సార్లు తలాఖ్ చెప్పి విడాకులిచ్చే సంప్రదాయం రాజ్యాంగ రీత్యా, చట్టరీత్యా చెల్లదని సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు ప్రజాస్వామ్య స్ఫూర్తికి సంకేతం. ఇది సనాతన ఆచారం. చట్టరీత్యా, రాజ్యాంగరీత్యా చెల్లదని సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పుపై దేశంలో అధిక సంఖ్యాకులు హర్షాన్ని వ్యక్తం చేయగా, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వంటి సంస్థలు సహజంగానే వ్యతిరేకించాయి. మతపరమైన ఆచారాల్లో న్యాయస్థానాలు సైతం జోక్యం చేసుకోరాదంటూ ఆ సంస్థల నాయకులు తీవ్రంగా స్పందించారు. అయితే, ఈ తలాఖ్ సంప్రదాయాన్ని ప్రపంచంలో 22 ఇస్లామిక్ దేశాలు ఇప్పటికే నిషేధించాయి. ఈ ఆచారాన్ని మతపరమైనదిగా కాకుండా, స్త్రీ, పురుషుల సమానత్వానికి భంగం కలిగించేదిగా చూడాలన్నది ఆధునికుల వాదన. ఇది సమంజసమైనదే. చదువు, సంస్కారం, నాగరిక ఆధునిక జీవన విధానంలో భాగమైనప్పుడు పాత కాలపు ఆచారాలను ఇంకా పట్టుకుని వేళ్లాడటమేమిటన్న ప్రశ్న సహేతుకమైనదే. హిందూ సమాజంలో కూడా ఇలాంటి దురాచారాలు ఏనాడో వందల సంవత్సరాల క్రితం వంగ దేశంలో రాజారామమోహన్‌రాయ్ ప్రారంభించిన ఉద్యమం ప్రభావం ఆంధ్రదేశంలో కూడా వ్యాపించింది. మరణించిన పతి చితిపై భార్యను సజీవ దహనం చేసే దురాచారాన్ని ఆనాడు రాజారామమోహన్‌రాయ్ తీవ్రంగా వ్యతిరేకించి ఉద్యమాన్ని నడిపారు. కన్యాశుల్కం పేరిట కాటికి కాళ్లు చాపుకున్న ముసలి వారికి ముక్కుపచ్చలారని బాలికలను కట్టబెట్టే దుష్టసంప్రదాయాన్ని మహాకవి గురజాడ తీవ్రంగా వ్యతిరేకించి పుట్టిడి బొమ్మ పూర్ణమ్మ కథతో జనాన్ని జాగృతం చేశారు. అలాగే, చిన్న వయసులో వితంతువులైన మహిళలు రక్త సంబంధీకుల ఇళ్లలో వారికి పరిమితమైన దుష్ట సంప్రదాయాన్ని రూపుమాపేందుకు నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులుగారు స్త్రీ విద్య, వితంతు వివాహాలను ప్రోత్సహించారు. సమాజంలో విప్లవాత్మక పరిణామాలకు దోహదం చేశారు. అలాగే, తెలంగాణలోని మారుమూల ప్రాంతాల్లో అప్పుడప్పుడు బయటపడుతున్న జోగిని వ్యవస్థకు వ్యతిరేకంగా స్త్రీవాద ఉద్యమకారులు తరచూ పోరాటాలు సాగిస్తున్నారు. ప్రజాస్వామ్య జీవన విధానం అమలులోకి వచ్చిన తర్వాత సమాజంలో ఇంకా వివక్షమేమిటన్న స్త్రీవాద ఉద్యమకారుల ప్రశ్న సహేతుకమైనదే. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, జాతిపిత మహాత్మాగాంధీల పుణ్యమా అని దేశంలో అంటరానితనం చాలా వరకూ అదుపులోకి వచ్చింది. పారిశ్రామిక విప్లవం కారణంగా, కులాలు, మతాలతో నిమిత్తం లేకుండా అన్ని వర్గాల వారూ తమ ఆఫీసు క్యాంటీన్లలో కలిసి భోజనం చేయడం, తాము తెచ్చుకున్న పదార్థాలను మార్పిడి చేసుకోవడం ఆధునిక జీవన విధానంలో భాగమైనప్పుడు ఇంకా వివక్షేమిటన్న ప్రశ్న సహేతుకమైనదే. మనుషుల మధ్య అడ్డుగోడలు ఉన్న వివక్షను వ్యతిరేకంగా విడుదలవుతున్న చలనచిత్రాలు, టెలివిజన్ చానెల్స్‌లో ప్రసారమవుతున్న సీరియల్స్ సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇక్కడ కుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా సమాన హక్కుల కోసం పలు ప్రాంతాల్లో సాగుతున్న ఉద్యమాల ప్రభావం కూడా ఏమాత్రం తక్కువ కాదు. తలాఖ్‌కి వ్యతిరేకంగా ముస్లిం మహిళలు జరుపుతున్న పోరాటాన్ని లింగ వివక్ష కోణం నుంచే చూడాలని సమాజ హితైషులు చాలా కాలంగా కోరుతున్నారు. వారి అభిప్రాయాన్నే సుప్రీంకోర్టు తాజా తీర్పు ప్రతిబింబించింది.

అయితే, రాజకీయ ప్రయోజనాల కోసం మతచాందస వాదాలను వ్యాపింపజేసేవారు అన్ని సమాజాల్లోనూ ఉంటారు. సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తున్నవారంతా ఆ కోవకు చెందిన వారే. ఉమ్మడి పౌరస్మృతి అనేది బీజేపీ నినాదం. మత పరమైన తేడాలు లేకుండా అందరికీ ఒకే చట్టం, నియమావళి ఉండాలని ఆ పార్టీ కోరుతోంది. ముస్లిం సంఘాలే కాకుండా, లౌకికవాద పార్టీలు కూడా బీజేపీ వాదాన్ని వ్యతిరేకిస్తున్నాయి. తలాఖ్‌ని ఉమ్మడి పౌరస్మృతి కోణం నుంచి వ్యతిరేకిస్తూ గతంలో పిటిషన్లు దాఖలు కావడంతో దీనికి మతపరమైన రంగు వచ్చింది. పూర్వపు పిటిషనర్లకు భిన్నంగా ఉత్తరాఖండ్ కాశీపూర్‌కి చెందిన షయరా బానో అనే తలాఖ్ బాధితురాలు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ దురాచారంలో లింగవివక్ష ఉందని నిరూపించడంలో ఆమె సఫలీకృతమయ్యారు. సర్వోన్నత న్యాయస్థానం లో ఐదుగురు సభ్యులు గల ధర్మాసనంలో ముగ్గురు ఆమె వాదనను సమర్థించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని వారు తీర్పు చెప్పారు. అంతకుముందు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ కేహార్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ దురాచారాన్ని ఆరు నెలలపాటు నిలిపి వేసి కొత్త చట్టాన్ని తీసుకుని రావాలని ఆదేశించింది. అయితే, చట్టాల కన్నా సమాజాన్ని జాగృతం చేయడం ద్వారానే దురాచారాలను రూపుమాపగలమని సంస్కర్తలు రుజువు చేశారు. అన్ని మతాలు స్త్రీ, పురుష సమానత్వాన్నే ప్రబోధిస్తున్నాయి. మతం పేరిట సాగే దురాచారాలను ఎదుర్కొనేందుకు సంఘసంస్కర్తల పోరాటమే మనకు స్ఫూర్తి.

వ్యభిచార ముఠాలపై ఉక్కుపాదం మోపాలి

రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో, నగరాలు, పట్టణ కేంద్రాలలో పోలీసు శాఖ స్పందించకపోవడంతో వ్యభిచారం జోరుగా సాగుతోంది. తాజాగా రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున స్పా కేంద్రాలు, బాడీ మసాజ్ సెంటర్లలో వ్యభిచారం బట్టబయలైంది. థాయ్‌లాండ్ దేశానికి చెందిన మహిళలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వ్యభిచారం ఎంత హైటెక్ పద్ధతులలో జరుగుతోందో ఈ సంఘటనను బట్టీ అర్థమవుతోంది. ఈ వ్యభిచార దందాలో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని అమాయకులైన మహిళలను, విద్యార్థినులను ఉద్యోగాల పేరిట ఎరవేసి వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారిని ఈ రొంపిలోకి దించుతున్నారు. కొంతమంది బ్రోకర్లు గ్రామాలలో, పట్టణాలలో ఏజెంట్లను పెట్టుకుని ఈ దందాను నిరాటంకంగా కొనసాగిస్తున్నారని తెలుస్తోంది.

విలాసవంతమైన భవనాలను అద్దెకు తీసుకుని, ఐదు నక్షత్రాల హోటల్స్‌లో కూడా వ్యభిచారం నడుస్తోంది. బాడీ మసాజ్, స్పా సెంటర్లు బ్యూటీ పార్లర్‌లలో అందమైన యువతులను పెట్టుకొని మసాజ్‌ల పేరిట వచ్చే పురుషులకు యువతుల చేత మసాజ్ చేయించి తదనంతరం వ్యభిచారం నడిపిస్తూ నిర్వాహకులు లక్షలు ఆర్జిస్తున్నారు. వరంగల్, కరీంనగర్, యాదాద్రి, భువనగిరి, సూర్యాపేట జిల్లాలలో కొన్ని గ్రామాలు వ్యభిచార కేంద్రాలకు నిలయాలుగా మారాయి. ఆ గ్రామాల పేరు పలికితేనే వింతగా చూస్తారు. మన రాష్ట్రం నుండి వ్యభిచారంను పారద్రోలడానికి ప్రభుత్వం పూర్తిగా చర్యలు తీసుకోవాలి. ఈ దందాలో భాగస్వాములైన రాజకీయ నాయకులను కూడా ఎంతటివారైనా గుర్తించి కఠినంగా శిక్షించాలి.


-కామిడి సతీష్‌రెడ్డి
జడలపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

మంచి మాట

సంతృప్త మనస్కుడు ఎప్పుడూ పేదవాడు కాడు, అసంతృప్త మనస్కుడు ఎప్పుడూ భాగ్యవంతుడు కాడు.

● డార్జ్ ఇలియర్

సమస్యలు లేని వ్యవస్థ కేసీఆర్ ఆకాంక్ష



ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు మరో బృహత్తర కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. చారిత్రాత్మకమైన, అత్యవసరమైన భూ రికార్డులను సరిచేసే కార్యక్రమమే ఆ కార్యక్రమం. దీనివల్ల భూ రికార్డులన్నీ సరవుతాయి. భూ వివాదాలనేవి ఎప్పటికీ లేకుండా ఇది చెక్ పెడుతుంది. కిందటిసారి 81 సంవత్సరాల క్రితం భూ రికార్డులను సరిచేసే కార్యక్రమాన్ని చేపట్టారు. నిజామ్ హయాంలో 1936లో ఇది సాగింది. అంటే అప్పటికి మనకు స్వతంత్రం కూడా రాలేదు. ప్రస్తుతం చేపడుతున్న రికార్డుల సరిజేత కార్యక్రమంలో 55వేల మంది ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఉద్యోగులు పాల్గొంటారు. రాష్ట్రంలో ఉన్న పదివేల 800కు పైగా ఉన్న రెవెన్యూ గ్రామాలలో ఈ ప్రత్యేక సర్వేను నిర్వహిస్తారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు సర్వే పూర్తవుతుంది. సమస్యలకు పరిష్కారమూ దొరుకుతుంది. తెలంగాణ నలుచెరగులా చేపట్టే ఈ చారిత్రాత్మకమైన కార్యక్రమం గురించి తెలంగాణ రాష్ట్ర సమితి ఎన్నికల ప్రణాళికలోనే హామీ ఇచ్చింది. పార్టీ ఆ హామీని ఇప్పుడు నెరవేర్చే దిశగా అడుగులేస్తోంది.

సర్వే ఎలా చేయాలి.. అనే అంశంపై ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు మార్గదర్శకత్వాన్ని నిర్దేశించారు. సర్వే, సరిష్కారాల కార్యక్రమం దిగ్విజయం కావడానికీ, ఎలా నిర్వహించాలీ అనే అంశాలపై ఆయన సూచన చేశారు. భూరికార్డుల సర్వే కోసం వచ్చే సిబ్బందికి సహకరించాలంటూ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఆయన పిలుపు కూడా ఇచ్చారు. ప్రజలతో పాటు ముఖ్యంగా రైతులు దీనికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా బాధ్యత తీసుకోవాలని రైతులను ముఖ్యమంత్రి కోరారు. ప్రతి రైతు తన గ్రామంలో నాయకుడిగా దారి చూపాలన్నారు.

సర్వే కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని సంస్థలను గుర్తించాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి కెసిఆర్ తన ప్రసంగంలో తెలిపారు. సర్వే ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ఈ కార్యక్రమానికి అవసరం లేదు. సర్వే ఆఫ్ ఇండియా అంటే భారత ప్రభుత్వానికి సంబంధించిన అత్యంత పురాతనమైన శాస్త్రీయ విభాగం. ప్రపంచంలోనే విస్తృతమైన మ్యాపింగ్ సంస్థలలో ఒకటి. మనకు సర్వే కోసం యువకుడు, ఉత్సాహవంతుడైన ఒక ఐఏఎస్ అధికారి కావాలన్నారు ముఖ్యమంత్రి. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఈ సర్వే కార్యక్రమాన్ని నిశితంగా పరిశీలించేందుకూ, పర్యవేక్షించేందుకూ యువ ఐఏఎస్ చాలన్నారు. రెవెన్యూ రికార్డులైన పాస్ బుక్కులు, పహాణీల విధానాన్ని సరళీతరం చేయాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.


ఏడాదికి రెండు పంటలకూ ఎకరానికి 8వేల రూపాయల దిగుబడి సహాయంగా రైతుకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఏడాది నుంచి ఇది అమలులోకి వస్తుంది. దీన్ని పక్కాగా అమలు చేయాలంటే క్షుణ్ణమైన భూ సర్వే అవసరం. ఏ రైతు పేర ఎంత ఉంది.. ఎక్కడ ఉంది అనే అంశాలను కచ్చితంగా తెలుసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎంత భూమి ఉంది? అదెక్కడ ఉంది? అనే అంశాలపై స్పష్టంగా తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. ఏ భూమి ఎవరి పేరున రిజిస్టరై ఉందో కూడా తెలియాలన్నారు. ఏ క్యాటగిరీ కింద ఆయా భూములను చూపించారో తెలుసుకునేందుకూ, రాష్ట్రంలోని భూముల వివరాలు రూపొందించాల్సుంది. జాబితా రూపొందించిన అనంతరం, ఎకరానికి 8వేల రూపాయల చొప్పున ఇచ్చే సహాయం అసలు సిసలు లబ్ధిదారులకు అందుతుంది. మిగిలిన పథకాలకూ ఇది ఉపయుక్తంగా ఉంటుంది. భూ వివాదాలకు ఈ సర్వే చరమగీతం పాడుతుంది. భూ సర్వేలు సుమారు వెయ్యేళ్ళ క్రితం తమిళనాడులో రాజరాజ చోళుని సమయంలో ఆదాయం నిమిత్తం మొట్టమొదటిసారి నిర్వహించారు. ఉత్తర భారతంలో షేర్‌షా సూరి కౌలు భూముల వివాదాలను పరిష్కరించేందుకు ఒక పద్ధతికి శ్రీకారం చుట్టాడు.


బ్రిటన్ హయాంలో సేలం జిల్లాలో రైత్వారీ పరిష్కార సర్వేలను చేపట్టారు. 1793-1798 మధ్యలో మద్రాస్ ప్రెసిడెన్సీ సమయంలో ఈ సర్వే నిర్వహించారు. భూముల హద్దులను నిర్ణయించడం, కచ్చితమైన పటాన్ని అన్ని భౌగోళిక గుర్తులతో రూపొందించడం ఈ సర్వే ప్రధానోద్దేశం. భూముల సర్వే కార్యక్రమాన్ని తెలంగాణ ప్రాంతంలో సర్ సాలార్ జంగ్-1 నిర్వహింపచేశారు. తెలంగాణలో అదే మొదటి ప్రయత్నం. 1875లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సర్వే అండ్ సెటిల్‌మెంట్ ఏర్పాటైంది. భూ ఆదాయాన్ని నిర్ణయించేందుకు ఇందులో ప్రాధాన్యతనిచ్చారు. ప్రభుత్వ పోరంబోకు భూములనూ, వృధాగా పడి ఉన్న స్థలాల సర్వేను ఇందులో చేపట్టలేదు. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భూములకు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించాలనీ, పహాణీలో 1బి ఫారమ్ అవసరముందా అనే అంశాన్ని అధ్యయనం చేయాలనీ ముఖ్యమంత్రి తాజా సర్వేకు దిశానిర్దేశం చేశారు. 81/1/ఎ వంటి భూములు, భూ రికార్డులకు కేటాయించిన నెంబర్లతో ఉపయోగమేమిటి? కూడా పరిశీలించాలని సూచించారు.

రైతులకు భూములున్న చోట ప్రత్యేకంగా సర్వే నెంబరును కేటాయించే అవకాశాలను కూడా కేసీఆర్ పరిశీలిస్తున్నారు. ఈ నెంబరు రైతు పేరుమీదే ఉండాలన్నారు. ఇద్దరు రైతుల మధ్య భూ విక్రయం చోటుచేసుకుంటే ఆ లావాదేవీ కొనుగోలుదారు సర్వే నెంబరుకు దానంతటదే బదిలీ అయిపోయేలా ఏర్పాటు చేస్తున్నారు. ఇతర దేశాల్లోని విధానాలను కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. అధికారుల బృందం ఆయా దేశాలలో పర్యటించి అధ్యయనం చేయాలని కూడా సూచించారు. ఆయా దేశాలలో అమలవుతున్న విధానాలను క్షుణ్ణంగా పరిశీలించాలనేది ముఖ్యమంత్రి అభిప్రాయం. న్యూజీల్యాండ్, థాయ్‌ల్యాండ్ దేశాలలో భూముల వివరాలు కచ్చితంగానూ, వివాదరహితంగానూ నిర్వహిస్తున్నారు. అధికారుల బృందం విదేశాలలో పర్యటించేటప్పుడు రైతు సంఘాలతో కూడా భేటీ కావాలనీ, అభిప్రాయాలను సేకరించాలనీ సీఎం సూచిస్తున్నారు. రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష. దీనివల్ల లంచగొండితనానికీ, అవినీతికీ అడ్డుకట్ట పడుతుందని ఆయన అభిప్రాయం. ఎమ్ఆర్ఓ, ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్ స్థాయిలోని రెవెన్యూ కోర్టులకు మంగళం పాడాలని సీఎం అభిలషిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని రెవెన్యూ కోర్టు ఒక్కటే ఉండాలని, మిగిలినవాటి అవసరం లేకుండా చేయాలనీ అంటున్నారు. జిల్లా కోర్టులు సత్వరం, విశ్వసనీయమైన తీర్పులివ్వాలని ఆయన అభిప్రాయపడుతున్నారు. ఈ మొత్తం వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి చెబుతున్నారు. అవసరమైతే రెవెన్యూ చట్టాలను అటకెక్కించి, కొత్త చట్టాలను రూపొందించాలి. ఈ రకమైన వ్యవహార శైలి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులకు ఉపయుక్తంగా ఉంటుంది. భూ వ్యవస్థను ఏకీకృతం చేయాలని సీఎం దృఢ నిశ్చయంతో ఉన్నారు. జిల్లా స్థాయి రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లు, ఎమ్మార్వోలు, ఇతర రెవెన్యూ అధికారులకూ, కార్యాలయాలకు ఆధునిక కంప్యూటర్ వ్యవస్థను ఏర్పాటు చేసి, దీన్ని జిల్లా కార్యాలయానికి నేరుగా అనుసంధానించాలని భావిస్తున్నారు. ఇది పూర్తి స్థాయిలో సిద్ధమైతే ప్రతి అధికారికీ అవసరమైన సమాచారం 24 గంటలకూ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది. ప్రతి రెవెన్యూ అధికారికీ బాధ్యతలను నిర్దేశించాలనేది కూడా సీఎం ఆలోచన. గ్రామ స్థాయి నుంచే రైతు సంఘాలు, సమన్వయ కమిటీలు ఏర్పడాలని కేసీఆర్ అనుకుంటున్నారు. సర్వే కార్యక్రమం చేపట్టడానికి ముందుగానే ఇవి ఏర్పాటు కావాలనేది ఆయన అభిప్రాయం. సమన్వయ కమిటీ సభ్యులను సాధ్యమైనంత త్వరగా నియమించాలని ఆయన సూచిస్తున్నారు. రాష్ట్రంలో 10వేల 800కు పైగా రెవన్యూ గ్రామాలున్నానీ, వీటిలో సర్వేకు 3700 బృందాలను నియమించాలని సీఎం భావిస్తున్నారు. ఈ బృందాలలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఉద్యోగులుంటారు. ప్రతి బృందంలోనూ 15మంది ఉద్యోగులుంటారు. వీరికి విఆర్ఓ, ఎమ్మార్వో, సర్వేయర్లు సహకరిస్తారు. ప్రతి బృందం మూడు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తుంది. ప్రతి గ్రామంలోనూ సర్వేను 20 రోజుల్లో పూర్తిచేయాల్సుంటుంది. ఈ డిసెంబరుకు సర్వే మొత్తం పూర్తవ్వాలి. సర్వే, సెటిల్‌మెంట్ పూర్తయిన తరవాత ప్రస్తుతం అమల్లో ఉన్న స్టాంపులను రద్దు చేయాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. ఈ స్టాంపులే అవినీతి, వివాదాలకూ తావిస్తున్నాయని ఆయన అభిప్రాయపడుతున్నారు. అవినీతి రహిత వ్యవస్థను ఆవిష్కరించేందుకు రెవెన్యూ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, సమస్యలు లేని సమాజాన్ని నెలకొల్పాలన్నది ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు ఆకాంక్ష.

-వనం జ్వాలా నరసింహారావు

మహేతిహాసాల వెనుక పీవీఆర్కే





దేశం నాకేం ఇచ్చింది అని ప్రశ్నించే వాళ్ళే ఎక్కువ. దేశానికి నేనేం ఇవ్వగలను, దేశానికి నేనేం చెయ్యగలను, దేశానికి నేనేం ఇచ్చాను అని ప్రశ్నించుకుంటే, మంచి జవాబు తమకి తాము ఇచ్చుకో గలిగేవారు అతికొద్దిమందే ఉంటారు. ఆ కోవలో వారు శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్. రాజులూ, మంత్రులూ, అధికారులూ - ఎవరైనా పదవి నుండి తనకీ, తన వారసులకీ తరతరాలకీ సరిపోయేలా ఎలా చూసుకోగలం, ఎలా చేసుకోగలం అని తలమునలవుతూ ఉంటారు. కొందరే తరతరాలకీ ఉపయోగపడే పనులు చేసి చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారు. ఈ రెండో కోవలో వారు పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారు.

ఆయన ఏ పదవిలో ఉన్నా, పదవిలో లేకపోయినా భగవంతుడు ఇచ్చిన ఈ జన్మని సార్థకం చేసుకోవడానికీ ప్రయత్నం చేశారు. ఎక్కడ ఉంటే అక్కడ ఎంత ఎక్కువ సేవా కార్యక్రమాలు కానీ, ఆ రంగంలో చేయవలసిన పనులూ, మార్పులూ - చేసి తీరడం ఆయన స్వభావం. ఆయన చేసిన ఒకానొక కార్యక్రమం, ఆయన వేసిన చిన్న విత్తనం మహావృక్షంలా ఎదుగుతూ ఉన్న దానితో నాకు నేరుగా సంబంధం ఉంది. పి.వి.ఆర్.కె. గారు ఆ విత్తనాన్ని 1979లో వేశారు, అది ఇప్పటికీ ఇంకా ఎదుగుతూనే ఉంది, వ్యాపిస్తూనే ఉంది. అది ఆయన తి.తి.దే.

కార్యనిర్వహణ అధికారిగా ఉండగా ప్రారంభించిన కార్యక్రమం - మా నాన్నగారు శ్రీ ఉషశ్రీ (ఆకాశవాణి) గారి చేత వచన భాగవతం రాయించి, తి.తి.దే. ద్వారా అచ్చువేయించడంతో ప్రారంభించారు.

అప్పటికి, ఉషశ్రీ గారి భారత, రామాయణ ప్రవచనాలు ఆంధ్రదేశమంతటా ప్రజల మనసుల్లో, గుండెల్లో నిండిపోయి ఉన్నాయి. ఉషశ్రీ గారి రచనశైలి అటు పండితులకీ ఇటు పామరులనీ కూడా ఆకర్షించింది. ఆయన ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో రామాయణ, భారత, భాగవతాలు వినిపించే సమయంలో రోడ్లు కర్ఫ్యూ విధించినట్లుండేది అనేవారు. ప్రజలు రేడియోకి అతుక్కుపోయేవారు.

పి.వి.ఆర్.కె. గారు, హిందూ ధర్మప్రచారంలో భాగంగా పుస్తక ప్రచురణని ఒక యజ్ఞంగా ప్రారంభించారు. అప్పటికి ఉషశ్రీ గారు రేడియోలో వినిపించిన భారత, రామాయణాలని, మా సొంత ప్రచురణ సంస్థ - భారత ప్రచురణలు ద్వారా ముద్రించి ప్రజలకి అందించారు. భాగవతం కూడా రాయాలనే ఆకాంక్షతో రచనా కార్యక్రమం మొదలుపెట్టారు. మొదలు పెట్టిన, వారం రోజులకే ప్రసాద్ గారి నుండి నాన్నకి కబురు వచ్చింది - దేవస్థానం వారు ప్రచురించడానికి భాగవతం రాసి ఇమ్మని, అంతా భగవదేచ్ఛ అనుకున్నారు నాన్నగారు. నాన్నగారు రాసిన భాగవతం 25 వేల ప్రతులు ముద్రించి, పుస్తకం రెండు రూపాయల చొప్పున అత్యంత స్వల్ప ధరకి అందించారు పి.వి.ఆర్.కె. గారు. వాటికి ప్రజల ఆదరణని గమనించి, నాన్నగారు రాసిన భారత, రామాయణాలని కూడా ఒక్కొక్కటి పదివేల ప్రతులు తొలిముద్రణగా ప్రచురించారు దేవస్థానం వారు. అప్పుడే నాన్నగారి చేత సుందరకాండ కూడా రాయించి, కృష్ణా పుష్కరాల సమయంలో ఒకేసారి అరవై వేల ప్రతులు ముద్రించి, పుస్తకాన్ని రెండు రూపాయలకి అందించారు. భారతంలో ఉపాఖ్యానాలు కూడా నాన్నగారిని రాయమని ఆ పుస్తకాన్ని ప్రచురించారు దేవస్థానం వారు. అలా రామాయణ, భారత, భాగవత, సుందరకాండ, భగవద్గీత, ఉపాఖ్యానాలు - ప్రజలకి తేలికగా అర్థమయ్యేలా, అందులోని మానవత్వపు విలువలు కూడా ప్రజలకి అందేలా నాన్నగారు రాసిన గ్రంథాలన్నింటినీ, ప్రసాద్ గారు తిరుపతి వెంకన్న ప్రసాదంలా ప్రజలందరికీ - అందుబాటు ధరలో తీసుకువచ్చారు. ఇది జరిగి ఇప్పటికి 38 సంవత్సరాలు అయ్యింది. ఇప్పటికీ ఆనాడు ఆయన ప్రారంభించిన ఆ యజ్ఞం కొనసాగుతూనే ఉంది. అప్పుడు మొదలుపెట్టిన ఉషశ్రీ గ్రంథాల ప్రచురణ ఈనాటికీ కొనసాగుతూనే ఉంది. ప్రతి గ్రంథం పది లక్షల ప్రతులకి పైగా దేవస్థానం ముద్రించింది. రెండు సంవత్సరాల క్రితం నేను ఒకసారి పి.వి.ఆర్.కె. గారితో మాట్లాడాను - అప్పటికి మా నాన్నగారు ఉషశ్రీ గారి జీవిత కథని మేము రాస్తున్నాము. నాన్నగారు చాలాసార్లు పివిఆర్‌కె ప్రసాద్ గారు తి.తి.దే.లో చేస్తున్న పుస్తక ప్రచురణ యజ్ఞం గురించి చెప్తూ ఉండేవారు. నాన్నగారి జీవిత కథలో పివిఆర్‌కె గారి ప్రస్తావన ఉండి తీరాలి అని, వారి జ్ఞాపకాలు పంచుకోమని అడిగాను. అప్పుడు ఆయన.. మన మహేతిహాసాలు జనసామాన్యానికి కూడా అందేలా చేయాలంటే ఉషశ్రీగారే రాయాలి అని నిర్ణయించుకున్నాను. ఆయనచేత రాయించి ప్రచురణ మొదలుపెట్టాను. ఆ సమయంలో నాకు చాలా ఆటంకాలు ఎదురయ్యాయి. కొందరు సంస్కృత పండితులూ, విద్వాంసులూ, అడ్డుపడడానికి ప్రయత్నించారు. మేము ఉండగా, ఉషశ్రీ గారిచేత రాయించడం ఏమిటి అని ప్రశ్నించారు. అయితే సామాన్య ప్రజలకి కూడా అర్థం అయ్యేలా పుస్తకాలు అందించాలని అనే నా లక్ష్యం నెరవేరాలి అంటే ఉషశ్రీ గారిచేత రాయించాలి అని దృఢంగా నిశ్చయించుకున్నాను, ఆ పనే చేశాను.. అన్నారు. 1979లో పివిఆర్‌కె గారు ఎంత సరైన నిర్ణయం తీసుకున్నారు అనడానికి నిదర్శనమే, ఈనాటికీ తి.తి.దే. వారు కొనసాగిస్తున్న ఉషశ్రీ గారి భారత, రామాయణాది గ్రంథ ప్రచురణ.. ఎంతమంది రచనలు ఇలా దశాబ్దాలపాటు మళ్ళీ మళ్ళీ లక్షల సంఖ్యలో ముద్రితం అవుతాయి. ఎవరిచేత ఏ పని చేయిస్తే లక్ష్యసిద్ధి జరుగుతుంది అని సక్రమంగా ఆలోచించగలిగే శక్తి అధికారులకి ఉండాలి. అటువంటి శక్తి సంపూర్ణంగా ఉన్న వారు శ్రీ పివిఆర్‌కె గారు.

-డాక్టర్ గాయత్రిదేవి,
ఆయుర్వేద ఫిజిషియన్

మోడీ తలచినదే!



అనిత నల్లూజ
సీనియర్ పాత్రికేయురాలు

ట్రిపుల్ తలాక్ మీద సుప్రీంకోర్టు తీర్పు ముస్లిం మహిళా లోకాన్ని హర్షాతిరేకంలో ముంచెత్తింది. తలాక్ చట్టం బాధితులుగా వారి ఆనందాన్ని అర్థం చేసుకోవచ్చు. సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఎంతో విశిష్టమైన ఆదేశాలిచ్చినట్టు దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్న అభిప్రాయాలు అద్దం పడుతున్నాయి. ఈ విషయంలో విజేతలెవరంటే కేసు వేసిన ముస్లిం మహిళల కన్నా ప్రధానమంత్రి నరేంద్ర మోడీనే ప్రధానంగా చెప్పుకోవాలి. ఎందుకంటే..ఆయన అభీష్టానికి అనుగుణంగానే సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. అసలీ తేనెతుట్టెని కదిలించడంలోనే ఆయన ఎంతో లౌక్యం ప్రదర్శించారు. ఆనాడు రాజీవ్ గాంధీకి లేనిది..ఈరోజు మోడీకి ఉన్నదీ అదే. మోడీ ముందుగా ఈ వివాదాన్ని జాతీయస్థాయిలో చర్చకు పెట్టారు. చర్చల్లో బాగా నలిగింది. విభిన్న వర్గాల మనోగతం బహిర్గతమైంది. ఏ విషయమైనా..ఎంతటి భిన్నాభిప్రాయాలున్నా..అది బహిరంగ చర్చకు వస్తే ఎంతటి సౌలభ్యముంటుందో ఈ తలాక్ చర్చ ద్వారా మరోసారి తేటతెల్లమైంది. ప్రధాని మోడీ ఇక్కడే సగం విజయం సాధించారు.

దశాబ్దాలుగా ఈ అంశం మీద స్పష్టమైన వైఖరి తీసుకోకుండా నానుస్తూ వచ్చిన రాజకీయ పార్టీలకు ఇప్పుడు చిక్కు సమస్యే. ముఖ్యంగా సుప్రీంకోర్టు..పార్లమెంటులో చట్టం చేయాలని ఆదేశించడం ద్వారా ఆయా రాజకీయ పార్టీలుతమ కుబుసాన్ని విడిచి రంగంలోకి దిగాల్సిన అనివార్యస్థితి ఏర్పడింది. తద్వారా సుప్రీంకోర్టు పార్లమెంటుకి బాధ్యత అప్పగించి మంచిపని చేసింది. చట్టాలు చేయాల్సిన రాజకీయ ప్రజాప్రతినిధులు చాలా సందర్భాల్లో ఆపని చేయకుండా..రాజకీయ కోణంలో ప్రవర్తించడం మనం చూస్తున్నాం. సుప్రీంకోర్టు ఆదేశంతో ప్రధాని మోడీ పని మరింత సులువయ్యే అవకాశాలు మెరుగయ్యాయి. తలాక్... తలాక్... తలాక్... అని మూడు సార్లు భర్త అంటే, ముస్లిం మహిళకు విడాకులిచ్చినట్టే. మత సంప్రదాయం ముసుగులో ముస్లిం మహిళలు అనాదిగా ఎదుర్కొంటున్న అన్యాయానికి ఇకనైనా అడ్డుకట్ట వేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ సందర్భం వచ్చినప్పుడల్లా దేశ ప్రజలను కోరుతూ వచ్చారు. సమాజంలోని వివిధ వర్గాల్లో మాదిరిగానే ముస్లిం మహిళల్లో కూడా చైతన్యం వెల్లివిరిస్తోంది. ఈ అనాచారానికి వ్యతిరేకంగా ముస్లిం మహిళలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ముస్లిం మహిళలు లింగవివక్షకు గురి అవుతున్నారు.

ముస్లిం మతంలో ముల్లాలు, మౌల్వీలదే పెత్తనం. వారెంత చెబితే అంత. ముస్లిం మహిళలకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ అన్యాయాల నుంచి ముస్లిం మహిళలను విముక్తం చేయడానికి 1985లో సువర్ణావకాశం వచ్చింది. షా బానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చినతీర్పు దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనాన్ని సృష్టించింది. అయితే, ఆనాటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ముస్లిం మహిళల (విడాకుల హక్కుల రక్షణ) చట్టాన్ని (1986) తీసుకుని వచ్చారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆ చట్టాన్ని తెచ్చేట్టు రాజీవ్‌పై ఒత్తిడి తెచ్చినట్టు కథనం. రాజీవ్ గాంధీ అప్పట్లో సందిగ్ధంలోనే ఉన్నారు. వ్యక్తిగతంగా ఆయన షాబానో పట్ల సానుభూతిగా ఉన్నా, అంతిమంగా ఆయన ఒత్తిళ్ళకు లొంగిపోయారన్నది ఆ కథనం. భర్త నుంచి ఎక్కువ భరణం పొందేందుకు ఆమె అర్హురాలేనన్న అభిప్రాయాన్ని కలిగి ఉన్నా, ఆయన చివరికి ఒత్తిళ్ళకు లొంగిపోయారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ అంశాన్ని 71వ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఢిల్లీ ఎర్రకోట బురుజుల నుంచి చేసిన ప్రసంగంలో ప్రస్తావించడం చాలా సముచితంగా ఉంది. ట్రిపుల్ తలాక్ దురాచారానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ముస్లిం మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నందుకు వారిని ఆయన అభినందించారు.

న్యాయం కోసం పోరాడుతున్న ముస్లిం మహిళలకు దేశ ప్రజలంతా అండగా నిలుస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. పౌర చట్టంతో ఇస్లామిక్ చట్టాన్ని సమానం చేయడం ప్రస్తుతం జరుగుతున్న చర్చ ఉద్దేశ్యం కాదు. ఆధునిక కాలంలో ఇది సరైన చర్యకాదనీ, దీనిని రూపుమాపాలని కోరడం కోసమే. హిందూ సమాజంలో కూడా ఇలాంటి మూఢాచారాలు ఉండేవి. దేవదాసి, సతి దురాచారాలు మహిళల పట్ల సమాజం చూపుతున్న అన్యాయాలకు ప్రతీకగా ఉండేవి. సతి అంటే భర్త చనిపోయిన తర్వాత అతడి చితిపై భార్యను కూర్చోబెట్టి దగ్ధం చేయడం. అలాగే కన్యలను గుళ్ళల్లో దేవునికి ఇచ్చి పెళ్ళి చేయడాన్ని దేవదాసి సంప్రదాయం అంటారు. హిందూ సమాజంలో వచ్చిన మార్పుల కారణంగా ఈ రెండు దుష్ట సంప్రదాయాలు క్రమంగా తొలగిపోయాయి. అలాగే, ట్రిపుల్ తలాఖ్ పేరిట ముస్లిం మహిళలకు జరుగుతున్నఅన్యాయాలను తొలగించడం అత్యవసరం. దీనిని మతం కోణం నుంచి కాకుండా, లింగవివక్షకోణం నుంచి చూడాల్సి ఉంటుంది.

చైనా ఉత్పాదనలపై ద్వంద్వ ప్రమాణాలు

భారతీయ జనతాపార్టీ, ఆ పార్టీ శ్రేణులు చైనా ఉత్పత్తుల అంశంలోనూ ద్వంద్వ విధానాలను పాటిస్తున్నాయి. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ రాజకీయాలంటూనే ఇటీవల ఎన్నికలు జరిగిన కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వ ఏర్పాటులోనూ, నిన్నగాక మొన్న జరిగిన రాజ్యసభ ఎన్నికలలో గుజరాత్ రాష్ట్రంలోనూ ఆ పార్టీ వైఖరి మాటలకూ, చేతలకూ మధ్య అగాధానికి ఎత్తిచూపింది. ఇప్పుడు చైనా ఉత్పత్తుల వినియోగంలోను ఆయా వర్గాల తీరు పరస్పర విరుద్ధంగానే ఉంది. భారత్ చైనా సరిహద్దున డోక్లాం వద్ద యుద్ధమేఘాలు ఆవరించాయని ప్రపంచవ్యాప్తంగా తెలిసిపోయింది. సామాజిక మాధ్యమాలలో వీర దేశభక్తులు కొందరు చైనా ఉత్పత్తులను, వస్తువులను బహిష్కరించి వాణిజ్య పరంగా ఆ దేశ ఆర్థిక వ్యవస్థను లొంగదీయాలని ఎస్ఎంఎస్‌లు, పోస్టింగ్‌లతో ఊదరగొడుతున్నారు. వారుగా చెబితే పాటించరేమోననే సంశయంతో బీహార్ రాష్ట్ర హైకోర్టు, మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పులంటూ ప్రచారం చేస్తున్నారు. ఈ రగడ ఎంతవరకు సమంజసం. కేంద్ర ప్రభుత్వ అనుమతులతోనే చైనా ఉత్పాదనలు విచ్చలవిడిగా మన సరిహద్దులు దాటి దేశంలోకి పరుగులు తీస్తున్నాయనే విషయాన్ని మన దేశ భక్తులంతా అర్థం చేసుకోవలసిన అవసరముంది. ఇటీవల స్వాతంత్ర్య దిన వేదికపై ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు దేశరక్షణకు భంగం కలిగించే చైనా దేశపు ఉత్పత్తులను బహిష్కరించి దేశభక్తిని చాటుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో స్వదేశీ జాగరణ్‌మంచ్ ఆ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్యదినోత్సవం నాడు నిర్వహించిన నవమి భారత్ సంయోజక సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎపిఆర్ఎస్ఎస్ ప్రచారక్ ప్రభాకర్ భరత్‌కుమార్ తన ప్రసంగంలో ప్రజల ఆరోగ్యానికి హానికలిగిస్తున్న చైనా ఉత్పత్తులను బహిష్కరించాలని ఆయన ప్రజలను కోరారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ ఆ రాష్ట్ర ప్రభుత్వం తరపున భారత తొలి గృహ శాఖామంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 182 మీటర్ల ఎత్తయిన లోహ విగ్రహాన్ని నర్మదా నదీ గర్భాన ప్రతిష్టించాలని నిర్ణయించారు.ఈ మేరకు 3 వేల కోట్ల రూపాయల విలువైన విగ్రహం తయారీని చైనా కంపెనీకి అప్పగించింది. రిలయన్స్ కంపెనీ 4 జి (జియో) ప్రారంభించి సంచారవాణి రంగంలో సంచలనం తీసుకువచ్చిన ముఖేష్ అంబానీ ఇటీవల 2 కోట్ల 4 జి సెల్‌ఫోన్ల కొనుగోలు ఒప్పందాలు చైనా కంపెనీలకే అప్పగించారు. ముందుగా సోషల్ మీడియాలో చైనా ఉత్పత్తుల వినియోగం బహిష్కరించాలని ప్రచారం చేస్తున్న దేశభక్తులంతా పై రెండు ఒప్పందాలని విరమించుకోవాలని ప్రధాని నరేంద్రమోడీకి, రిలయన్స్ జియో అధిపతి ముఖేష్ అంబానీకి విజ్ఞప్తి చేయవలసిన అవసరం ఉంది. ఇప్పటికీ అమలవుతున్న దిగుమతి విధానాలు చాలవన్నట్లు, మరింత వెసులుబాటు కల్పించే చర్యల దిశగా ఇటీవల 17 దేశాల మధ్య వస్తు వినిమయ ఒప్పందం మరొకటి రూపుదిద్దుకుంటుంది. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సిఇపి) పేరుతో ఈ ఒప్పంద సమావేశంలో పాల్గొని విధివిధానాలకు రూపకల్పన చేశారు. ఈ 17 దేశాలలో మనదేశంతోపాటు చైనా కూడా సభ్యదేశమే సుమా! ఇప్పటివరకూ మన దేశంలో అమలవుతున్న దిగుమతి సుంకాలకు కాలం చెల్లుతుంది. ఈ 17 దేశాలు వారి వారి ఉత్పత్తులను స్వేచ్ఛగా ఈ బృంద దేశాలలో నేరుగా విక్రయించుకోవచ్చు. దిగుమతి సుంకాలు తొలగించడంతో కారుచౌకగా తయారయ్యే ఉత్పత్తులన్నీ భారత్‌లోకి వరదలా ప్రవహిస్తాయని విశ్లేషకులు గగ్గోలు పెడుతున్నారు. కేంద్రం మన వ్యవస్థల వ్యతిరేక ఒప్పందాలు ఒకదానిపై మరొకటి చేసుకుంటూ పోతూవుంటే, సోషల్ మీడియాలో చైనా వస్తువులను కొనకండి, బహిష్కరించండి అంటూ ఎస్ఎంఎస్‌లు, పోస్టింగ్‌లు పెట్టడం అమాయకత్వం మినహా మరొకటి కాదనే చెప్పుకోవాలి.

-వై.హెచ్.కె. మోహనరావు, 9440154114

తొలి అంకం టెండర్లతోనే

● హైబ్రిడ్ విధానమా, డీజీపీఎస్ పద్ధతా ● నిజామాబాద్, హైదరాబాద్ మినహా.. ● 2.76 కోట్ల ఎకరాలు ● 10850 రెవెన్యూ గ్రామాలు ● వేలాది మంది అధికారులు ● ముందుగా సరిహద్దుల నోటిఫికేషన్ ● ఇదీ భూ సర్వే తీరు....

హైదరాబాద్, ఆంధ్రప్రభ : విప్లవాత్మక భూ సర్వేకు సమస్తం సిద్ధమవుతోంది. లక్షలాది ఎకరాల భూ స్వరూపాన్ని ఇంచ్‌లవారీగా తేల్చే కార్యాచరణ గాడిలో పడుతోంది. తెలంగాణ భూ సర్వే టెండర్లకు, సరిహద్దుల చట్టం నోటిఫికేషన్ దిశగా తొలి అడుగులు పడుతున్నాయి. 1.14 లక్షల చదరపు కిలో మీటర్ల భూభాగాన్ని నెల రెండు నెలల్లో సమగ్ర సర్వే చేయడం సాధ్యంకాదని తెలుస్తోంది. కాగా ప్రైవేటు భూముల్లో కాలుమోపి సర్వే చేయాలంటే అనేక చర్యలను ముందస్తుగా చేపట్టాల్సి రావడంపై కూడా రెవెన్యూ శాఖ తీవ్రంగా యోచిస్తోంది. అడంగల్ పహాణీ, కాస్రా పహాణీలతో ప్రైవేటు భూముల్లోకి వెళ్లి సర్వే చేసి భూములను డీమార్కేషన్ చేయాలంటే ఇందుకు అవసరమైన బోండరీస్ యాక్ట్ ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. ఇందులో అధికారులు గ్రామాలకు ఎందుకు వస్తున్నారు... ఎవరెవరు వస్తున్నారు... ఏమి చేయనున్నారు అనే అంశాలతో నోటిఫికేషన్‌లో పేర్కొనాల్సి ఉంటుంది. ఏయే రోజుల్లో సర్వే జరుగుతుందనే షెడ్యూల్ ప్రకటించాలి. ఆ తర్వాత ఇక సర్వే నెంబర్‌లోని ఇంచు ఇంచూ కొలతలు చేసి హద్దులు నిర్ధారించాలి. డీ మార్కేషన్ చేసి తక్కువ ఎక్కువలను సరిదిద్దాల్సి ఉంటుంది. దాని ప్రకారం నక్ష రూపొందించి అథెంటిఫికేషన్ చేయాలి.

భూ సర్వేకు కీలకమైన టెండర్లకు ముందుగా సమాయత్తం అవుతోంది ప్రభుత్వం. జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న 25 ఏజెన్సీలతోపాటు సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీలు ఈ సర్వేకు పోటీ పడనున్నట్లు తెలిసింది. అయితే ఆధునిక సాంకేతికతల నేపథ్యంలో ఈ సర్వేకు కేంద్ర అనుమతి తప్పనిసరి కానుంది. రెవెన్యూ పాలసీ, పురాతన రెవెన్యూ చట్టాలను సమూలంగా సంస్కరించి వివాదాలు లేని రీతిలో భూ విధానం ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యంవైపు మొదటి అడుగు పడుతోంది.

సాంకేతిక అంశాల క్రోడీకరణతో...

భూ సమగ్ర సర్వే అధునాతన సాంకే తిక టెక్నాలజీని సొంతం చేసుకోనుంది. ఇందుకు బీహార్ రాష్ట్రం అవలంభించిన హైబ్రిడ్ పద్ధతి లేదా డీజీపీఎస్ విధానాలను పరిశీలిస్తున్నారు. ఈ సర్వే విధానాలను అనుసరించిన రాష్ట్రాల్లో ఇప్పటికే అధ్యయనం పూర్తయింది. దీనిద్వారా వింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌తోపాటు తక్కువ ఎత్తులో ప్రయాణించే హెలికాఫ్టర్లు, మానవ రహిత తేలికపాటి విమానాలు, రాకెట్లు తదితరాలను వాడనున్నారు. 1910 తర్వాత బీహార్ రాష్ట్రంలో జరిగిన భూ సమగ్ర సర్వే సత్ఫలితాలనిచ్చిందని రెవెన్యూ అధికారుల అధ్యయనంలో గుర్తించారు. బీహార్‌లో జరిగిన సర్వేకు అప్పటి ప్రభుత్వం 2011లో రెండు బిల్లులను ఆమోదించింది. బీహార్ ల్యాండ్ మ్యుటేషన్ బిల్లు, స్పెషల్ సర్వే సెటిల్‌మెంట్ బిల్లులను ప్రత్యేకంగా రూపొందిచుకుంది. మ్యుటేషన్ పారదర్శకంగా, తక్షణం భూ యాజమాన్య హక్కులు లభించేలా నిర్ధేశిత గడువులో అన్ని వసతులను సమకూర్చింది.



అన్ని వివాదాలకు చెక్...

గతంలో సత్ఫలితాలనిచ్చిన జాతీయ భూ రికార్డుల ఆధునీకరణ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తద్వారా భూములపై యాజమాన్య హక్కులతోపాటు (టైటిలింగ్) వివిధ భూ వివాదాలకు చెక్ పడనుంది. దీంతో 90 ఏళ్ల క్రితం బ్రిటీష్ వ్యవస్థలో రూపొందించిన భూముల రికార్డులను తిరిగి సర్వే చేసి వాస్తవికతను నిర్ధారించనున్నారు. సర్వేతో కాలానికి అనుగుణంగా మారిన భూముల వాస్తవ స్థితిగతులతోపాటు, ప్రభుత్వ, ప్రైవేటు, గ్రామీణ ప్రాంత భూముల లెక్కల చిక్కులు వీడనున్నాయి.

వివిధ రాష్ట్రాల్లో...

పొరుగు రాష్ట్రాల్లో ఇప్పటికే సర్వే కమిషనర్ నేతృత్వంలో కమిటీ అధ్యయనం చేసింది. ప్రధానంగా గుజరాత్, హర్యానా, బీహార్ రాష్ట్రాల్లో అనుసరించిన సర్వే విధానం ఉపయుక్తంగా ఉందని ప్రభుత్వానికి ఈ కమిటీ నివేదిక ఇచ్చింది. ఈనెల 23నాటి సీఎం సమీక్షలో ఏ విధానం అమలు చేయాలన్నదానిపై స్పష్టత రానుంది. దాని ప్రకారమే సర్వేకు టెండర్లను పిలవనున్నారు.

బీహార్‌లో సర్వే ఇలా...

● అధునాతన టెక్నాలజీలతో భూ సర్వే ● పూర్తి వివరాలు సేకరించిన అధికారులు ● భూ సర్వే నేపథ్యంలో అధికారుల అధ్యయనం

> ఒక్కసారిగా తెలంగాణ రాష్ట్రం మరోసారి జాతీయ దృష్టిని ఆకర్షించే ప్రయత్నిమిది. ఏళ్లనాటి అపరిష్కృత వివాదాలను పటాపంచలు చేసి పల్లెల్లో ప్రశాంతత తెచ్చే అపూర్వ ప్రయోగం. గత 40 ఏళ్లుగా నేతలు కాగితాలకే పరిమితం చేసిన ఈ ప్రయత్నాన్ని వాస్తవంలోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2.76 కోట్ల ఎకరాల భూములను రాష్ట్రమంతటా ఏక కాలంలో సర్వే చేసి హద్దులను నిర్ధారించే మహత్తర ప్రయత్నానికి అంకురార్పణ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో అధికారుల కమిటీ పర్యటించి తెలుసుకున్న అక్కడి సర్వే స్థితిగతులపై కథనం.

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మొదటగా అధికారులు బీహార్ రాష్ట్రం అవలంభించిన హైబ్రిడ్ సర్వే విధానాన్ని పరిశీలించారు. ఈ పద్ధతిలో వింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌తోపాటు తక్కువ ఎత్తులో ప్రయాణించే హెలికాఫ్టర్లు, మానవ రహిత తేలికపాటి విమానాలు, రాకెట్లను వాడనున్నారు. 1910 తర్వాత బీహార్ రాష్ట్రంలో జరిగిన భూ సమగ్ర సర్వే సత్ఫలితాలనిచ్చిందని రెవెన్యూ అధికారులు అధ్యయనంలో గుర్తించారు. బీహార్ సర్వేకు అప్పటి ప్రభుత్వం 2011లో రెండు బిల్లులను ఆమోదించింది. బీహార్ ల్యాండ్ మ్యుటేషన్ బిల్లు, స్పెషల్ సర్వే సెటిల్‌మెంట్ బిల్లులను ప్రత్యేకంగా రూపొందించుకుంది. మ్యుటేషన్ పారదర్శకంగా, తక్షణం భూ యాజమాన్య హక్కులు లభించేలా నిర్ధేశిత గడువులో అన్ని వసతులను సమకూర్చింది.

2013లో ప్రారంభం....

బీహార్‌లో 2013న అప్పటి ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రారంభించారు. 45 వేల గ్రామాల్లో 3 ఏళ్లపాటు సర్వే జరిగింది. ఇందులో ఏరియల్ సర్వే, గ్రౌండ్ సర్వే, డిస్పోజల్ ఆఫ్ ఆబ్జక్షన్స్ ఆన్ ఓనర్‌షిప్ రైట్స్ అనే అంశాల ఆధారంగా సర్వే విజయవంతం అయిందని అక్కడ పర్యటించిన రెవెన్యూ అధికార బృందం గుర్తించింది. పంచాయతీలను భాగస్వామ్యం చేస్తూ సర్వే బృందాలు ఏరియల్ సర్వే జరిపాయి. కన్సాలిడేషన్ ఆఫ్ ల్యాండ్ హోల్డింగ్స్, పరిశ్రమల భూములు, ఆక్రమణల గుర్తింపు, సమస్యల గుర్తింపు, రైతుల భూముల పరిరక్షణ ధ్యేయంగా సర్వే పూర్తయింది. దీంతో భూ రికార్డులను పక్కాగా రూపొందించారు. బ్యాంకుల రుణాలు, పంటల తీరును గుర్తించేందుకు ఈ పద్ధతితో వెసులుబాటు కలిగింది. ఇందులో భూమి, ఇండ్ల కొనుగోలు దారులకు పాస్ పుస్తకాలతోపాటు, అందులో అన్ని ఆస్తుల వివరాలు అందులో నమోదు చేయనున్నారు. మ్యుటేషన్ గడువుగా 18రోజులను ప్రభుత్వం నిర్ధేశించింది.

ప్రత్యేకతలు...

ఈ అధునాత సర్వేకు రూ. 1158కోట్లు ఖర్చయింది. ఇందులో రూ. 579 కోట్లను కేంద్రం భరించింది. మొత్తం భూ రికార్డులను డిజిటలైజ్ చేసి ప్రజలకు భరోసా ఇచ్చింది. మొత్తం 3 సర్వే ఏజెన్సీలు 93,358.8 చదరపు కిలోమీటర్ల రాష్ట్ర భూభాగాన్ని సర్వే చేసింది. 32 రెవెన్యూ జిల్లాల్లో జరిగిన సర్వే సమస్తం డిజిటల్ జియో పొజిషనింగ్ విధానంతో జరిగింది. సర్వేలో 9 డివిజన్లు, 38 జిల్లాలు, 101 సబ్ డివిజన్లు, 534 సర్కిళ్లు కవర్ చేసింది. ఆకాశంనుంచి ఫోటోలు తీసి ఏరియల్ సర్వే జరిపి రివైజ్డ్ ల్యాండ్ మ్యాపులను సిద్ధం చేశారు. వీటిని పాత పటాలతో సరిపోల్చి వ్యత్యాసాలను చక్కదిద్దారు. ఈ విధానంకంటే ముందే దేశంలో కంప్యూటరైజ్డ్ ల్యాండ్ రికార్డులను గోవా రాష్ట్రం సమకూర్చు కుంది. బీహార్ విధానం తర్వాత కర్నాటక, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాలు పుణికిపుచ్చుకుని సర్వేను పూర్తిచేశాయి. మొత్తం 39 ప్రైమరీ, 481 సెకండరీ కంట్రోల్ స్టేషన్లను ఏర్పాటు చేసుకుని సర్వేను పూర్తి చేశారు. ఇం దుకు గగనతలంలో ఫోటోలు తీసేందుకు డీజీసీఏ, ఫారెస్ట్‌శాఖల అనుమతులను తీసుకోవాల్సి వచ్చింది.

వసుధా సెంటర్లతో క్షణాల్లో భూ రికార్డులు...

తద్వారా ల్యాండ్ పటాలు (మ్యాపు)ను, కరాస్పాండింగ్ రికార్డ్సను ఆన్‌లైన్‌లో పొందుపర్చిన రాష్ట్రంగా బీహార్ ఖ్యాతిని గడించింది. ఈ సర్వేద్వారా వచ్చిన ఫలితాలను వసుధా సెంటర్స్‌కు అనుసంధానం చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఈ సెంటర్లద్వారా ప్రజలు తమ భూముల రికార్డులను పొందవచ్చు. తప్పొప్పులను సవరించుకునేందుకు ఈ కేంద్రాలు అవకాశం కల్పిస్తున్నాయి. అన్ని ప్రభుత్వ సేవలకు మీ సేవ కేంద్రాల తరహాలో బీహార్ రాష్ట్రం వసుధా సెంటర్లను సింగిల్‌విండో కేంద్రాలుగా వినియోగిస్తోంది.

కిలోమీటర్‌కు రూ. 14,994

మొత్తం సర్వేకుగానూ సర్వే సంస్థలకు కిలోమీటర్‌కు రూ. 14,994 చెల్లించి సహాయసహకారాలు అందించారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో వ్యయాన్ని భరించాయి. ఫోలోటు తీసేందుకు హై లిజల్యూషన్ కెమెరాలను ఎయిర్‌క్రాఫ్టలకు భిగించారు. సర్వేకు బీచ్ క్రాఫ్ట్ కింగ్ ఎయిర్ సీ-90 ఎయిర్‌క్రాఫ్ట్ విమానాన్ని వినియోగించారు. ఈ విమానం ఏకధాటిగా 5 గంటల పాటు 30వేల ఫీట్ల ఎత్తులో గంటకు 90 నుంచి 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు.

సర్వే సంస్థలు...


సర్వేలో మూడు సంస్థలు పాలుపంచుకున్నాయి. ఇందులో హైదరాబాద్‌కు చెందిన మెస్సర్స్ ఐఐసీ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ కీలకపాత్ర పోషించింది. అదేవిధంగా జీఐఎస్ కన్సోర్టియం ప్రై లిమిటెడ్, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఎన్విరాన్‌మెంటల్ ఇన్‌ఫ్రా అండ్ సర్వీసెస్ కూడా సర్వేలో పాల్గొంది.

నంద్యాల తీర్పు రేపటి సంకేతం!

● ఉప ఎన్నికకు నేడే పోలింగ్ ● ఉభయ పార్టీల హోరాహోరీ ● ప్రచారంలో ఉభయులూ విజయం ● నంద్యాలపై జాతీయస్థాయి ఉత్కంఠ



భూమా బ్రహ్మానందరెడ్డి



శిల్పా మోహన్‌రెడ్డి

నంద్యాల, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి : జయాపజయాల్తో సంబంధం లేకుండా నంద్యాల ఉప ఎన్నికల వేదికను పాలక ప్రతిపక్షాలు రెండూ సమర్ధవంతంగా వినియోగించుకున్నాయి. మూడున్నరేళ్ళ తమ పాలనా విజయాల్ని ప్రజలకు వివరించడంతో పాటు భవిష్యత్ వ్యూహాల్ని ప్రజలకు తెలియజెప్పేందుకు ఈ వేదికను చంద్రబాబు వినియోగించుకున్నారు. అలాగే జగన్ కూడా ప్రభుత్వ వైఫల్యాల్ని ఈ వేదిక ద్వారా సమర్ధవంతంగా ఎండగట్టగలిగారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీల అమల్లో గల లోపాల్ని ప్రజలకు వివరించడంలో ఆయన విజయం సాధించారు. సహజంగా లోక్‌సభ లేదా శాసన సభల్లో పాల కపక్షంపై విపక్షాలు అవిశ్వాస తీర్మానాల్ని ప్రవేశపెట్టే సమయంలోనే అవి వీగి పోతాయని వాటికి తెలుసు. కానీ తీర్మానాన్ని ఆమోదిస్తే అందుకు దారితీసిన పరిస్థితులపై చట్టసభల్లో చర్చించేందుకు విస్తృత అవకాశాలు అందుబాటులోకొస్తాయి. ఇందుకు పాలకప్రతిపక్షాలు రెండింటికి గంటలకొద్దీ సమయం లభిస్తుంది. ఈ సమయాల్లో పాలకపక్షం తమ విజయాల్ని అనుసరిస్తున్న విధానాల్ని, సాధించిన ప్రయోజనాల్ని సమర్ధవంతంగా వివరించేందుకు వినియోగించుకుంటుంది. అలాగే తమ భవిష్యత్ వ్యూహాల్ని కూడా సభాముఖంగా ప్రజలకు తెలియజేస్తుం టుంది. మరోవైపు ప్రతిపక్షం కూడా చట్టసభల్లోనే పాలకపక్షవైఫల్యాలపై విమ ర్శిస్తుంది. ప్రకటించిన పథకాల ఆచరణలో లోపాల్ని ఎత్తిచూపుతుంది. తద్వారా ఇరుపక్షాలు కూడా తమ వైఖరిని ప్రజలకు సమర్ధవంతంగా వివరించగలుగు తాయి. పైగా చట్టబద్ధమైన వేదిక కావడంతో ఈ సభల్లో జరిపే చర్చకు విలువుంటుంది. అక్కడిచ్చే హామీలకు నిబద్ధత ఏర్పడుతుంది. అలాగే నంద్యాల ఉప ఎన్ని కను ఇప్పుడీ రెండు పార్టీలు మూడున్నరేళ్ళ పాలనాతీరు సమీక్షకు వేదికగా విని యోగించుకున్నాయి. వాస్తవానికి ఎన్నికల్లో ఎవరు గెల్చినా అధికార ప్రతిపక్షస్థానాల్లో మార్పులు రావు. పైగా ఏడాదిన్నర మాత్రమే ఈ పదవుంటుంది. ఇందు కోసం రెండుపార్టీలు ఇంత హోరాహోరీ తలపడలా అన్న సందేహాలు కూడా వెల్లడయ్యాయి. కానీ లోతుగా పరికించి చూస్తే దీన్నో అద్భుత అవకాశంగా ప్రధాన పార్టీలు రెండూ వినియో గించుకున్నాయి.

దేశంలోనే అత్యంత వివాదాస్పద ఉపఎన్నికకు పోలింగ్ మరికొద్ది నిమిషాల్లో ప్రారంభం కానుంది. కేవలం ఏడాదికి పైగా మాత్రమే సమయమున్న పదవి కోసం ఇంత అనవసర రాద్ధాంతం గతంలో ఎప్పుడూ రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే జరగలేదు. ఇరుపక్షాలు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా జరిపాయి. పార్టీ తరపున అతిరథ మహారథుల్ని బరిలో దింపాయి. ఏ చిన్న అవకాశాన్ని జారవిడుచుకోలేదు. ప్రతి ఒక్క ఓటరును కనీసం మూడేసి సార్లు వ్యక్తిగతంగా కలసి ఓట్లను అభ్యర్ధించారు.

ఈ ఉపఎన్నికల ఫలితాల్తో రాష్ట్ర రాజకీయ సమీకరణాల్లో ఏ విధమైన మార్పులురావు. అధికార పార్టీకి అవసరమైన దానికంటే బలం ఎక్కువగానే ఉంది. ఒక్క సీటుతో ప్రతిపక్షం అధికార హోదా పొందే అవకాశాల్లేవు. కానీ దీనికోసం ఇంత వరకు భారత చరిత్రలో జరగని రీతిలో హోరాహోరీ ప్రచారం చేశారు. రెండు ప్రధాన పార్టీలు కూడా వైరిపక్షాల్నుంచొచ్చిన ఫిరాయింపుదార్లకే సీట్లిచ్చి బరిలో దింపారు. దేశంలోనే మరే నియోజకవర్గానికి లేని అనేక ప్రత్యేకతలు కలిగిన నంద్యాల తాజాగా ఈరికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. నంద్యాల ఓటర్లు పలు సందర్భాల్లో తమ ప్రత్యేకతను చాటిచెప్పారు. దేశం యావత్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్న సమయంలో 1977పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం 42స్థానాల్లో 41 స్థానాల్ని కాంగ్రెస్ కైవసం చేసుకోగా నంద్యాల ఓటర్లు మాత్రం జాతీయస్థాయి రాజకీయ పరిణితిని ప్రదర్శించారు. ఆ ఒక్కస్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్ధి ఓడిపోయారు. కాంగ్రెస్ తరపున నీలం సంజీవరెడ్డి విజయం సాధించారు. అలాగే నంద్యాల పార్లమెంట్ స్థానం నుంచి పోటీపడ్డ పివి నరసింహారావుపై బిజెపి పోటీ పెట్టింది. కానీ తెలుగువాడు ప్రధానైనందున పార్టీలకతీతంగా నంద్యాల ప్రజలు పివికి మద్దతు పలికారు. అక్కడ బిజెపికి కనీసం డిపాజిట్ కూడా తిరిగి లభించలేదు. ఆ స్థాయిలో తమ తీర్పునిచ్చారు. అంతటి విజ్ఞత కలిగిన నంద్యాల ఓటర్లు ఉప ఎన్ని కల్లో ఇచ్చే తీర్పు రాష్ట్ర భవిష్యత్ రాజకీయాల్ని నిర్దేశిస్తుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

జాతీయ ప్రమాణాలతో కొత్త మార్కెట్లు

● గడ్డిఅన్నారం, మలక్‌పేట మార్కెట్ల తరలింపు వేగవంతం ● అన్ని వర్గాలతో సమావేశం ● డెడ్‌లైన్‌లోగా పనులు పూర్తి: హరీష్‌రావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కోహెడ, పటాన్‌చెరులలో తలపెట్టిన మార్కెట్‌లను అత్యంత ఆధునీకంగా, జాతీయ స్థాయి మెరుగైన ప్రమాణాలతో నిర్మించాలని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీష్ రావు ఆదేశించారు. గడ్డి అన్నారం మార్కెట్‌ను కోహెడకు, మలక్‌పేట్ మార్కెట్‌ను పటాన్ చెరుకు తరలించాలన్న ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి హరీష్‌రావు మంగళవారం బిఆర్‌కె భవన్‌లో మార్కెటింగ్ శాఖ పని తీరుపై ఉన్నతస్థాయి సమీక్షను నిర్వహించారు. నూతన మార్కెట్‌ల నిర్మాణానికి సంబంధించిన అన్ని వర్గాలు, బిల్డర్లు, బ్యాంకర్లు, ట్రేడర్లు, రైతులందరితోనూ విస్తృతంగా చర్చించాలని ఆదేశించారు. ఆయా వర్గాలకు కావాల్సిన వసతులు కల్పించాలన్నారు. ఈ రెండు మార్కెట్‌ల నిర్మాణంపై సమగ్ర నివేదికను 15 రోజుల్లో సమర్పించాలని సూచించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నిమ్మ, దొండ, బత్తాయి మార్కెట్‌ల నిర్మాణాన్ని 45 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. డెడ్‌లైన్‌లోగా పూర్తి చేయకపోతే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా రాష్ట్రంలో పెరుగుతున్న పత్తిసాగు నేపథ్యంలో ఖరీఫ్‌లో రానున్న దిగుబడి సేకరణపై తీసుకోవాల్సిన చర్యలపై కూడా కీలకంగా చర్చించారు. ఈ ఏడాది పత్తి దిగుబడి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు, మార్కెటింగ్ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ నామ్ కోల్డ్ స్టోరేజీల కార్యకలాపాలపై కూడా సమీక్షించి కీలక ఆదేశాలను మంత్రి హరీష్ జారీ చేశారు. రాష్ట్రంలో 44 వ్యవసాయ మార్కెట్‌లలో ఈ నామ్ విజయవంతంగా అమలవుతోందన్నారు. సాఫ్ట్‌వేర్ సమస్యలు తలెత్తుతున్నందన ఆయా సమస్యలను కేంద్రం దృష్టికి తీసికెళ్లాలన్నారు. నాబార్డు నిధులతో 9 కోల్డ్ స్టోరేజీల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్లలో దడవాయిల లైసెన్సుల బదలీలో ఉన్న నిబంధనల్లో సడలింపులనిస్తూ పెండింగ్ లైసెన్స్‌లను క్లీయర్ చేయాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో మార్కె టింగ్ డైరెక్టర్ లక్ష్మిబాయి, జేడిలు లక్ష్మణుడు, పి రవి కుమార్, డిప్యూటీ డైరెక్టర్ మల్లేషం, ఓఎస్‌డి జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల పాటు జానపద జాతర

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రపంచ జానపద దినోత్సవం మంగళవారం రాష్ట్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను నేటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్నీ జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని తలపెట్టారు. జానపద కళలు అన్నీజ్ఞానపదాలు, జన హృదయ కేతనాలనీ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ కళాభవన్ సంచాలకుడు మామిడి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ జానపద కళలకు తరగని ఖజానా అని ఆయన పేర్కొన్నారు. అందువల్లే జానపద ఉత్సాలను అన్ని జిల్లాల్లోనూ స్థానిక జానపద కళాకారుల బృందాలను, సాంస్కృతిక సారధికళాకారుల బృందాలను కలుపుకుని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మొదటి రోజున నిజామాబాద్, జోగులాంబ గద్వాల్, వరంగల్ రూరల్, ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించినట్లు తెలిపారు. అలాగే 23న నిర్మల్, భద్రాద్రి, కొత్తగూడెం, నల్గొండ, రాజన్న సిరిసిల్లా జిల్లాలోనూ, 24న జనగాం, కరీంనగర్, మహబూబ్‌బాద్, 25న జగిత్యాల, వరంగల్ అర్బన్, మెదక్, యాదాద్రి భవనగిరి, 26న ఖమ్మం, జయశంకర్ భూపాల్‌పల్లి, మంచిర్యాల, 27న సూర్యాపేట, వనపర్తి, సంగారెడ్డి, 28న మహబూబ్‌నగర్, కామారెడ్డి, సంగారెడ్డి, 29న సిద్దిపేట్, కొమరంభీం ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, 31న రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, హైదరాబాద్‌లో జరుగుతాయన్నారు. ముగింపు సభ నగరంలోని రవీంద్ర భారతిలో జరుగుతుందని ఆయన తెలిపారు.

ఉప రాష్ట్రపతికి గవర్నర్ వీడ్కోలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో రెండు రోజులు పర్యటన ముగించుకున్న ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ మంగళవారం వీడ్కోలు పలికారు. సోమవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన పౌరసన్మానం కార్యక్రమంలో పాల్గొన్న వెంకయ్య అనంతరం మంగళవారం ఢిల్లీ బయలుదేరి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ కె.స్వామిగౌడ్, ఉప ముఖ్యమంత్రులు మహమూద్ అలీ, కడియం శ్రీహరి, మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యా మండలిలో మార్పులు



● వచ్చే ఏడాది కొత్త ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ● డిమాండ్ లేని కోర్సుల రద్దు ● వృత్తి విద్యలో కొత్త కోర్సులు ప్రారంభం ● నిబంధనలు పాటించని కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇవ్వలేదు ● కార్పొరేట్ కాలేజీలను కట్టడి చేశాం ● జరిమానాలు సైతం విధించి చెల్లించేలా చేశాం ● ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్పొరేట్ కాలేజీలను కట్టడి చేసిందని ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. కార్పొరేట్ కాలేజీల పెత్తనం లేకుండా చేశామన్నారు. నిబంధనలు పాటించని కార్పొరేట్ కాలేజీలకు జరిమానాలు విధించడమే కాకుండా ఆయా కాలేజీలు జరిమానా చెల్లించేలా చర్యలు తీసుకున్నామన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు అనుబంధ గుర్తింపును ఇవ్వలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న 404 ప్రభుత్వ కాలేజీల పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నట్టు స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ స్థాయిలో వృత్తి విద్యలో కొత్త కోర్సులను ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. డిమాండ్ లేని వృత్తి విద్య కోర్సులను రద్దు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. రాష్ట్రంలో కార్పొరేట్ కాలేజీలను కట్టడి చేస్తున్నామన్నారు. మంగళవారం ఇంటర్ విద్యా మండలి బోర్డు సమావేశం ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి కడియం పాల్గొన్నారు. ఆయనతోపాటు ఉన్నత విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, కాలేజీయేట్ కమిషనర్ వాణిప్రసాద్, ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్, పాఠశాల విద్యా శాఖ సంచాలకులు జి కిషన్‌తోపాటు రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల ఉపకులపతులు పాల్గొన్నారు.

ఇంటర్‌బోర్డును దేశంలో ఉత్తమ బోర్డుగా తయారు చేస్తామని కడియం తెలిపారు. ఇంటర్‌బోర్డులో సభ్యులను మార్చి కొత్తగా ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్టు తెలిపారు. బోర్డులో అన్ని యూనివర్సిటీల వీసీలు ఉన్నారని, అయితే బోర్డులో అందరూ వీసీల అవసరం ఉండటం లేదన్నారు. ఇంటర్‌బోర్డులో కేవలం వృత్తి విద్య కోర్సులు మాత్రమే ఉన్నందున ఇకపై బోర్డులో జెఎన్‌టియు వీసీతోపాటు, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు, అనధికారులు ఉంటే సరిపోతుందని త్వరలోనే దీనిని మార్పు చేస్తామన్నారు. అవసరమైన వృత్తి విద్య కోర్సులను రూపొందించడం కోసం ప్రత్యేకంగా అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కమిటీలో జెఎన్‌టియు, వైద్య, ఆరోగ్య శాఖ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కమిటీ నివేదికను రెండు నెలల్లో తెప్పించుకుంటామన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా డిమాండ్ ఉన్న కోర్సులను రూపకల్పన చేయనున్నట్టు చెప్పారు. వృత్తి విద్యా కోర్సు పూర్తి కాగానే ఉపాధి పొందేలా కోర్సులను రూపొందించనున్నట్టు కడియం స్పష్టం చేశారు. బోర్డు సమావేశం ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత విభజన సమస్య మూలంగా రెగ్యులర్‌గా సమావేశాలు జరగలేదని తెలిపారు. ఇకపై రెగ్యులర్‌గా సమావేశాలను నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయని, వాటిలో సౌకర్యాల కోసం గత రెండేళ్లలో రూ. 325 కోట్లను కేటాయించినట్టు తెలిపారు. చాలా కాలేజీల్లో పనులు పూర్తి కావచ్చాయని తెలిపారు. ఈ ఏడాది చివరి వరకు అన్ని ప్రభుత్వ కాలేజీలకు సొంత భవనాలు ఉండేలాగా చూస్తామన్నారు. 2004 నుంచి 2014 వరకు కొత్తగా ఏర్పాటు చేసిన 59 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకం చేపడతామని ఆగస్టు 15న ప్రకటించారని దీంతో త్వరలోనే నియామక ప్రక్రియను కూడా చేపట్టడానికి అవకాశం ఏర్పడిందని అన్నారు. ఇంటర్‌బోర్డులో ఇప్పటికే 22 సర్వీసులను ఆన్‌లైన్ ద్వారా చేపడుతున్నట్టు తెలిపారు. ఈఏడాది నుంచి అనుబంధ గుర్తింపు ప్రక్రియను కూడా ఆన్‌లైన్ ద్వారానే చేపట్టినట్టు చెప్పారు. ఆన్‌లైన్ సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో బోర్డుకు ఉత్తమ డిజిటల్ అవార్డు కూడా సొంతం చేసుకున్నట్టు చెప్పారు. గత మూడేళ్లల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు పెరిగాయని చెప్పారు. 2014-15లో 1.23 లక్షల మంది ఉంటే ప్రస్తుత విద్యాసంవత్సరం 1.80 లక్షలకు పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో కొన్ని మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కావాలని పలువురు ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారని తెలిపారు. స్పందించిన సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ కాలేజీల వివరాలను స్పష్టంగా మండలాల వారీగా ఇవ్వాలని ఆదేశించారని, ఇంటర్‌బోర్డు ఆ వివరాలను సేకరిస్తోందని వచ్చే ఏడాది అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేయనున్నట్టు కడియం తెలిపారు.

రాష్ట్రంలో 1555 కాలేజీలు అనుబంధ గుర్తింపుకు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిలో ఇప్పటికే 1249 కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చారు. ఇంకా 329 కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇవ్వలేదు. ఇంటర్మీడియట్ కాలేజీలు అనుబంధ గుర్తింపు పొందడానికి సంబంధిత పత్రాలను సమర్పించడం కోసం సెప్టెంబర్ 21 వరకు అవకాశం కల్పించినట్టు బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు. ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి ఆదేశాల మేరకు గడువును పెంచినట్టు తెలిపారు. అప్పటి వరకు అనుబంధ గుర్తింపు రాని కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులను సమీప ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు బదిలీ చేసి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుటకు, పరీక్షలు రాయుటకు అనుమతి ఇవ్వబడుతుందని తెలిపారు.

Andhraprabha business 2017

బిజినెస్

BUSINESS

హ్యుందాయ్ కొత్త వెర్నా



పరిచయ ధర రూ.8 లక్షలు

న్యూఢిల్లీ : ప్యాసింజర్ కార్ల తయారీ కంపెనీల్లో దేశంలో రెండో స్థానంలో ఉన్న హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్ఎంఐఎల్) మంగళ వారం నాడు ఫిఫ్త్ జనరేషన్ వెర్నాను మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.8 లక్షల నుంచి రూ.12.62 లక్షలు (ఎక్స్ షో రూం, ఢిల్లీ)గా ప్రకటించింది. అయితే ఈ ధర కేవలం పరిచయం ధర మాత్రమే ముందుగా బుక్ చేసుకునే వారికి మాత్రమే ... కేవలం మొట్టమొదటి 20,000 కస్టమర్లకు మాత్రమే ఇది అందుబాటులో ఉంటుంది. అటు తర్వాత ధరను సవరిస్తుంది. ఇంజిన్ విషయంలో పెట్రోల్ 1.6 లీ విటివిటి, డిజిల్ 1.6 లి యు2 సీఆర్ఈఐ ఇంజిన్లలో లభిస్తుంది. ఈ 2 మోడల్స్ 6 వెరియెంట్లలో లభిస్తుంది. 4 మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, 2 ఆటోమెటిక్ ట్రాన్స్‌మిషన్‌లలో లభిస్తుంది. పెట్రోల్ వెర్షన్ లీటరుకు 17.70కి.మీ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ లీటరుకు 15.92 కి.మీ, ఆటోమెటిక్ వెర్షన్, డిజిల్ వెర్షన్ 24.75 కెఎంపీఎల్, (ఎంటి) 21.02 కెఎంపీఎల్ (ఎటి) మైలేజీ ఇస్తుందని, నెక్ట్స్ జనరేషన్ వెర్నా కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో పాటు భద్రతకు అడ్వాన్స్ ఫీచర్లను అందుబాటులో ఉంచినట్లు కంపెనీ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ వెకె కూల్ కొత్త ఆవిష్కరిస్తూ చెప్పారు.





కోఠి బ్యాంకు స్ట్రీట్‌లో బ్యాంకు ఉద్యోగుల ధర్నా

స్తంభించిన బ్యాంకింగ్

• సమ్మెలో 10 లక్షల మంది ఉద్యోగులు • 1.30 లక్షల బ్రాంచీల మూత • నిలిచిపోయిన చెక్ క్లియరింగ్

• బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీన ప్రతిపాదన మానుకోవాలి • రుణాలు ఎగ్గొట్టే వారిని శిక్షించాలి • యుఎఫ్‌బియూ కన్వీనర్ శర్మ

ప్రభుత్వ రంగానికి చెందిన సుమారు 10 లక్షల మంది బ్యాంకింగ్ సిబ్బంది మంగళవారం సమ్మెకు దిగడంతో పీఎస్‌యు బ్యాంకుల్లో లావాదేవీలు పూర్తిగా స్తంభించిపోయాయి. ప్రభుత్వం బ్యాంకింగ్ రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలకు వ్యతిరేకంగా, దీంతో పాటు ఇతర అంశాలపై ఉద్యోగులు సమ్మె బాటపట్టారు. దేశవ్యాప్తంగా 1,30,000 బ్రాంచీలు మూతపడ్డంతో చెక్‌ల క్లియరింగ్‌కు ఆటంకాలు కలిగాయని యూనైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యుఎఫ్‌బీయు) అధికారి ఒకరు చెప్పారు. ఈ యూనియన్ కింది తొమ్మిది యూనియన్‌లు కూడా సమ్మెకు పిలుపునిచ్చాయి. దేశంలోని ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల్లో చాలా వరకు మంగళవారం నాడు మూతపడ్డాయి.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయ బ్యాంకుల ప్రైవేటీ కరణ, విలీన ప్రక్రియ ప్రతిపాదనను అడ్డుకుంటామని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియూ) తెలుగు రాష్ట్రాల కన్వీనర్ వివిఎస్ఆర్ శర్మ హెచ్చరించారు. ఒకవైపు విదేశీ బ్యాంకులను ఆహ్వానిస్తూనే మరోవైప ు బ్యాంకులను ప్రైవేటీకరిస్తూ సామాన్యులకు అందుబాటులో లేకుండా చేసే కుట్రలను తిప్పికొడతామని ఆయన అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం యుఎఫ్‌బియూ పిలుపు మేరకు ఉభయ రాష్ట్రాల్లో అన్ని జాతీయ బ్యాంకులు మంగళవారం ఒకరోజు సమ్మె నిర్వహించాయి. ఎస్‌బిఐ స్థానిక కేంద్ర కార్యాలయంలో బ్యాంకు ఉద్యోగులు నిర్వహించిన భారీ నిరసన ప్రదర్శనను ఉద్దేశించి శర్మ ప్రసంగించారు.

మొత్తం జాతీయ బ్యాంకులను నాలుగింటికి కుదించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని, దీనివల్ల సామాన్యులకు బ్యాంకింగ్ సేవలు సరిగా అందే పరిస్థితి ఉండదని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు పేమెంట్ బ్యాంకులకు లైసెన్స్ ఇస్తూ ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తున్నారని ఆయన చెప్పారు. ఎయిర్‌టెల్, రిలయన్స్ సంస్థలకు ఇప్పటికే పేమెంట్ బ్యాంకులకు అనుమతి ఇచ్చారని, మరికొన్ని సంస్థలు వీటికోసం దరఖాస్తు చేసుకున్నాయని ఆయన చెప్పారు. ఇది బ్యాంకింగ్ సర్వీసులకు ప్రతికూల నిర్ణయమని, ప్రభుత్వం బ్యాంకులను నిర్వీర్యంచేసే కార్యక్రమాలు మానుకోవాలని ఆయన కోరారు.

బ్యాంకుల నుంచి పెద్దమొత్తంలో తీసుకున్న రుణాలను రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. బ్యాంకులు స్థూల లాభం ఆర్జిస్తున్నాయని, అయితే మొండి బకాయిల కింద తమ లాభాలను మళ్ళించినందునే లాభాలు గణనీయంగా తగ్గుతున్నాయని శర్మ చెప్పారు. గత నాలుగేళ్ళలో రెండున్నర లక్షల కోట్ల రూపాయలు నికర నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఏ)ను ప్రకటించి బ్యాంకింగ్ వ్యవస్థను దెబ్బ తీశారన్నారు. కొందరు పారిశ్రామిక, వాణిజ్యవేత్తలు ఉద్దేశపూర్వకంగానే రుణాలు ఎగ్గొడుతున్నారని, మరికొందరు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను దారి మళ్ళిస్తున్నారని శర్మ ఆరోపించారు. బ్యాంకు రుణాలు తిరిగి చెల్లించే ఆర్థిక స్థోమత ఉన్నప్పటికీ మొండి బకాయిల కింద చూపుతున్నారని, కొందరు విదేశాలకు పారిపోయి విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని ఆయన ఆరోపించారు. విదేశాల మాదిరిగా కఠినమైన రికవరీ చట్టాన్ని రూపొందించాలని, ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగవేసిన వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. పెద్ద రుణాలను ఎన్‌పిఏలుగా ప్రకటించకుండా వాటిని వసూలుచేస్తే బ్యాంకులకు నష్టాలు వచ్చే ప్రసక్తే లేదని శర్మ అన్నారు.

వాణిజ్య బ్యాంకులు ఏటా రూ.30వేల కోట్ల డివిడెండ్‌ను ప్రభుత్వానికి చెల్లిస్తోందని, అలాగే మరో లక్షా 60వేల కోట్ల రూపాయల మేరకు ఆదాయపన్ను ద్వారా జమ చేస్తున్నామని శర్మ చెప్పారు. కానీ ఈ లక్షా 90వేల కోట్ల రూపాయల గురించి చెప్పలేని ప్రభుత్వం తాను బ్యాంకులకు ఇచ్చిన కేవలం 70వేల కోట్ల గురించి మాత్రమే రెట్టించిన ప్రచారం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

పెద్దనోట్లను రద్దు చేసి 80శాతం కరెన్సీని చలామణిలో లేకుండా చేశారని, ఆ సందర్భంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది రేయింబవళ్ళు కష్టపడి ఖాతాదారులకు సేవలు అందించారని ఆయన చెప్పారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్‌ధన్ యోజన కింద 26 కోట్ల ఖాతాలు ప్రారంభిస్తే అందులో జాతీయ బ్యాంకుల నుంచే 23 కోట్ల ఖాతాలు తెరిచారని శర్మ తెలిపారు. బ్యాంకులు వసూలు చేస్తున్న సర్వీస్ ఛార్జీలు ఖాతాదారులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. బ్యాంకులు ఏర్పాటు చేసుకున్న ఐటి నెట్‌వర్క్‌కు వ్యయం చేశామన్న సాకుతో నిరంతరం సర్వీసు ఛార్జీలు వసూలు చేయడం సరైన విధానం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.





స్వల్ప లాభాలతో సరి!

• ఎట్టకేలకు గట్టెక్కిన మార్కెట్లు

ముంబై : స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు మంగళవారం నాడు స్వల్పలాభాలతో గట్టెక్కాయి. పరిమితి స్థాయిలో ట్రేడింగ్ జరిగింది. మార్కెట్లను ఉత్తేజ పరిచే అంశాలు లేని కారణంగా ఇన్వెస్టర్లు మార్కెట్లకు దూరంగా ఉన్నారు. బీఎస్ఈ 33 పాయింట్ల లాభపడి 31,291.85 వద్ద నిఫ్టీ 11.2 పాయింట్లతో 9,765.55 వద్ద ముగిశాయి. మూడు ట్రేడింగ్ సెషన్‌ల తర్వాత మార్కెట్లు గట్టెక్కాయి. బీఎస్ఈలో అత్యధికంగా చమురు సహజవాయువు 1.31 శాతం, తర్వాతి స్థానం హెల్త్‌కేర్ 0.77 శాతం, పీఎస్‌యు 0.27 శాతం, బ్యాంకింగ్ 0.2 శాతం లాభపడితే, దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన సూచిలు.. రియల్టీ 1.14 శాతం, విద్యుత్ 1.1 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 0.93 శాతం, ఆటో 0.75 శాతం వరకు ఉన్నాయి. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్లు ఇలా ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్ 2.67 శాతం, లూపిన్ 2.32 శాతం, సన్‌ఫార్మా 2.24 శాతం, ఒఎన్‌జీసీ 1.11 శాతం, యాక్సిస్ బ్యాంకు 1.01 శాతం, దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. ఎన్‌టీపీసీ 2.56 శాతం, హీరోమోటోకార్ప్ 2.07 శాతం, బజాజ్ ఆటో 1.09 శాతం, టీసీఎస్ 0.85 శాతం, ఎల్అండ్‌టి 0.64 శాతం ఉన్నాయి. ఇన్ఫోసిస్ నుంచి సీఈవో విశాల్ సిక్కా రాజీనామా చేసిన తర్వాత నుంచి ఈ షేరు వరుసగా నష్టాలను చవిచూస్తోంది. వరుసగా మూడో రోజు మంగళవారం నాడు 1.53 శాతం క్షీణించింది. మొత్తానికి ఈ షేరు 14.4 శాతం వరకునష్టపోయింది. హెచ్‌సీఎల్ ఇన్ఫోసిస్టమ్స్ లిమిటెడ్ ఏకంగా 18.1 శాతం లాభపడింది. ఆపిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదర్చుకోవడమే కారణం. ఆపిల్ ఐఫోన్లు, ఆపిల్ ఇండియా ప్రొడక్టులను విక్రయిస్తుంది. ఆయిల్ ఇండియా 2.42 శాతం పెరిగింది. గ్లోబల్ మార్కెట్లలో వరుసగా మూడో రోజు యూరోపియన్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి.

విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులు రూ.7344 కోట్లు వెనక్కి

న్యూఢిల్లీ : విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ)లు ఈ నెలలో స్టాక్ మార్కెట్ల నుంచి రూ.7,300 కోట్లు తరలించుకుపోయారు. ప్రపంచంలోని పలు దేశాల్లో తలెత్తిన రాజకీయ ఉద్రిక్తతలతో పాటు దేశీయ పరిణామాలే దీనికి కారణం. ఇదే నెలలో ఎఫ్‌పీఐలో డెట్ మార్కెట్లో రూ.9,364 కోట్లు పెట్టుబడులు పెట్టాయి. ఈ నెల 1-18వ తేదీ దరకు ఎఫ్‌పీఐలు స్టాక్ మార్కెట్ల నుంచి 1.14 బిలియన్ డాలర్లు లేదా రూ.7,344 కోట్లు తరలించుకుపోయారని తాజా డిపాజిటరీ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గత ఆరు నెలల నుంచి అంటే ఫిబ్రవరి నుంచి జులై వరకు ఏకంగా రూ.62వేల కోట్ల వరకు దేశంలోకి విదేశీ పోర్టుపోలియోలు పెట్టుబడులు తరలించాయి. అంతకు ముందు నెలల్లో రూ.1,200 కోట్ల వరకు పెట్టుబడులు ఉపసంహరించుకున్నాయి. మొత్తానికి ఈ ఏడాది ఇప్పటి వరకు విదేశీ పెట్టుబడులు స్టాక్ మార్కెట్లోకి ఎనిమిది బిలియన్‌డాలర్లు లేదా రూ.53,610 కోట్ల వరకు వచ్చాయి. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు తరలించుకుపోవడానికి ప్రధాన కారణం అమెరికా - ఉత్తర కొరియాల మధ్య తలెత్తిన ఉద్రిక్తతలే కారణం కాగా. స్పెయిన్‌లో టెర్రరిస్టు దాడులు కూడా మరో కారణమని చెబుతున్నారు. ఇక దేశీయ పరిణామాల విషయానికి వస్తే మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి డొల్ల కంపెనీల కొరఢా ఝుళిపించడంతో విదేశీ ఇన్వెస్టర్లలో నమ్మకం తగ్గిందని చెబుతున్నారు.

షిప్‌యార్డుకు బకాయిల కష్టాలు

విశాఖపట్నం, కెఎన్ఎన్ బ్యూరో : దేశంలోనే తొలి నౌకానిర్మాణ కేంద్రం హిందుస్థాన్ షిప్‌యార్డు క్రమేపీ నష్టాల బాట పడుతుంది. ఇటీవలే కొంత మేరకు కోలిక్కి వచ్చినా పాతబకాయిలు అసలు , వడ్డీ కలిపి అధికం కావడంతో ఆర్థికంగా ఈ సంస్థ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే ముంబాయికి చెందిన ఎస్ఆర్ ఆయిల్ కంపెనీకి షిప్‌యార్డుకు చెందిన ఆస్తులను జప్తు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఎస్ఆర్ కంపెనీ సంస్థ న్యాయవాది ఎమ్ఎన్ ఆదిత్య తెలిపారు. సోమవారం ఇక్కడ ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాజమండ్రిలో హిందుస్తాన్ షిప్‌యార్డుకు చెందిన కొన్ని ట్యాంకుల నిర్మాణానికి తమ సంస్థతో ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఒప్పందం ప్రకారం 1998లోనే ఆయా ట్యాంకుల నిర్మాణాన్ని పూర్తి చేసి షిప్‌యార్డుకి అప్పగించామన్నారు. అప్పట్లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం తమ సంస్థకు షిప్‌యార్డు నుంచి రూ.40 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే సదరు కంపెనీ ఎస్ఆర్ ఆయిల్ కంపెనీకి ఆ సొమ్ము చెల్లించకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు.

విస్తరణ దిశగా మ్యాక్స్‌క్యూర్

• అత్యాధునిక వైద్య సేవల కోసం యూరప్ సంస్థతో ఎంవోయూ

• 3200 మిలియన్ డాలర్ల పెట్టుబడితో 22శాతం వాటా • మ్యాక్స్‌క్యూర్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కృష్ణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్న కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఒకటైన మ్యాక్స్‌క్యూర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ తమ సేవలను మరింత విస్తరించాలని నిర్ణయించింది. అందులో భాగంగా యూరప్‌లో వైద్య సేవారంగంలో అగ్రస్థానంలో ఉన్న మెడికవర్ వైద్య విజ్ఞాన సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. 3200 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఆ దేశానికి చెందిన సంస్థ మ్యాక్స్‌క్యూర్‌లో 22శాతం వాటాను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం మీడియా సమావేశంలో మ్యాక్స్‌క్యూర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కృష్ణ సేవల విస్తరణ, యూరప్ సంస్థతో ఎంవోయూకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. యూరప్ దేశంలో పేరుగాంచిన మెడికవర్ ఆసుపత్రుల గ్రూపు ఢిల్లీలో వివిఎఫ్ క్లినిక్‌లను ప్రారంభించి విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు.మ్యాక్స్‌క్యూర్ సేవలను విస్తరించేందుకు, తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులను నెలకొల్పేందుకు ఈ ఎంవోయూ ఎంతగానో దోహద పడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది చివరి నాటికి 9 మ్యాక్స్‌క్యూర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నెలకొల్పే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే తమ గ్రూపులో 7 ఆసుపత్రులు విజయవంతంగా అత్యుత్తమ వైద్యసేవలను అందిస్తున్నాయన్నారు. మల్టీస్పెషాలిటీ హెల్త్‌కేర్ రంగంలో కొత్త ఒరవడి సృష్టిస్తూ దేశంలోనే అగ్రస్థానంలో నిలువాలన్న లక్ష్యంతో యూరప్‌కు చెందిన మెడికవర్ వైద్యవిజ్ఞాన సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే క్రమంలోనూ తమ గ్రూపు ఆసుపత్రులు అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందిస్తున్నాయన్నారు. మెడికవర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ ఫ్రెడ్రిక్ స్టెన్మో మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య రంగంలో భారతదేశం శరవేగంతో అభివృద్ధి చెందుతోందన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టడం ద్వారా వైద్యరంగంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శస్త్రచికిత్సలు, వైద్యసేవల్లో పరస్పర సహకారం పొందవచ్చునని అన్నారు. ఈ బలమైన అభిప్రాయంతోనే మ్యాక్స్‌క్యూర్ గ్రూపుతో ఎంవోయూ కుదుర్చుకున్నామన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్, పోలాండ్, ఉక్రెయిన్ దేశాల్లో మెడికవర్ గ్రూపు ఆసుపత్రులు విస్తృత సేవలు అందిస్తున్నా యన్నారు. ఇకనుంచి భారతదేశంలోనూ తమ సంస్థ సేవలను విస్తృతపరుస్తామని, ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాల్లో మ్యాక్స్‌క్యూర్ భాగస్వామ్యంతో కొత్త ఆసుపత్రులు నెలకొల్పుతామని ఫ్రెడ్రిక్ స్టెన్మో వివరించారు.

ఇండియన్‌బ్యాంకు 111వ వ్యవస్థాపక దినోత్సవం

హైదరాబాద్ : ఇండియన్ బ్యాంకు 111 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కిశోర్ ఖారత్ సోమవారం నాడు హైదరాబాద్ విచ్చేశారు.111 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశంలోని అన్నీ బ్రాంచీల్లో కస్టమర్లతో కలిసి పెద్దెత్తున వ్యవస్థాపక దినోత్సవ సంబరాలు జరుపుకుంది, ఈ నెల 19న చెన్నైలో కిశోర్ ఖరాత్ మాట్లాడుతూ దేశంలో కొత్తగా మూడు జోన్ల ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. అవి అమరావతి, వడోదరా, బర్ధమమాన్‌లన్నారు. కాగా ప్రస్తుతం దేశవ్యాప్తంగా 2700 బ్రాంచీలున్నాయని, వాటిలో 60 శాతం బ్యాంకులు దక్షిణాదినే ఉన్నాట్లు ఆంధ్రా, తెలంగాణల్లోనే 300 బ్రాంచీలున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికి వస్తే సింగపూర్, కొలంబో, జాఫ్నాలలో బ్రాంచీలున్నట్లు వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాలో మాట్లాడుతూ.. బ్యాంకును మరింత ఉన్నత శిఖరాలకు తీసుకువెళతానని దీనికి ఐదు రకాల వ్యూహాలను అమలు చేస్తామన్నారు. వాటిలో 1. వ్యాపార లావాదేవీల్లో ఉన్నత ప్రమాణాలు పాటించడం, 2. కస్టమర్లకు మెరుగైన సేవలందించడం, 3. నాణ్యమైన ఆస్తులను పెంచడం, 4. బ్యాంకులను డిజిటైజేషన్ చేయడం, 5. మెరుగైన నిర్వహణపై దృష్టి పెడతామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొండిబకాయి లను 7.21 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తామని ఆయన చెప్పారు. అలాగే పొదుపు ఖాతాలపై రూ.50 లక్షల కంటే ఎక్కువ డిపాజిట్లు ఉంటే నాలుగు శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక నుంచి కరెంటు, సేవింగ్స్ ఖాతాలు (కాసా) డిపాజిట్లపై దృష్టి పెడతాన్నారు. అలాగే జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కాసా డిపాజిట్లు 8 శాతం వృద్ధి చెందాయని ఈ ఆర్థిక సంవత్సరానికి 12 శాతానికి, అలాగే రుణాల డిమాండ్‌కూడా 12 నుంచి 14 శాతానికి పెరుగుతుందన్న ధీమాను వ్యక్తం చేశారు.



కిశోర్ ఖారత్

శ్రీశ్రీశ్రీ రవిశంకర్ స్టోర్‌లు



• బాబా రాందేవ్‌కు పోటీగా శ్రీశ్రీ రవిశంకర్ దుకాణాలు

• ఈ ఏడాది చివరి నాటికి 1,000 రిటైల్ ఔట్‌లెట్లు



న్యూఢిల్లీ : బాబాలు కూడా వ్యాపారరంగంలోకి దిగి పెద్ద పెద్ద విదేశీ కంపెనీలకు చుక్కలు చూపెడుతున్నారు. దీనికి ఉదాహరణగా బాబారాందేవ్ పతంజలి ఆయుర్వేద లిమిటెడ్‌ను ప్రారంభించి అనతి కాలంలోనే దేశంలోనే అతి పెద్ద బ్రాండ్‌గా అవతరించింది. పెద్ద పెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీలకు గట్టిపోటీ ఇస్తున్నారు. పతంజలి దెబ్బకు బడా బడా ఎఫ్ఎంసీజీ కంపెనీల బ్యాలెన్స్‌షీట్లు డీలాపడ్డాయి. ఇంత వరకు బాగానే ఉన్నా బాబా రాందేవ్‌కు గట్టిపోటీ ఇచ్చేందుకు ఆధ్యాత్మిక గురు శ్రీశ్రీ రవిశంకర్ కూడా ఎఫ్ఎంసీజీ రంగంలోకి దిగి బాబా రాందేవ్ పతంజలికి గట్టి పోటీ ఇవ్వబోతున్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్స్‌కు అనుబంధ సంస్థగా శ్రీ శ్రీ ఆయుర్వేద పేరుతో ఈ ఏడాది చివరి నాటికి 1,000 రిటైల్ స్టోర్‌లను ప్రారంభించ నున్నారు. బాబా రాందేవ్ చొరవతో దేశంలో ఆయుర్వేద ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిపోయింది. ఇప్పటి దాకా ఆయుర్వేద ఉత్పత్తులపై దృష్టి పెట్టని పెద్ద కంపెనీలు కూడా ప్రస్తుతం ఆయుర్వేద ఉత్పత్తులపై దృష్టి పెడుతున్నాయి. శ్రీశ్రీ రవిశంకర్ త్వరలోనే క్లినిక్స్ ట్రీట్‌మెంట్ సెంటర్‌లను ఏర్పాటు చేయబోతున్నారు.

శ్రీశ్రీ ఆయుర్వేద (ఎస్ఎస్ఏ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తేజ్‌కట్పిటా కొత్త స్టోర్‌ల గురించి ప్రస్తావిస్తూ.. దేశ ప్రజలు తమ రోజు వారి దినచర్యలకు ఆయుర్వేద ఉత్పత్తుల వినియోగానికి అలవాటుపడ్డారని అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ఉత్పత్తులకు భిన్నంగా తమ ఉత్పత్తులు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. తమ స్టోర్‌లలో లభించే ఉత్పత్తుల గురించి ప్రస్తావిస్తూ.. టూత్‌పేస్ట్ డిటర్జెంట్స్, నెయ్యి, బిస్కెట్లు అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు. ఎస్ఎస్ఏ శ్రీశ్రీ తత్వా బ్రాండ్ పేరుతో స్టోర్‌లను తెరస్తుంది. వచ్చే నెలలో మొదటిస్టోర్‌ను ప్రారంభిస్తుంది. నవంబర్‌నాటికి 50 స్టోర్‌లను తెరుస్తామని, రాబోయే కొన్ని సంవత్సరాల్లో బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని గౌరవ్ మార్యా, ఫ్రాంచైజీ ఇండియా హోల్డింగ్స్ చైర్మన్ చెప్పారు. కాగా ఈ ఏడాది ప్రారంభంలో శ్రీ శ్రీ ఆయుర్వేద దేశీయ మార్కెట్లో కొన్ని రకాల సుగంధ ద్రవ్యాలు, సేంద్రీయ ఆహార ఉత్పత్తులను విడుదల చేశారు. ఎస్ఎస్ఏ స్టోర్‌లను 2003లో ప్రారంభించారు. మొత్తం ఆయుర్వేద ప్రొడక్టులను అందుబాటులో ఉంచింది. ఈ స్టోర్‌లో హెల్త్ డ్రింక్స్, ఆయిల్, పర్సనల్‌కేర్, ఒరల్‌కేర్, కుకీస్, రెడీటు కుక్ ఉత్పత్తులను విక్రయిస్తోంది. మొత్తం 30-35 ఉత్పత్తు లను మార్కెట్లో విక్రయిస్తోంది. వాటిలో షాంపు, క్రీమ్స్, టూత్‌పేస్ట్ సోప్, తేనే, నెయ్యి వగైరా.. వగైరాలున్నాయి.

విస్తరణ ప్రణాళిక : బెంగళూరు ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఎస్ఎస్ఏ ఒజాస్‌విటా అనే హెల్త్ డ్రింక్‌ను ఒలింపిక్ సిల్వర్ మెడల్ విజేత పీ వీ సింధు, జాతీయ బ్యాడ్మింటన్ కోక్ పుల్లెల గోపీచంద్ చేత ఆవిష్కరించారు. ప్రస్తుతం ఈ ప్రొడక్టులు 600 ఫ్రాంచైజీ స్టోర్‌లలో విక్రయిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి 2500 ఔట్‌లెట్లను ప్రారంభించాలని ఎస్ఎస్ఏ చూస్తోంది. వెబ్‌సైట్స్‌లో ఉత్పత్తులను విక్రయిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా రవిశంకర్‌కు 370 మిలియన్‌ల అభిమానులున్నారు. కాబట్టి బ్రాండ్‌కు మంచి విలువ ఉంటుందని బ్రోకరేజీ సంస్థలు కూడా చెబుతున్నాయి. అయితే కంపెనీ మాస్ మీడియాను వినియోగించు కుంటే అమ్మకాలు పెంచుకోవచ్చని సూచిస్తున్నాయి.

గ్లోబల్ మార్కెట్లో : కాగా కంపెనీకి ఇప్పటికే మూడు ప్లాంట్‌లున్నాయి గ్లోబల్ బ్రాండ్‌గా మారింది. ప్రస్తుతం సింగపూర్, అమెరికా, మలేషియా, ఒమాన్, కెనెడా, దక్షిణ్ అమెరికా, బ్రెజిల్‌లలో కూడా ఉత్పత్తులను అందుబాటులో ఉంచింది.

పతంజలికి గట్టిపోటీ : కేవలం దశాబ్ది కాలంలో పతంజలి రూ.10,000 కోట్ల కంపెనీగా మారిపోయి బహుళజాతి సంస్థలకు గట్టిపోటీ ఇస్తున్నాయి. దీంతో ఈ కంపెనీలు కూడా తప్పనిసరి పరిస్థితిలో ఆయుర్వేద కు మారాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హిందుస్తాన్ యూనీలీవర్ తిరిగి ఆయూష్‌బ్రాండ్‌ను ప్రారంభిం చింది. లా ఒరియల్ హెయిర్‌కేర్‌ను గార్నియర్‌ను ప్రకృ తిలో లభించే ముడిపదార్థాలతో షాంపును తయారు చేస్తుంది. అలాగే డాబర్ ఇండియా కూడా ఆయుర్వేద జెల్ టూత్‌పేస్ట్ డార్ రెడ్ ఫ్రాంచైసీను ప్రారంభించింది.

సూపర్ స్పెషాలిటీ
సీట్ల భర్తీకి హైకోర్టు బ్రేక్

హైదరాబాద్,ఆంధ్రప్రభ :తెలంగాణ రాష్ట్రంలోని కాళోజీ నారాయణ రావు, ఏపీలోని ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాల యాల్లో నాన్ లోకల్ కోటా వ్యవహారం తేలే వరకు సూపర్ స్పెషాలిటీ వైద్య సీట్ల భర్తీ కోసం ఇకపై ఎలాంటి కౌన్సెలింగ్ నిర్వహించరాదని ఆ రెండు వర్సిటీలను ఉమ్మడి హైకోర్టు ఆదేశిం చింది. ఈ నాన్ లోకల్ కోటా వివాదం పై సమగ్రంగా విచారణ జరిపేందుకు హైకోర్టు విచారణ బుధవారానికి వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ జస్టిస్ టి.రజనిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.ఎన్టీఆర్, కాళోజీ నారాయణరావు ఆరోగ్య వర్సిటీల్లో సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లోని మొత్తం సీట్లను జాతీయ స్థాయి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా భర్తీ చేయాలంటూ ఢిల్లీలోని హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ... హైకోర్టులో అత్యవసరంగా వ్యాజ్యం దాఖలైంది.

ప్రాసిక్యూటర్ల నియామకంపై ఆదేశాలు

రంగారెడ్డి జిల్లాకు చెందిన 13 కోర్టుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకపు జాబితా వ్యవహారంలో ప్రమాణ పత్రం దాఖలు చేయాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వారం రోజులు వాయిదా వేసింది.

ఎమ్మెల్యేల నిధుల ఖర్చుల
వివరాలివ్వండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ :తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలకు కేటాయించే నియోజక వర్గ అభివృద్ధి నిధుల ఖర్చు పై ఆడిట్ వ్యవహారంలో పూర్తి వివరాలతో కోర్టు తెలంగాణ సర్కారును ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలకు ఏటేటా కేటాయించే నియోజక వర్గ అభివృద్ధి నిధుల (సీడీఎఫ్) ఖర్చు పై అకౌంటెంట్ జనరల్ ఆడిట్ చేసిన గత మూడేళ్ల వివరాలను సమర్పించేలా తెలంగాణ సర్కారును ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది.

న్యాయాధికారుల విభజనకు
మార్గదర్శకాలు సిద్ధం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణలో న్యాయాధికారుల కేటాయింపుల కేసులో మార్గదర్శకాలను రూపొందించిన కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు వాటిని సుప్రీం కోర్టుకు అందజేసింది. ఏ ప్రాతిపదికన న్యాయాధికారులను విభజించాలన్న అంశంపై మార్గదర్శకాలను రూపొందించింది. సీనియారిటీతో పాటు సర్వీసులో చేరిన సమయంలో ఇచ్చిన ఆప్షన్లను ప్రాతిపదికగా తీసుకోవాలని మార్గదర్శకాల్లో కేంద్రం పేర్కొంది. వీటిపై సుప్రీం కోర్టు ధర్మాసనం లేవనెత్తిన సందేహాలకు అదనపు సోలిసిటర్ జనరల్ వివరణ ఇచ్చారు. జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ అబ్దుల్ నజీర్లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం తెలంగాణ న్యాయాధికారుల కేటాయింపు కేసుపై మంగళవారం జరిపిన విచారణలో గంట సేపు వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర విభజన సమయానికి ఉన్న జూనియర్ సివిల్ జడ్జిల పోస్టులు, ఖాళీలు వివరాల గురించి సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. తక్షణమే వివరాలు అందుబాటులో లేకపోవడంతో తదుపరి విచారణ సమయానికి ఆ వివరా లు అందజేస్తామని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది.

మెడికల్ హబ్‌గా
సిరిసిల్ల అభివృద్ధి!

ఐటీ, మునిసిపల్, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల కెఎన్ఎన్ : రాజకీయంగా జీవితాన్నిచ్చిన సిరిసిల్లను రాష్ట్రంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టి ప్రజల రుణం తీర్చుకుంటానని సిరిసిల్ల శాసనసభ్యులు భారీ పరిశ్రమలు, మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకమారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐసియు, బ్లడ్‌బ్యాంకు, డయాలసిస్, లేబర్‌వార్డులను రాష్ట్ర మంత్రి కేటీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డిలు ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా నిర్మించనున్న మందర్‌చైల్డ్ హాస్పిటల్, నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ ఒకేరోజు రూ.50 కోట్లకుపైగా నిధులతో జిల్లాలో వైద్య ఆరోగ్య వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ఉద్దేశించిన పలు కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయడం శుభ పరిణామమన్నారు. సిరిసిల్లతోపాటూ రాష్ట్రవ్యాప్తంగా 40




కేంద్రాల్లో డయాలసిస్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ అంశంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాధించిన సిరిసిల్ల రుణాన్ని వీటి ఏర్పాటు ద్వారా తీర్చుకుంటానన్నారు. సిరిసిల్ల ప్రజల ఉజ్వల భ విష్యత్తుకు సీఎం ఆశీస్సులు, మంత్రి లక్ష్మారెడ్డి సహకారంతో రూ.36.5కోట్లతో నర్సింగ్ కళాశాల నూతన భవన నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేశామన్నారు. అదేవిధంగా మాతాశిశు సంరక్షణ కేంద్రం 50పడకల సామర్థ్యంగల భవనం నిర్మాణానికి రూ.13.5కోట్లతో శంకుస్థాపన చేశామన్నారు. అమ్మఒడి పేరుతో ప్రసవానికి మూడునెలల ముందు, తర్వాత మూడునెలలు విశ్రాంతి ఇచ్చేందుకు వీలుగా మహిళలకు అమ్మ ఒడి ద్వారా నెలకు రూ.2వేల చొప్పున రూ.12వేలు అందిస్తున్నామన్నారు. కేసీఆర్ కిట్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరిగిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 800మందికి కేసీఆర్ కిట్‌లు అందించామన్నారు. మంత్రి కేటీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రికి విన్నవిస్తూ జిల్లాలోని 5.5 లక్షల మంది ప్రజలు డిజిటల్ హెల్త్ కార్డులు లేవని ఈ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

వైద్య ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేస్తాం: లక్ష్మారెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఆరోగ్య వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు సీఎం కేసీఆర్ సూచనలతో ముందుకు సాగుతున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పరిశుభ్రతను పెంచేందుకు కృషిచేస్తున్నామన్నారు. బెడ్‌షీట్‌లను మార్చే 'గులాబిడే'కు శ్రీకారం చుట్టామన్నారు. రోగాలు రాకుండా ప్రజలు ముందుజాగ్రత్తలు తీసుకోవాల న్నారు. దూరదృష్టి ఆరోగ్య సమాజ నిర్మాణం ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. ఎంఆర్ వ్యాక్సినేషన్‌లో భాగంగా రాష్ట్రంలో 90లక్షల మందికి వ్యాక్సినేషన్ ఇవ్వాల ని నిర్ణయించుకు న్నామన్నారు. 9నెలలనుండి 15సంవత్సరాలలోపు పిల్లలందరూ విధిగా టీకాలు వేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ కృష్ణమూర్తి, జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని, ఏఎంసి చైర్మన్ జిందం చక్రపాణి, డిఆర్వో శ్యాంప్రసాద్‌లాల్, మున్సిపల్ కమిషనర్ రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో నిరంకుశ పాలన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఒక వ్యక్తి కుటుంబం, కొంత మంది కాంట్రాక్టర్లు పెత్తనం చెలాయిస్తున్నారని టీజేఏసీ ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం మండిపడ్డారు. 'తెలంగాణ – మూడేళ్ల పాలన' అనే అంశంపై ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో తెలంగాణ జేఏసీ ఏర్పాటు చేసిన చర్చా కార్యక్రమంలో ఆయన ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అసలు తెలంగాణలో ప్రజాస్వామ్య వాతావరణమే లేదని, నిరంకుశమే రాజ్యమేలుతుందని మండిపడ్డారు. ఆంధ్ర పాలకుల పాలనలో తెలంగాణ నష్టపోతుంది కాబట్టే ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. తెలంగాణ ఉద్యమం విస్తృత ప్రజా ఉద్యమమని, స్వాతంత్ర్యోద్యమం తర్వాత జరిగిన అతిపెద్ద ఉద్యమం కూడి ఇదేనని ఆయన వ్యాఖ్యానించారు. ఇంత పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో కేబినెట్ మంత్రులే ముఖ్యమంత్రిని కలిసే పరిస్థితి లేకుండా పోయిందని కోదండరాం విమర్శించారు. ఈ కార్యక్రమంలో కోదండరాం ప్రధాన వక్తగా వ్యవహరించగా, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, సామాజికవేత్త స్వామి అగ్నివేష్, ప్రఖ్యాత సుప్రీం కోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్, కోలిన్ గోన్‌సాల్వే, ఐఎఫ్‌టీయూ ప్రెసిడెంట్ డా. అపర్ణ పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలు పుంజుకున్నాయ్...
వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారధి వీడియో కాన్ఫరెన్స్


హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ పంటలు పుంజుకున్నాయని వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారధి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పంటల స్థితిగతులపై అన్ని జిల్లాల వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పది జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. ఈ పరిస్థితుల్లో క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం రైతులతో సమన్వయం చేసుకుని సాగు పెరిగే విధంగా ప్రోత్సహించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సాగు వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపాలన్నారు. ఇప్పటి వరకు సాగు స్థితిగతులను పరిశీలిస్తే పత్తిపంట లక్ష్యానికి మించి పెద్దఎత్తున సాగవుతోందని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, మార్కెటింగ్ శాఖ అధికారులు సంయుక్తంగా పత్తికి కనీస మద్దతు ధరను స్థిరీకరించేందుకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా పార్థసారధి ఆదేశించారు. పత్తి కొనుగోలు



కోసం 150 సీసీఐ కేంద్రాలు అవసరమన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళగా సానుకూలంగా స్పందించిందన్నారు. ప్రస్తుతం 130 కేంద్రాలు ఉన్నాయన్నారు. పత్తి రైతులకు బార్ కోడెడ్ ఐడి కార్డులు అందించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్‌నాటికి పెరిగిన పత్తి సాగు విస్తీర్ణం, రైతుల సమాచారాన్ని సేకరించి జిల్లాల వారీగా నివేదికలు రూపొందించాలన్నారు.

కరెంట్ కొనుగోళ్లకు క్లియర్
దక్షిణాది రాష్ట్రాల మధ్య విద్యుత్ సరఫరా ముసాయిదా సిద్ధం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దక్షిణాది రాష్ట్రాల మధ్య విద్యుత్ ఇచ్చిపుచ్చుకునేందుకు సరికొత్త విధానం అనుసరించే విషయమై ఆయా రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. దక్షిణ భారతదేశంలో ఏ రాష్ట్రానికి విద్యుత్ అవసరం ఉన్నా, వెంటనే పక్క రాష్ట్రాల నుంచి పొందే విధంగా కొత్త విధానానికి రూపకల్పన చేశారు. ఈ విధానం అమల్లోకి వస్తే పవర్ ఎక్స్ఛేంజ్ జోక్యం లేకుండా, ఎలాంటి జాప్యానికి అవకాశం లేకుండా ఇరుగు పొరుగు రాష్ట్రాలు విద్యుత్ ఇచ్చిపుచ్చుకునే వెసులుబాటు కలుగుతుంది. త్వరలోనే దీనికి సంబంధించిన విద్యుత్ సంస్థలు ఒప్పందం కుదుర్చుకోనున్నాయి. దక్షిణ భారతదేశ రాష్ట్రాల విద్యుత్ కమిటీ(ఎస్ఆర్‌పీసీ) అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు అధ్యక్షతన కేరళ రాజధాని తిరువనంతపురంలో రెండు రోజుల పాటు జరిగిన కమిటీ సమావేశాలు ముంగళవారం ముగిశాయి. గత నెల హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్రాల మధ్య సరళమైన విద్యుత్ విధానానికి సంబంధించిన ప్రాథమిక చర్చలు జరిగాయి. ఈ సమావేశాల్లోనే ఎస్ఆర్‌పీసీ సభ్య కార్యదర్శి ఎస్ఆర్ భట్ నేతృత్వంలో కమిటీని నియమించారు. కొత్త విధానానికి సంబంధించిన ఈ కమిటీ ముసాయిదాను తయారు చేసి తిరువనంతపురం సమావేశాల్లో ప్రవేశపెట్టింది. దీనిపై రెండు రోజులపాటు చర్చ




జరిగింది. ప్రభాకర్ రావుతోపాటు సభ్య కార్యదర్శి ఎస్ఆర్ భట్, కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు సీఎండీ డా.కె.ఎలంగోవన్, కర్నాటక ట్రాన్స్‌కో ఎండి జావేద్ అక్తర్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండి విద్యావంతుల, తమిళనాడు ట్రాన్స్‌కో ఎండి ఎస్. షణ్ముగం, టీఎస్ ఎస్పీడీసీఎల్ సీఎండి గోపాల్ రావు, డైరెక్టర్లు నరసింగరావు, జగత్ రెడ్డి తదితరులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. దక్షిణ భారత దేశం పరిధిలో ఏ రాష్ట్రానికి విద్యుత్ అవసరమైనా మిగులు విద్యుత్ కలిగిన రాష్ట్రంనుంచి పొందవచ్చని ముసాయిదాలో పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా అంశాల్లో పరస్పరం సహకరించుకోవాలని కూడా ఇందులో పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ కొనుగోళ్లన్నీ పవర్ ఎక్స్ఛేంజ్ ద్వారానే జరుగుతున్నాయి. ఈ విధానం వల్ల క్రయ విక్రయాల్లో జాప్యం జరుగుతోంది. ప్రస్తుత విధానం వల్ల ఒకరోజు ముందుగానే విద్యుత్ అవసరాలకు సంబంధించి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఒకరోజు ముందే అంచనా వేయడం వల్ల అది వాస్తవ పరిస్థితికి తగ్గట్టు ఉండటంలేదు. అయితే కొత్త విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాలు ఎప్పుడు కావాలంటే అప్పుడు కేవలం గంట వ్యవధిలోనే పక్క రాష్ట్రం నుంచి విద్యుత్ పొందవచ్చు. క్రయ, విక్రయాలకు సంబంధించి ప్రతిసారి ఒప్పందం కుదుర్చుకోవాల్సిన అవసరం లేదు. ఈ విధానం వల్ల ఏరోజు డిమాండ్‌ను ఆరోజే అంచనావేసి విద్యుత్‌ను అందివ్వడమో, పొందటమో చేయవచ్చు. దీనివల్ల అటు మిగులు విద్యుత్ రాష్ట్రాలకు, ఇటు లోటు విద్యుత్ రాష్ట్రాలకు మేలు కలుగనుంది. దక్షిణాది రాష్ట్రాల మధ్యన విద్యుత్ అందిపుచ్చుకోవడం సదరన్ లోడ్ డిస్పాచింగ్ సెంటర్ ద్వారానే జరుగుతుంది. ఈ ముసాయిదాపై సభ్య రాష్ట్రాలు రెండు రోజుల పాటు కూలంకషంగా చర్చించాయి. త్వరలోనే ఈ విధానం అమలు కోసం విధి విధానాలు రూపొందించుకుని ఆ మేరకు ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయించాయి.

119 నియోజకవర్గాల్లోనూ
కాంగ్రెస్ ఆత్మగౌరవ యాత్ర

నిర్వహణపై అనుచరులతో భట్టి మంతనాలు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : గడచిన మూడేళ్లుగా దగా పడుతున్న రాష్ట్ర ప్రజల గొంతుకగా చేపట్టదల్చిన తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ యాత్ర ఏర్పాట్లపై అనుచరులు, పార్టీ కార్యకర్తలతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క చర్చలు ప్రారంభించారు. ఎస్సీ,ఎస్టీ బీసీ,మైనారిటీ, నిరుద్యోగులు, రైతులు మహిళలకు ఇచ్చిన హామీల అమలులో టీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు చేపట్టనున్న ఈ యాత్రపై సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన పాదయాత్ర మాదిరిగానే జనంలోకి వెళ్లి కాంగ్రెస్ సిద్ధాంతాలు ప్రచారం చేయడం, ఇందిరమ్మ రాజ్యం తెస్తామని హామీ ఇవ్వడం, కేసీఆర్ అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఈ యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. తొలుత ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకే పాదయాత్ర చేపట్టాలనుకున్నప్పటికీ, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలు కవర్ అయ్యేలా యాత్ర చేపట్టాలని యోచిస్తున్నారు. పాదయాత్ర చేపట్టాలని తీసుకున్న నిర్ణయం మేరకు ఏఐసీసీకి కూడా సమాచారం చేరవేశారు. టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కూడా చర్చించనున్నారు. అధిష్టానం అనుమతి అనంతరం యాత్ర తేదీలు ఖరారు చేయాలని అనుకుంటున్నారు. అనుచరులు, కార్యకర్తలతో జరుపుతున్న చర్చల్లో పాదయాత్ర రూట్‌మ్యాప్ ఎలా ఉండాలి.., ఎక్కడి నుంచి ప్రారంభించాలిఎక్కడ ముగించాలి.., జాతీయ నేతలను ఎవరెవరిని పిలవా లనే అంశంపై సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీనియర్ నేతలైన కె జానారెడ్డి, మండలిలో విపక్ష నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్, పీసీసీ మాజీ అధ్యక్షులు విహెచ్, పొన్నాల లక్ష్మయ్య, కోమటిరెడ్డి బ్రదర్స్ ,మాజీ ఉప ముఖ్యమంత్రి




దామోదర రాజనరసింహ తదితరులతో కూడా చర్చలు జరపనున్నారు. అదే విధంగా రెండు పడక గదుల ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, ఫీజు రీయింబర్స్ మెంట్, ఎస్టీ లకు 10 శాతం, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం, రైతులకు ఏకకాలంలోరుణమాఫీ చేయకపోవడం వల్ల తలెత్తిన కష్టాలు.. కన్నీళ్లు...పర్యవసానంగా జరుగుతున్న ఆత్మహత్యల పరంపర తదితర అంశాలే ఎజెండాగా ఆయన యాత్ర చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహా రాల ఇంచార్జీ డాక్టర్ రామచంద్ర కుంతియా, ఎస్సీ సెల్ చైర్మన్ కొప్పుల రాజు, కన్వీనర్ సిరివెళ్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శు లు గులాంనబీ ఆజాద్, దిగ్విజయ్ సింగ్‌లతోపాటు మరి కొందరు నాయకులను ను కూడా పాదయాత్ర ప్రారంభానికి ఆహ్వానించాలని, ముగింపు సభను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించాలని, రాహుల్ గాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని భట్టి విక్రమార్క నిర్ణయం తీసుకున్నారు.

పార్లమెంట్ స్థానాలకు పరిశీలకులుగా
బీజేపీ జాతీయ నాయకులు

- **తెలంగాణకు రామ్‌మాధవ్**
- **ఏపీకి మురళీధర్‌రావు**
- **ఇతర పార్టీల్లోని అసంతృప్తులపై నిఘా**

హైదరాబాద్,ఆంధ్రప్రభ : కేంద్రంలో మరోసారి అధికారం లోకి వచ్చేందుకు ఇప్పటి నుంచే యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేస్తున్న బీజేపీ హై కమాండ్.. తెలుగు రాష్ట్రాలపై కూడా ప్రత్యేక దృష్టిని సారించింది. దక్షిణాది రాష్ట్రాల్లో బలపడేందుకు కమలం నేతలు కరసత్తు చేస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్న విష యం తెలిసిందే. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 350 లోక్‌సభ స్థానా లను టార్గెట్ చేసుకుని ముందుకు సాగుతున్న బీజేపీ.. అందు కనుగుణంగా కార్యాచరణను సిద్ధం చేసింది. ఒక వైపు అన్ని పార్లమెంట్ స్థానాలపై దృష్టి సారిస్తూనే అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా పార్టీని విస్తరించాలని బీజేపీ అధిష్టానం నిర్ణ యించినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ లక్ష్య సాధన అన్ని రాష్ట్రాల్లోని లోక్‌సభ స్థానాలపై పరిశీలకులను నియమిం చడం వల్లే సాధ్యం అవుతుందని ప్రధాని నరేంద్రమోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా భావిస్తున్నారు. అందుకను ణంగా వారు కసరత్తు చేస్తున్నట్లు గా ప్రచారం జరుగుతోంది. ఇందులోభాగంగా మూడు నుంచి ఐదు లోక్‌సభ నియోజక వర్గాలకు ఒకరు చొప్పున పార్టీ జాతీయ నాయకులను ఇన్‌చార్జీలుగా నియమించనున్నట్లు పార్టీకి చెందిన ఒకసీనియర్ నేత వెల్లడించారు. తెలంగాణలో పార్టీ బలోపేతం కావడానికి అవకాశాలు ఉన్నాయని గుర్తించిన బీజేపీ అధిష్టాన వర్గం.. ఇక్కడ సమర్థులైన నాయకులను పరిశీలకులుగా నియమించనున్నట్టు సమాచారం. ముఖ్యంగా హైదరాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల, కరీంనగర్, సికింద్రా బాద్ తో పాటు వరంగల్ లోక్‌సభ నియోజక వర్గా లకు బీజేపీ జాతీయ ప్రధా న కార్యదర్శి రామ్‌మా ధవ్‌ను పరిశీలకుడిగా నియ మించే అవకాశం



ఉందని ఆ పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరు గుతోంది. ఇక మిగతా పార్ల మెంట్ నియోజక వర్గాలకు మరో ఇద్దరు జాతీయ నాయకు లను పరిశీలకులుగా నియమిస్తారని అంటున్నా రు. రామ్‌మాధవ్ మాత్రం ఈ ఐదారు లోక్‌సభ నియోజక వర్గాలపై పరిశీలకుడిగా ఉంటూనే మిగతా పార్లమెంట్ నియోజక వర్గాల్లో కూడా సమన్వయకర్తగా వ్యవహరిస్తార ని చెబుతున్నారు. తెలంగాణలో ఉన్న 17 లోక్ సభ స్థానాలకు గాను దాదాపు సగం స్థానాలను తమ ఖాతాలో వేసుకోవాలనే ఆలోచనలో బీజేపీ నేతలు ఉన్నట్లు చెబుతున్నారు. ఇక తెలంగాణ ప్రాంతానికి చెందిన ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావును ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు లోక్‌సభ నియోజక వర్గాలకు పరిశీలకుడిగా పంపించే అవకాశాలు ఉన్నట్లు బీజేపీలో చర్చ జరుగుతోంది. పార్లమెంట్ స్థానాలకు పరిశీలకులను నియమించడం వల్ల పార్టీ పని తీరుపై అంచనా పెరగమే కాకుండా ఇత పార్టీలకు చెందిన బలమైన నేతలను ఆకర్షించేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. అధికార టీఆర్ఎస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్ష మైన కాంగ్రెస్‌లోని అసంతృప్తులకు గాలం వేసేందుకు వీలవు తుందని పార్టీ అధినాయకులు భావిస్తున్నారని చెబుతున్నారు.

ఉద్యాన మహోత్సవంపై
టీ శాట్ ప్రత్యేక కార్యక్రమం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉద్యానమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టి శాట్ నెట్‌వర్క్ ఛానల్ నిపుణులతో ప్రత్యేక ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సీఈవో ఆర్ శైలేష్‌రెడ్డి తెలిపారు. ఉద్యానవన శాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి టి సాట్ స్టూడియోకు హాజరై ఈ కార్యక్రమంపై ముచ్చటించనున్నారని ఆయన చెప్పారు. ఈ నెల 27నుంచి 31 వరకు ఐదు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను కమిషనర్ అందజేస్తారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలనుండి 4 గంటలవరకు కమిషనర్ లైవ్‌లో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యాన ప్రియులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు కమిషనర్‌తో నేరుగా మాట్లాడవచ్చన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ 1800425038కు ఫోన్ చేసి అనుమానాలను నివృఇ చేసుకోవాలన్నారు. తెలంగాణను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయాలన్న సీఎం ఆకాంక్షను నెరవేర్చుదామని ఆయన పిలుపునిచ్చారు.

ఉయ్యాలవాడ నర్సింహారెడ్డిని
జాతీయ వీరుడుగా గుర్తించాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నర్సింహారెడ్డిని జాతీయ వీరుడుగా గుర్తించాలని తమిళనాడు తెలుగుయువ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో ప్రధానిని, హోంశాఖ మంత్రితో పాటు పలువురు మంత్రులు, ఎంపీలను కలిసి విజ్ఞప్తి చేశారు.

మీడియా లైబ్రేరియన్లు ఇక జర్నలిస్టులే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1957 ప్రకారం మజీతియా వెజ్‌బోర్డు కమీషన్ సిఫారసుల మేరకు మీడియా సంస్థల్లోపనిచేస్తున్న లైబ్రేరియన్లను జర్నలిస్టులుగా గుర్తించి ప్రభుత్వం ద్వారా జర్నలిస్టులకు అందే అన్ని పథకాలు, సదుపాయాలను వర్తింప చేసేందుకు యత్నిస్తామని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ఒక ప్రకటనలో హామీ ఇచ్చారు.

భాగ్యనగరంలో భారీ బందోబస్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వినాయక చవితి, బక్రీద్ పండుగల సందర్భంగా సెప్టెంబర్ 2, 3 తేదీలలో నగరంలో శాంతిభద్రతల పరిరక్షణపై తగిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ తెలంగాణ మైనారిటీ విభాగం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మతసామరస్య పూర్వకమైన సోదరభావ వాతావరణంలో హైదరాబాద్ నగరం మనుగడ సాగిస్తుందని, దీన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మైనారిటీ విభాగం అధ్యక్షుడు తాజుద్దీన్ అన్నారు. హిందూ, ఇస్లాం, సంస్కృతుల మేలి సమ్మేళనం ఈ నగరానికి, ఈ రాష్ట్రానికి పెట్టని అలంకారమని, అయితే గతంలో జరిగిన అనేక ఉగ్రవాద ఘటనలు, అల్లర్ల దృష్ట్యా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తాజుద్దీన్ పేర్కొన్నారు.

అణగదొక్కుతూనే ఉద్ధరిస్తారా?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి చంద్రశేఖ రరావు అధికారంలోకి వచ్చిన నాటినుంచి రెడ్డి సామాజికవర్గాన్ని పథకం ప్రకారం దెబ్బతీస్తూ మరోవైపు ఆ వర్గాన్ని ఉద్ధరిస్తున్నట్లు ప్రకటనలు గుప్పించడం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి దుయ్యబట్టారు. రెడ్డి హాస్టల్ భవనానికి రూ.10 కోట్లు కేటాయించి దానిని ప్రచారం చేసుకోవడానికి రూ.10 కోట్లకుపైగానే పత్రికలలో యాడ్స్ ఇవ్వడం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తంచేశారు. రెడ్డి సామాజికవర్గం సంక్షేమం పేరుతో కేసీఆర్ సొంత ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నారనే విషయం దీంతో స్పష్టమవుతోందని ఆయన అన్నారు.

నేరెళ్ల ఘటనలపై హైకోర్టు విచారణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సిరిసిల్లా జిల్లా, నేరెళ్ల, రామచంద్రాపురం, జిల్లెల గ్రామాల్లో దళితులపై దాడి ఘటనపై దాఖలైన రెండు ప్రజాహిత వ్యాజ్యాలను కలిపి విచారించాలని హైకోర్టు నిర్ణయించింది. నేరెళ్ల ఘటనపై దాఖలైన రెండు ప్రజాహిత వ్యాజ్యాలను కలిపి ఒకే రోజు విచారణ జాబితాలో చేర్చాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వచ్చే వారానికి వాయిదా వేసింది. నేరెళ్ల ఘటనపై విచారణ చేపట్టాలని అభ్యర్థిస్తూ ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షుడు జస్టిస్ బి.చంద్రకుమార్ హైకోర్టుకు రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ..ఈ ప్రజాహిత వ్యాజ్యంలోని అభ్యర్థన (ప్రేయర్) పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం.లక్ష్మణ్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంలోని అభ్యర్థన ఒకటే అయినందువల్ల రెండింటినీ కలిపి విచారించాలని అభ్యర్థించారు.

క్యాట్ జుడీషియల్ సభ్యుడిగా జస్టిస్ రెడ్డి కాంతారావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్) జుడీషియల్ సభ్యునిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రెడ్డి.కాంతారావు నియమితులైనారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది(పర్సనల్)మరియు శిక్షణ విభాగం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జస్టిస్ రెడ్డి కాంతారావు హైదరాబాద్‌లోని క్యాట్ కు వచ్చే రెండేళ్ల పాటు నేతృత్వం వహించనున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సర్వీసు వివాదాలు త్వరగా పరిష్కరించే అవకాశం ఏర్పడింది.

డిగ్రీలో ప్రవేశాలకు
మరోసారి వెబ్ ఆప్షన్లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: డిగ్రీ మొదటి సంవత్సరంలో మంగళవారం వరకు 1,79,021 మంది చేరారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేపట్టారు. మూడు విడతల్లో కలిపి 1,79,021 మంది చేరారు. మూడో విడతలో సీటు పొందిన వారు కాలేజీల్లో చేరడానికి బుధవారం వరకు అవకాశం ఇచ్చారు. ఆన్‌లైన్‌లో దోస్తు ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరికీ సీటు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. రాష్ట్రంలో 4,10,267 సీట్లు ఉండగా వాటిలో ఇప్పటి వరకు 1,79,021 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా సుమారు 2 లక్షలకు పైగా సీట్లు మిగిలి ఉండటంతో దోస్తులో దరఖాస్తు చేసుకున్న వారందరికీ సీటు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇందులో భాగంగా మూడో విడతలో దరఖాస్తు చేసుకుని మొదటిసారి సీటు కేటాయించి తరువాత సీటు పొందని వారికి ప్రత్యేకంగా దోస్తు అధికారులే సీట్ల వివరాలను సేకరించి వారికి సీట్లను కేటాయించాలని ఆలోచిస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని సీటు పొందని వారు, అలాగే ఇప్పటికే కాలేజీల్లో చేరిన వారు వేరే కాలేజీలో చేరడం కోసం మరోసారి 24న వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఇవ్వాలని దోస్తు అధికారులు ఆలోచిస్తున్నారు. మంగళవారం ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరితో దోస్తు కన్వీనర్ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్-1 ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, సీజీజీ అధికారులతోపాటు దోస్తు అధికారులు సమావేశం అయ్యారు. పలు సమస్యలపై చర్చించారు. వాటిపై 24న నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. మొదటి విడతలోనే కోర్టుకెళ్లిన కాలేజీల్లో సీటు పొందిన విద్యార్థుల అంశంపై కూడా 24న నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మళ్లీ గురుకుల పీడీ పరీక్ష

హైదరాబాద్,ఆంధ్రప్రభ: గురుకులాల్లో ఫిజికల్ డైరెక్టర్ల నియామకం కోసం జూలై 18న నిర్వహించిన రాత పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్ణయించింది. ఈ రాత పరీక్షను తిరిగి సెప్టెంబర్ 7న నిర్వహించాలని నిర్ణయించినట్టు పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ తెలిపారు. పూర్తి వివరాలు సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు చెప్పారు.

కురంపల్లిలో జంట హత్యలు



కనగల్, కెఎన్ఎన్ : నల్గొండ జిల్లా, కనగల్ మండలంలోని కురంపల్లి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన రెండు జంట హత్యలు మంగళవారం జరిగాయి. కనగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దోటి పాండరయ్య, దోటి వెంకటేషం గొడవలతో దాసరి యాదయ్య కుటుంబానికి గత కొంతకాలంగా గ్రామంలో ఉన్న రెండున్నర ఎకరాల భూమికి సంబంధించిన వివాదం కొనసాగు తుంది. దాసరి యాదయ్య కొడుకులుఅన్నమయ్య (22), ఆంజనేయులు(24) దోటి పాండరయ్య కుమా రుడు అక్కలయ్యను గత జూన్ మాసంలో ఇదే భూవి వాదంలో కొట్టడం జరిగింది.

వీరిరువురు కనగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరిపై

మృతులిద్దరూ అన్నాదమ్ముళ్ళు

పోలీసులు కేసు నమోదు చేసి అటు తర్వాత స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. ఆ క్రమంలోనే కొన్ని రోజుల తరబడి ఇరు కుటుంబాల నడుమ తరచూ గొడవలు జరుగుతు న్నాయి. కానీ భూసమస్య కొలిక్కిరాలేదు. అంతకు ముందు పాండరయ్య కుమారుడు అక్కలయ్య దళిత యువతిని వివాహం చేసుకొని ఇరువురి మధ్య గొడవకు దారితీసింది. ఆ యువతిని ఎలాగైనా విడిపించుకోవాలని పెద్ద మనుషుల సమక్షంలో ఆమెకు రెండున్నర ఎకరాల భూమిని ఆమె పేరున రిజిస్ట్రేషన్ పాండరయ్య చేసి కొడుకు, కోడలుకు విడిపించారు. ఇదే క్రమంలో కోడలుకు ఇచ్చిన భూమిని దాసరి యాదయ్య మార్కెట్‌రేట్ ప్రకారం కొనుగోలు చేసి యాదయ్య రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు.

ఈ నేపథ్యంలో పాండరయ్య, యాదయ్య కుటుంబాలకు కక్షను పెంచుకుంటూ ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం పొలంమీదుగా మరొకరి పొలాన్ని కౌలుకు తీసుకొని వరి సాగుచేస్తున్నారు. అయితే మెదినీళ్ళు యాదయ్య పొలం మీదుగా వెళ్తుండగా వాటిని అడ్డుకొని కట్ట వేయడం జరిగింది. ఈ నేపథ్యంలో వివాదం మరింత ముదిరింది. ఉదయం 6గంటలకు ఆంజనేయులు, అన్నమయ్యలు పొలం వద్దకు చేరుకున్నారు. అక్కడ కిరణ్‌తో మెదినీటిని ఆపివేయాలని కిరణ్‌తో గొడవపడ్డాడు. దోటి పాండరి, మల్లేష్, భరత్, అక్కలయ్య, సైదులు, కిరణ్ వెంకటేశంలు కత్తులు, గొడ్డండ్లు తీసుకొని ఆంజనేయులు, అన్నమయ్యపై దాడిచేసి దారుణంగా హత్యచేశారు. అడ్డుపడిన అతని బాబాయి అయిన దోటి యాదయ్యను హతమార్చేలోగా తప్పించుకొని గ్రామానికి పారిపోయాడు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మృతుని తండ్రి యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చండూరు సిఐ రమేష్‌కుమార్ తెలిపారు. సంఘటనా స్థలానికి నల్గొండ డిఎస్‌పి ఎస్.సుధాకర్, నల్గొండ టుటౌన్ సీఐ వెంకటేశ్వర్లు, కనగల్, చండూరు ఎస్‌ఐలు బందోబస్తును నిర్వహించారు. మృత దేహాలను రాత్రి కురంపల్లికి అంత్యక్రియలకు తరలించారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పలువురు నాయకులు మృతదేహాలను పరామర్శిం చారు. కాగా దాసరి యాదయ్యది చండూరు మండలం నెర్మట గ్రామం కాగా 20ఏళ్ళక్రితం ఇదే హత్యకు గావించిన కుటుంబమే వీరిని చేరదీసింది. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాలను చండూరు మండలం నెర్మటకు తరలించారు.




భవానీ జాతరకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఆరుగురి మృతి

వాంకిడి/ఆసిఫాబాద్ టౌన్, కెఎన్ఎన్: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం బెండార గ్రామ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈదుర్ఘటనలో ఆరుగురు మృతి చెందగా, ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. కెరమెరి మండలం లింబుగూడ, ఆగర్‌వాడ, ఝరీ గ్రామాలకు చెందిన 11 మంది యువకులు ఆటోలో వాంకిడి మండలం సరాండి సమీపంలో ఉన్న గుట్టపై వెలిసిన భవానీ మాత జాతరకు బయలుదేరారు.

బెండార సమీపంలో ఆటోను లారీ ఢీ కొంది. సంఘటనలో కెరమెరి మండలం లింబుగూడకు చెందిన ఆదే తిరుపతి (25), ఆగర్‌వాడకు చెందిన వెడ్మ ఆంబారావు (20) అక్కడికక్కడే మృతి చెందగా క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లింబుగూడకు చెందిన మోహర్లే సంతోష్ (20) మృతి చెందాడు. మరో ఇద్దరు టాక్రే రవీందర్ (16), లెండిగూరే రమేష్(14) మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో ప్రాణాలువిడిచారు. మోహర్లే జ్ఞానేశ్వర్, మోహర్లే రాంచందర్, మోహర్లే తిరుపతి, వాడై గణేష్‌లకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల, కరీంనగర్ ఆసుపత్రులకు తరలించారు.

అధికార లాంఛనాలతో సమ్మయ్య అంత్యక్రియలు





వరంగల్, కెఎన్ఎన్ బ్యూరో : మాజీ మంత్రి, షెడ్యూల్ కులాల, తెగల జాతీయ కమిషన్ మాజీ సభ్యులు బొచ్చు సమ్మయ్య (78) అంత్యక్రియలు మంగళవారం నాడు పరకాలలో ప్రభుత్వ లాంఛనా లతో జరిగాయి. అనారోగ్యంతో సమ్మయ్య సోమ వారం నాడు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో కన్నుమూశారు. పరకాల నియోజకవర్గం నుంచి రెండుమార్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన సమ్మయ్య 1980-82 మధ్యకాలంలో రాష్ట్ర మంత్రిగా ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ కమిషన్ జాతీయ సభ్యుడిగా పనిచేశారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు సమ్మయ్య అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. జిల్లా రూరల్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, వరంగల్ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబులు పరకాలలోని దళిత వాడలో సమ్మయ్య ఇంటికి చేరుకొని ఆయన మృతదేహంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య పరకాల, నర్సంపేట, స్టేషన్‌ఘన్ పూర్ శాసన సభ్యులు చల్లా ధర్మారెడ్డి, దొంతి మాధవ రెడ్డి, తాటికొండ రాజయ్య, మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ మంత్రి జీ. విజయరామా రావు, వరంగల్, కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్‌లు సాంబారి సమ్మారావు, ఆరెపల్లి మోహన్, మాజీ శాసన సభ్యులు కొండేటి శ్రీధర్, ఆరోగ్యం, పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఇనగాల వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ.వి శ్రీనివాస్‌రావు, రాజనాల శ్రీహరి, బత్తిని శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళతప్పిన సచివాలయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రతిరోజూ సందర్శకులతో క్రిక్కిరిసిపోయే తెలంగాణ సచివాలయం కంపు కొడుతోంది. సచివులు రాక, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి మురికికూపంగా మారింది. ముఖ్యమంత్రి కార్యాలయమైన సమత బ్లాక్‌లో ఆరు అంతస్తులు పూర్తిగా ఎలుకలు, పందికొక్కులు తిరుగుతున్నట్లు కిందిస్థాయి ఉద్యోగులు చెబుతున్నారు. అలాగే మంత్రుల కార్యాలయాలు కూడా అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. సచివాలయ బ్లాకులను, ప్రాంగణాన్ని శుభ్రపరిచే సిబ్బంది మొత్తం ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వారే కావడంతో నిర్లక్ష్యం పెరిగిపోతోంది. పైగా పైస్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఇష్టారాజ్యపు విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఎక్కడ పడిన చెత్త అక్కడే కనిపిస్తోంది. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ సచివాలయం గత ఏడాదిన్నర కాలంగా పాడుబడిపోవడంతో అక్కడ పేరుకుపోయిన చెత్తకంపు తెలంగాణ సచివాలయంవైపు పాకుతోంది. ఇటీవల కాలంలో సిఎం కేసీఆర్ అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో అధికార యంత్రాంగం వ్యవహారం ఆడిందే ఆటగా, పాడిందే పాటగా సాగుతోంది. ఇక కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పనితీరు అయితే చెప్పనక్కరలేదు. ఏ చాంబర్‌లో చూసినా డజన్లకొద్ది ఎలుకలు నివాసం ఏర్పరచుకున్నాయి. పాతకాలం నాటి ఫైళ్ళను కొరుక్కుతింటున్నాయి. ఎలుకల బెడద నివారణ కోసం క్రిమిసంహారక మందులు వాడుతున్న ఉద్యోగులకు కొత్త కోణంలో సమస్యలు ఎదురవుతు న్నాయి. చనిపోయిన ఎలుకలు ఎక్కడో ఒకచోట మూలన కనిపించకుండా కుళ్ళిపోతుండడంతో భరించలేని కంపు వాసన తప్పడం లేదు. దీంతో తెలంగాణ సచివాలయంలో ఎక్కడ చూసినా దుర్గంధం, దుర్వాసన పేరుకుపోయింది.

విదేశాలనుంచి డ్రగ్స్ రవాణా అరికట్టడమెలా..!?





- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో ఎన్‌సీబీ అధికారుల సమావేశం
- డ్రగ్స్‌కేసు వివరాలను ఎన్‌సీబీకి అందజేత

ఆన్‌లైన్ డ్రగ్స్ సంస్థల కట్టడిపై సమావేశంలో సుదీర్ఘ చర్చ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో విస్తరిస్తున్న మాదకద్రవ్యాల అక్రమరవాణాపై కఠినంగా వ్యవహరించేందుకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు శాఖ సంయుక్తంగా దృష్టిసారించాయి. ఇటీవల తెలంగాణ డ్రగ్స్ కేసు వివరాలపై పార్లమెంటులో ప్రస్తావనకు వచ్చిన సంద ర్భంలో దాని వివరాలు తమకు అందలేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన నేపథ్యంలో రాష్ట్రం అప్రమత్తమైంది. తెలంగాణలో పాతుకుపోయిన డ్రగ్స్ మూలాలపై దెబ్బకొట్టేందుకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు సంయుక్తంగా దాడులు చేస్తున్నారు. పబ్ కల్చర్ విస్తృతే డ్రగ్స్ వ్యాప్తికి కారణంగా దర్యాప్తు సంస్థలు గుర్తిం చాయి. డ్రగ్స్ వాడకం ఓ పబ్‌లకే పరిమితం కాలేదు. కొందరు కళాశాలల, పాఠశాల విద్యార్థులను సైతం మాదకద్రవ్యాల మత్తులో ముంచేశాయి డ్రగ్స్ మాఫియాలు. డ్రగ్స్ కేసులో ఎక్సైజ్ సిట్ 12 మంది సినీ ప్రముఖులను విచారించిన సంగతి తెలిసిందే. డ్రగ్స్ కేసులో కీలకనిందితులైన కాల్విన్, మైక్ కమింగా, గాబ్రియేల్, విజయవాడకు చెందిన లేడీ డాన్ సంగీతలనుంచి విలువైన సమాచారాన్ని ఎక్సైజ్ సిట్ రాబట్టింది. వారందించిన సమాచారంతో సినీ ప్రముఖులతో పాటు డ్రగ్స్ విని యోగిస్తున్న వివిధ వర్గాలకు చెందిన వారిని ఎక్సైజ్ సిట్ విచారించిన సంగతి విది తమే. డ్రగ్స్ దందాలో నైజీరియన్లు సైతం ప్రముఖ పాత్ర పోషించినట్లు ఎక్సైజ్ సిట్ గుర్తించింది. దీంతో వీసాల గడువు పూర్తయినా నగరంలో తిష్టవేసిన సోమాలియా, నైజీరియన్ల దేశస్థుల ఆచూకీని కనిపెట్టేందుకు ఇమ్మిగ్రేషన్ అధికారులతో కలిసి పోలీ సులు కార్డాన్ సెర్చ్‌లు నిర్వహించారు. మరోవైపు పబ్‌లు, రెస్టారెంట్లు, హోటల్స్ యాజమాన్యాలతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ చంద్రవదన్, డైరెక్టర్ అకున్ సబర్వాల్‌లు సమావేశాలు నిర్వహించారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని నిర్దేశిత ఆదేశాలను జారీ చేశారు. రాత్రి 12 గంటల వరకే అనుమతినిచ్చారు. ఆ నిబం ధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆయా ప్రాంత సెక్టార్ ఎస్‌ఐలను బాధ్యులను చేస్తూ త్రై కమిషనరేట్ పోలీసు బాస్‌లు మహేందర్‌రెడ్డి, మహేష్‌భగవత్, సందీప్‌శాండిల్యాలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తాజాగా మసాజ్ సెంటర్ల వేదికగా నిర్వహించే డ్రగ్స్ దందాను సైతం పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా.. తద్వారా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పరిరక్షించాలన్న ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు చర్యలను తీవ్రతరం చేశారు. తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. తెలంగాణలో డ్రగ్స్ అరికట్టే అంశంపై వారు చర్చించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ మాఫియా డేటాను నార్కొటిక్ బృందం సేకరించింది. ఈ డేటా సాయంతో విదేశాల నుంచి డ్రగ్స్ రవాణా అరికట్టడం, డార్క్‌నెట్ వంటి ఆన్‌లైన్ డ్రగ్స్ సంస్థల కట్టడిపై సుదీర్ఘంగా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

సమావేశంలో ఎన్‌సీబీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.పి.సింగ్, జోనల్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌సిన్హా, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ ఏడీజీ ఎంకె సింగ్, ఏడీ ప్రసాద్ అదెల్లి, తెలంగాణ పోలీసు అడిషనల్ డీజీ గోవింద్‌సింగ్, రాచకొండ అడిషినల్ డీసీపీ డి.వి.శ్రీనివాసరావు, సైబరాబాద్ అడిషినల్ డీసీపీ బి.శ్రీనివాసరెడ్డి, తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్టుమెంట్ కమిషనర్ ఆర్.వి.చంద్రవదన్, డైరెక్టర్ అకున్ సబర్వాల్, తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కమాండెంట్ సుధీర్‌కుమార్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఎ.సి.క్రైమ్ షేక్ కరీముల్లా, కస్టమ్స్ అడిషినల్ కమిషనర్ ఆర్.కె.రామన్, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.కె.మహంతిలు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

సిద్దార్థ్ @ డ్రగ్స్ దందా

చేసేవారని సిద్దార్థ వెల్లడించినట్లు తెలుస్తోంది. వారిలో కొందరు టీవీ ఆర్టిస్టులు, సినిమాల్లో వ్యాంప్ పాత్రలు చేసే వారు, కొందరు జూనియర్ ఆర్టిస్టులు కూడా ఉన్నారని సిద్దార్థ చెప్పాడని, వారి పేర్లు కూడా వెల్లడించినట్లు తెలుస్తోంది. వారిలో ఒక సినీ నటి ఇంతకు ముందు వ్యభిచారం కేసులో అరెస్టైనట్లు విచారణలో వెల్లడైంది. స్నేహితులతో కలిసి తరచూ గోవా పార్టీలు చేసుకునే వాళ్లమని, దానికి గ్లామర్ టచ్ తప్పనిసరిగా ఉండేదని సిద్దార్థ చెప్పినట్లు సమాచారం. ఎవరికీ తెలియకుండా ఎంజాయ్ చేయడానికి స్పాలు, మసాజ్ సెంటర్ల ఉపయోగపడు తున్నట్లు సిద్దార్థ పోలీసు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. థాయ్‌లాండ్, మకావూ తదితర దేశాల్లో దొరికే వినోదాలను ఇప్పుడు హైదరాబాద్‌లోనే అందిస్తున్నామని అతను చెప్పినట్లు సమాచారం. సైబరాబాద్ పోలీసులు శని, ఆదివారాల్లో పెద్ద ఎత్తున స్పాలు, థాయ్ మసాజ్ సెంటర్లపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. పలు స్పాలు నిర్వహిస్తోన్న సిద్దార్థతో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తు న్నారు. స్పాల నిర్వహణ, దాని పేరిట సాగుతోన్న చీకటి దందాకు సిద్దార్థే కింగ్‌పిన్ అని ఇతర నిందితులు వాంగ్మూ లం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పోలీసులు అతడిని ప్రత్యేకం గా విచారిస్తున్నారు. తొలుత షరా మామూలుగానే సిద్దార్థ పోలీసు విచారణకు సహకరించలేదని, తర్వాత పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించి సిద్దార్థ నుంచి పలు ఆసక్తికరమైన విషయాలు రాబట్టినట్లు సమాచారం. అంతకు ముందు జల్సాలు చేశా... ఆ తర్వాత తనతో పాటు ఇతరుల తెరచాటు అవసరాలు తీర్చడానికి థాయ్ మసాజ్ నిర్వహించినట్లు సిద్దార్థ అంగీకరిం చినట్లు తెలుస్తోంది. దందాలో విపరీతంగా డబ్బు వస్తుండటంతో కొకైన్ వంటి డ్రగ్స్‌కు తాను అలవాటు పడ్డానని కూడా సిద్దార్థ పోలీసులకు తెలిపినట్లు సమాచారం. థాయ్ మహిళలను హైదరాబాద్‌కు రప్పించడం ఖరీదైన వ్యవహారం గా మారడంతో మన దేశంలోని ఈశాన్య ప్రాంతా లైన త్రిపుర, నాగాలాండ్, అసోం, మిజోరాం వంటి ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన అమ్మాయిలను తీసుకొచ్చి శిక్షణ ఇప్పించినట్లు పోలీసులు గుర్తించారు. మకావు తరహాలో తన స్పా వ్యాపారాన్ని డెవలప్ చేయాలనుకున్నానని, అందుకే థాయ్ అమ్మాయిలను ఇక్కడకు తీసుకొచ్చానని సిద్దార్థ చెప్పినట్లు తెలుస్తోంది. తన అనుచరులు సర్ఫరాజ్ అలీ, వినయ్, అజయ్ మిగతావారిని రంగంలోకి దింపి స్పాలను విస్తరించాడు. ఓ ఈవెంట్లో అతనికి ముంబైలో ఉన్న థాయ్ లాండ్ యువతి కేకా పరిచయమైంది. మసాజ్ సెంటర్లలో ఉద్యోగం పేరుతో థాయ్‌లాండ్, ఈశాన్య రాష్ట్రాల యువతు లకు ఆమె వల వేసిందని సమాచారం. నెలకు రూ.50 నుంచి 90 వేల వరకూ వేతనంగా చూపించేది. అందుకు అంగీకరిం చిన యువతులను సిద్దార్థ్‌కు పరిచయం చేసేది. వారితో మొదట మసాజ్ చేయించిన సిద్దార్థ కస్టమర్ల కోరిక తీర్చితే వేతనంతో పాటు భారీగా కమిషన్ కూడా ఇస్తానని ఆశపెట్టేవాడని సమాచారం. థాయ్‌లాండ్‌లో వ్యభిచారం లీగలైజ్ కావడంతో యువతులు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ దందాలో సిద్దార్థ్ నెలకు కోటికి పైగా సంపాదించే వాడని అంటున్నారు. తమను ఇక్క డి నుంచి పంపించేయా లంటూ మసాజ్ సెంటర్లలో పట్టుబడిన థాయ్ యువతులు రెస్క్యూ హోం నిర్వాహకులతో వివాదానికి దిగినట్లు తెలు స్తోంది. అలా దొరికిన 34 మంది థాయ్‌లాండ్ యువతులను స్వదేశానికి రప్పించేందుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారు.

సిద్దార్థ్ గుట్టు విప్పింది అతని ప్రేయసే...

స్పా, మసాజ్ సెంటర్లలో హైటెక్ వ్యభిచారం నిర్వహి స్తున్న సమాచారాన్ని పోలీసులకు అందించింది ఓ మహిళ అని తెలుస్తోంది. ఆమె సిద్దార్థ్ మాజీ ప్రేయసి అని చెబుతు న్నారు. దాసరి సిద్దార్థ్ ఆమెను ప్రేమించి, తర్వాత మోసం చేశాడని అంటున్నారు. ఆమె పోలీసుల వద్దకు వెళ్లి సెక్స్ దందా గురించి చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. థాయ్ లాండ్ మహిళలను తొలుత మసాజ్ చేయడానికంటూ నియమించుకుని తర్వాత వ్యభిచార రొంపిలోకి దింపినట్లు తెలుస్తోంది. మసాజ్ సెంటర్లలో పనిచేస్తున్న మహిళల్లో కొందరు నెలకు దాదాపు రూ.40 వేల దాకా సంపాదించినట్లు పోలీసులు గుర్తించారు. యజమాని ఇచ్చే వేతనం, విటులు సమర్పించే టిప్స్, కమిషన్ వంటి ఇతర రూపాల్లో కలిపి అంత వచ్చేదని అంటున్నారు. విజిట్ వీసాపై థాయ్‌లాండ్ మహిళలు హైదరాబాద్ వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. వారి వయస్సు 22 నుంచి 26 ఏళ్ల మధ్య ఉంటుంది. మసాజ్ సర్వీసులకు రూ.4 వేల చొప్పున, శృంగారానికి 8 వేల రూపాయల చొప్పున స్పా, మసాజ్ సెంటర్ల యజమానులు కస్టమర్ల నుంచి వసూలు చేసినట్లు చెబుతున్నారు. నగదు రూపంలోనూ క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కస్టమర్లు డబ్బులు చెల్లించేవారు. కొంతమంది ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరిపేవారని సమాచారం. డబ్బులు 12 బ్యాంకులకు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. కొంతమంది మహిళలకు సిద్దార్థ్ స్పాలోనే వసతి ఏర్పాటు చేశాడు. సిద్దార్థ్ సదరు మహిళల కోసం బంజారాహిల్స్‌లో త్రిబుల్ బెడ్‌రూం ఫ్లాట్స్ అద్దెకు తీసుకున్నాడు. అతను నెలకు రూ.2 లక్షలు అద్దె చెల్లిం చేవాడు. శనివారం రాత్రి సైబరాబాద్ పోలీసులు ఆరు స్పాలపై దాడులు చేసి 65 మంది మహిళలను, సిద్దార్థ్ అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో 34 మంది థాయ్‌లాండ్ మహిళలు, 21 మంది భారతదేశంలో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారని పోలీసులు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇక్కడి స్పా, మసాజ్ సెంటర్లకు థాయ్‌లాండ్, ఈశాన్య రాష్ట్రాల నుంచి మహిళలను పంపిన ముంబైకి చెందిన థాయ్‌లాండ్ మహిళ కేకా కోసం రెండు పోలీసు బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

ఎన్ఎంఈఆర్‌సీ సభ్యుడిగా శ్రీకాంత్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణకు చెందిన రాంనేని శ్రీకాంత్‌ను జాతీయ అల్ప సంఖ్యాక వర్గాల విద్యా పర్యవేక్షక కమిటీ సభ్యులుగా నియమిస్తూ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాంత్ ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా రుద్రారం గ్రామానికి చెందిన వ్యక్తి. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ పదవీ కాలం మూడు సంవత్సరాలు ఉంటుంది. దేశంలోని మైనారిటీల విద్యా ప్రణాళికను తయారు చేయడం, మైనారిటీల కోసం కేంద్రం అమలు చేస్తున్న అనేక పథకాల అమలును సమీక్షిస్తుంది. ఈ పథకాలు మైనారిటీలకు అందేలా కమిటీ రిపూర్ట్ చేస్తుంది. మైనారిటీలకు మెరుగైన విద్యను అందించే వ్యూహాలను అమలులోకి తీసుకురావడానికి తగిన సూచనలు, సలహాలను సూచిస్తుంది. రాంనేని శ్రీకాంత్ విద్యార్థి దశ నుంచే విద్యారంగ సంస్కరణల కోసం ఉద్యమాలు నిర్వహించారు.

ఆన్‌లైన్‌లోనే పాస్‌పోర్టు వెరిఫికేషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ఆలస్యాన్ని తగ్గించేందుకు కొత్త విధానాన్ని రూపొందించిన కేంద్ర ప్రభుత్వం క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్(సీసీటీఎన్ఎస్) సహా యంతో వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. పాస్‌పోర్టు సర్వీసుతో సీసీటీఎన్ఎస్‌ను అనుసంధానం చేసి ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రి యను చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ మెహ్రీవ్. ఈ నూతన విధానంలో పోలీసు అధికారులకు ట్యాబ్‌లను అందిస్తారు. వీటిని తీసుకుని పాస్‌పోర్టు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లే వారి వివరాలను అక్కడే నమోదు చేసి అప్‌లోడ్ చేస్తారు. వీటిని తీసుకుని పాస్‌పోర్టు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారి వివరాలను అక్కడే నమోదు చేసి అప్‌లోడ్ చేస్తారు. ప్రభుత్వం తదనుగుణంంగా క్రిమినల్ కేసులకు సంబంధించిన వివరాలు, నేరస్తుల వేలి ముద్రలు, జైళ్లశాఖ, జువైనల్ హోం వివరాలను సీసీటీఎన్ఎస్‌తో అనుసంధానం చేయనుందన్నారా యన.దేశవ్యాప్తంగా ఉన్న 15,398 పోలీస్ స్టేషన్లలో 14,284 పోలీస్‌స్టేషన్లు సీసీటీఎన్ఎస్‌తో అనుసంధానించి ఉన్నాయి. ఇప్పటివరకు 2.5 కోట్ల ఎఫ్.ఐ.ఆర్. వివరాలు నిక్షిప్తం చేశారు.

నరసింహన్ చెంతకు సహజసిద్ధ గణపతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్ రావు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. వినాయక చవితి పర్వది నాన్ని పురస్కరించుకుని వర్సిటీ పరిధిలోని హోం సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో సహజసిద్ధ రంగులతో సిద్ధంచేసిన మట్టి గణపతి విగ్రహాన్ని అందజేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే వినాయక విగ్రహాల ద్వారా కాలుష్యం పేరుకుపోతున్నందున వ్యవసాయ వర్సిటీ తమవంతు భాగస్వామ్యంగా ప్రజల్లో అవగాహనతో పాటు సహజసిద్ధ రంగులను తయారుచేసి విక్రయిస్తోం దని తెలిపారు. ఆకర్షణీయమైన ఆకృతిలో, ప్రకృతి సోయగాలు ఒలికిస్తూ కనిపించిన గణనాథుని విగ్రహాన్ని చూసి గవర్నర్ నరసింహన్ దంపతులు పరవశించిపోయారు.

బీసీ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వాలి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ మైనారిటీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసి కేవలం బీసీ కార్పొరేషన్‌కు మాత్రం నిధులు విడుదల చేయలేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం విమర్శించింది. జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలపై ఎందుకు ఈ వివక్షను ప్రదర్శిస్తున్నారని ప్రభుత్వాన్ని సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌తోపాటు 11 ఫెడరేషన్లకు గత ఏడాది ఇవ్వాల్సిన రూ. 102 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసేలా చూడాలని మంగళవారం ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, నాయకులు గొరిగే మల్లేష్, నందగోపాల్, జి కృష్ణయాదవ్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎస్సీ,ఎస్టీ మైనారిటీ కార్పొరేషన్లకు ఏ ఏడాది నిధులు ఆ ఏడాది విడుదల చేస్తూ బీసీ కార్పొరేషన్‌కు మాత్రం గత మూడేళ్లుగా నిధులు విడుదల చేయడం లేదని ఆర్ కృష్ణయ్య విమర్శించారు. ఇప్పటి వరకు రూ. 102 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. బీసీల్లో కొన్ని కులాల అభివృద్ధి కోసం 12 ఫెడరేషన్లను ఏర్పాటు చేశారని అన్నారు. వాటిలో నాయిబ్రాహ్మణ ఫెడరేషన్‌కు రూ. 250, రజక ఫెడరేషన్‌కు రూ. 250 కోట్లు మినహా మిగిలిన 10 ఫెడరేషన్లకు నిధులు కేటాయించలేదన్నారు. 10 ఫెడరేషన్లలో సుమారు 15 లక్షల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు రూ. 2000 కోట్లు, గీత కార్పొరేషన్‌కు రూ. 2000 కోట్లు కేటాయించాలని మిగిలిన ఫెడరేషన్లకు రూ. 2100 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆర్థికశాఖ మంత్రి త్వరలోనే బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్టు ఆర్ కృష్ణయ్య తెలిపారు.

పైరసీని అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు

- మంత్రి తలసాని స్పష్టం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : చలనచిత్ర రంగాన్ని పరిరక్షించేం దుకు పైరసీని అరికట్టడంలో అధికారులు మరింత పకడ్బందీ చర్యలు చేపట్టాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ సూచించారు. మంగళవారం సచివాలయం లోని తన చాంబర్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఫర్ ఇండియన్ కాపీరైట్స్ సంస్థ చైర్మన్ రత్నాకర్, డైరెక్టర్ అరవింద్‌లు మంత్రిని కలిశారు. ఈ సందర్భం గా వారు మంత్రితో పలు విషయా లపై చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, చలనచిత్ర పరిశ్రమపై ఆధారపడి వేలాది మంది జీవనోపాధిని పొందుతు న్నారని ఆయన పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధికి, సినీ కళాకా రుల సంక్షేమం కోసం సీఎం కె.చంద్రశేఖరరావు ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మంత్రి చెప్పారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చిత్రాలు పైరసీ కార ణంగా నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సినీ రంగంతో పైరసీతో పాటు ఇతర రంగాలలో జరుగుతున్న కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం కఠినం గా వ్యవహరిస్తుందన్న విషయా న్ని గుర్తుచేశారు. పైరసీ నివారణకు ప్రభుత్వం మీకు అన్ని విధాలా సహకారం అందిస్తుందని మంత్రి చెప్పారు. మంత్రిని కలిసిన వారి లో విజిలెన్స్ సంస్థ అడ్మిన్ ఆఫీసర్ శివ, పీఆర్‌వో చంద్రశేఖర శర్మ, బీఆర్ నాయుడు, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులదే



హైదరాబాద్,ఆంధ్రప్రభ: సమాజాన్ని ప్రభావితం, మార్చే శక్తి ఉపాధ్యాయులకు ఉన్నదని ప్రభుత్వ గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సి. రవీందర్ రచించిన ' టీచింగ్ సైకాలజి ' అనే పుస్తకాన్ని మంగళవారం సంక్షేమ భవన్‌లో ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో విద్యార్థులు పాఠాలను ఆసక్తిగా వినే విధంగా చేయగల సామర్థ్యం ఉపాధ్యాయులకె ఉన్నదని పేర్కొన్నారు.

ఎంబీసీలకు రూ.100 కోట్లు కేటాయించాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : అత్యంత వెనుకబడిన కులాల విద్యార్థుల హాస్టళ్ల కోసం 50 ఎకరాల భూమి, రూ. 100 కోట్లు కేటాయించాలని ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని కోరారు. సమాజంలో అన్ని రంగాల్లో ముందున్న రెడ్డి సామాజిక కులస్తులకు హైదరాబాద్ లో 15 ఎకరాల భూమి, రూ. 10 కోట్లు కేటాయించిన సీఎం చంద్రశేఖర్‌రావు ఎంబీసీలపై కూడా ప్రత్యేక శ్రద్దను తీసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

సగరులను ఎంబీసీలో చేర్చండి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయాల్లో వెనుకబడి సగర కులస్తులను ఎంబీసీల జాబితాలో చేర్చాలని బీసీ కమిషన్ చైర్మన్ రాములుకు సగర కుల సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బీసీ కమిషన్ కార్యాలయానికి వచ్చిన సగర కులస్తులు చైర్మన్ రాములుతో పాటు సభ్యులను కలిశారు.

ఉబెర్ ఇండియా సీపీఓగా హైదరాబాద్ మహిళ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అమెరికాకు చెందిన క్యాబ్ సర్వీస్ సంస్థ ఉబెర్, తమ భారత, దక్షిణాసియా శాఖలకు చీఫ్ పీపుల్స్ ఆఫీసర్‌గా హైదరాబాద్‌కు చెందిన విప్పాలరెడ్డిని నియమించింది

ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రవేశాల కేసులో హైకోర్టు నోటీసుల

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వివిధ విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ కోటా కింద అసలైన క్యాడెట్లకే ప్రవేశాలు కల్పించాలని దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులైన కేంద్ర ప్రభుత్వంతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది.

సెప్టెంబర్ 7న అబూసలెంకు శిక్ష ఖరారు


హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముంబై వరుస పేలుళ్ల కేసులో గ్యాంగ్‌స్టర్ అబూసలెం సహా ఐదుగురు దోషులకు శిక్షఖరారు కానుంది. ఈ కేసులో దోషులకు సెప్టెంబర్ 7న ముంబయి ప్రత్యేక టాడా కోర్టు శిక్ష విధించనుంది.


ఆర్టీసీలో ఎస్సీ రిజర్వేషన్లపై నివేదిక

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఎస్సీ రిజర్వేషన్ల అమలుపై నివేదిక సమర్పించాలని టీఎస్ రోడ్డు రవాణా సంస్థ ఎండి రమణారావును శాసనసభ ఎస్సీ సంక్షేమ కమిటీ చైర్మన్ హన్మంత్ షిండే ఆదేశించారు.

తిరగబడిన శశి వర్గం


- ఓపీఎస్‌తో కలయిక తమకిష్టం లేదన్న 19 మంది ఎమ్మెల్యేలు గవర్నర్‌తో భేటీ
- తమకు చాలామంది మద్దతున్నారని ప్రకటన
- బలపరీక్షకు అవకాశమిస్తే కొత్త సీఎంను ఇస్తామని వెల్లడి
- మౌనంగా ఈపీఎస్, ఓపీఎస్





కింకర్తవ్యం

చెన్నై: అంతా అయిపోయిందనుకున్న దశలో మళ్లీ అగ్గి రాజుకుంది. అన్నా డీఎంకేలో వైరి వర్గాలు కలిసిపోయాయనుకున్న దశలో మరో వైరి వర్గం తలెత్తింది. తాము దెబ్బతిన్నా, ప్రత్యర్థిని బతకనీయబోమంటూ శశికళ పనుపున దినకరన్ అన్నాడీఎంకే నుంచి 19 మంది ఎమ్మెల్యేలను బయటకు లాగా రు. వారిని గవర్నర్ దగ్గరకు తీసుకెళ్లారు. ఈ పళని స్వామి, ఓ పన్నీర్ సెల్వం వర్గాలు కలిసిపోయి, ఇద్దరికీ అధికారం సమంగా పంచుకున్న క్రమంలో దినకరన్ తన ఓటమిని అంత తేలిగ్గా అంగీకరించేలా లేదు. వీలయితే.. ప్రభుత్వాన్ని కూల్చి ఎన్నికలకు దారితీసే దారికి రాజకీయాలను నడుపుతున్నా డు. ఇదే అదనుగా ప్రతిపక్ష పార్టీలు ఇదే డిమాండ్‌ను తెరముందుకు తెస్తున్నా యి. డీఎంకేతో పాటు ఐయూఎంఎల్ కూడా సీఎం ఈపీఎస్‌ను బలపరీక్షకు సిద్ధపడాలని కోరుతోంది. శశికళ, దినకరన్‌లకు విధేయులైన ఎమ్మెల్యేలు మంగళవారం గవర్నర్ విద్యా సాగర్ రావును ఇరువర్గాలు కలిసిన మరునాడే కలిసారు. తమకు ఇంకా చాలా మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, వారి మద్దతుతో కొత్త సీఎంను ఎన్నుకుంటా మని చెపపారు. కాగా.. దినకరన్ తనకు 25 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని సోమవారం ప్రకటించినా గవర్నర్ వద్దక ు 19 మందే వచ్చారు. అయితే.. తన వర్గం వారిని పుదుచ్చేరి తరలించే ప్రయత్నంలో అందులో ఇద్దరు టోకరా ఇచ్చారని తెలుస్తోంది. పుదుచ్చేరిలోని రిసార్ట్‌కు కేవలం 7 మంది ఎమ్మెల్యేలే తరలి వెళ్లారని తెలుస్తోంది. ఈపీఎస్ మీద తమకు విశ్వాసం లేదని గవర్నర్‌కు చెప్పేసామని దినకరన్ అనుచరుడైన ఎమ్మెల్యే తమిళ్ సెల్వన్ చెప్పా రు. ప్రస్తుతం 234 మంది ఎమ్మెల్యేలున్న తమిళనాడు అసెంబ్లీలో అన్నాడీఎంకెకు సీకర్ కాకుండా 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. జయ మరణంతో ఖాళీ అయిన ఆర్కే నగర్ నియోజకవర్గం ఇంకా ఖాళీగానే ఉంది. కాగా ప్రతిపక్షడీఎంకెకు 89 మంది సభ్యులున్నారు. కాంగ్రెస్‌కు ఎనిమిది, ఐయూఎం ఎల్‌కు ఒకరు ఉన్నారు. ఈపీఎస్ బలపరీక్షను ఎదుర్కొంటారా అని అడగ్గా, అది మా ఉద్దేశమని తమిళ్ సెల్వన్ సమాధానమిచ్చారు. బలపరీక్ష జరిగితే తప్పనిసరి గా కొత్త సీఎం తెరమీదకు వస్తారని ఆయన అన్నారు. పన్నీర్ సెల్వంతో ఈపీఎస్ కలవడం ఇష్టం లేని దినకరన్ వర్గం తమకు అధికారం లేకుంటే, ప్రత్యర్థులకూ దక్కకూడదని ప్రయత్ని స్తోంది. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ ప్రధా న కార్య దర్శి హోదాలో దినకరన్, ఓపీఎస్ వర్గానికి చెం దిన వైద్య లింగంను పార్టీ పదవి నుంచి తొలగించారు. అయితే.. తన తొల గింపు చెల్లదని, వైద్యలింగం అన్నారు. ఫిబ్రవరి 18న జరిగిన బలపరీక్షలో పళని స్వామికి 122 మంది ఎమ్మెల్యేల ఓట్లు లభించాయి. అప్పట్లో 13 మంది ఎమ్మెల్యే లు ఓపీఎస్ వర్గంలో ఉన్నట్లైంది. ఇప్పుడు తాజాగా 122 మందిలో 19 మంది పళనిస్వామికి మద్దతు ఉపసంహరిం చుకుంటే.. పళనిస్వామి బలం 103కు పడి పోతుంది. అయితే.. 13 మంది ఓపీఎస్ వర్గం వారి ఓట్లను కలిపితే.. ఆ బలం 116 కు మాత్రమే పెరు గుతుంది. అయితే.. దినకరన్ వెంట కేవ లం 17 మంది మాత్రమే ఎమ్మెల్యేలు ఉన్నా రన్న వార్తలతో సీఎం బలం 118కి పెరిగే అవకాశమూ ఉంది. దీంతో గవర్నర్ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.


నన్ను కాదంటే..


నాతోపాటే మీరూనూ..



చమటతో విద్యుత్ ఇచ్చే బ్యాటరీలు

లాస్‌ఏంజెలెస్: భవిష్యత్‌లో మీ చమటను కూడా అమ్ముకోవచ్చేమో. ఎందుకంటే.. చమట నుంచి కూడా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి చార్జయ్యే బ్యటరీలు వస్తున్నాయి. భారత సంతతికి చెందిన శాస్త్రవేత్త కూడా భాగమైన అమెరికాలోని శాస్త్రజ్ఞుల బృందం చమట నుంచి శక్తిని ఉత్పత్తి చేసే బ్యాటరీలను రూపొందించింది. వీటితో ఎల్ఈడీలు, బ్లూటూత్ రేడియోల వంటి వాటిలో ఉపయోగించొచ్చు. వీటిని వేరబుల్ బయో ఫ్యూయల్ సెల్సని పిలుస్తున్నారు. అంటే ధరించదగిన బ్యాటరీలని అర్థం. మన శరీరంలోని దుస్తుల్లో ఈ బ్యాటరీలు ఉంచాలి. అప్పుడు అవి చెమట ద్వారా చార్జి అవుతాయి. ఇంకా పరిశోధనాత్మక దశలోనే ఉన్న ఈ బ్యాటరీలు ఈ రంగంలో ఒక పెద్ద సంచలనమని చెబుతున్నారు. వీటి ఆకారం సాగేందుకు అనుకూలగా ఉంటుంది. వీటిని మనం వేసుకునే బనియన్ల వంటి వాటిలో ఉంచొచ్చన్న మాట. దీంతో భవిష్యత్‌లో ఇలాంటి బనియన్లు తయారయ్యే అవకాశమూ ఉంది. అమెరికాలోని సాన్ డీగోలోని యూనవర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు ఈ బ్యాటరీలను అభివృద్ధి చేసారు. ఇంతకు మునుపు కూడా ఇలాంటి వాటిని కొందరు తయారు చేసినా, వీరు తయారు చేసిన బ్యాటరీలు వాడేందుకు అవసరమైన చార్జిని నిల్వ చేస్తున్నాయి. గతంలో ఇంత శక్తిమంతంగా బ్యాటరీలు చార్జి కాలేదు. వీటిలో 3డీ కార్బన్ నానోట్యూబ్ ఆధారిత కాథోడ్, ఆనోడ్ (బ్యాటరీలో ఉండే రెండు ధృవాలు) ఉంటాయి. వీటిని బయో ఫ్యూయల్ సెల్స్ అంటారు. ఎందుకంటే లాక్టిక్ యాసిడ్ (పాలలోనూ, మన చమట లోనూ ఉండేది) ను ఆక్సిజన్‌తో మండించి విద్యుత్‌ను పుట్టించే ఎంజైమ్, ఈ బ్యాటరీల్లో ఉంటుంది. అయితే.. ఇందులో వాడే పదార్థాల అనుపాతం ఎంతలో ఉండాలో పరిశోధిస్తున్నామని బృందంలో సభ్యుడైన అమయ్ బందోకర్ అన్నారు. ఈ బ్యాటరీ లోదుస్తుల్లో లేక దుస్తుల్లో పెట్టుకోవడానికి అనువుగా ఉండాలి దీంతో ఇది సాగేలా, తయారు చేస్తున్నారు. దీనిని బ్రిడ్జి అండ్ ఐలాండ్ అని రూపకర్తలు సరదాగా పిలుచుకుంటున్నారు. ఈ బ్యాటరీలు సన్నటి స్ప్రింగుల్లాగా ఉండి ఎంచక్కా వంగుతాయి కూడా. అయితే.. వీటి తయారీలో కొద్ది పాటి బంగారం కూడా ఉపయోగిస్తారు కాబట్టి వీటి ధర బాగానే ఉండొచ్చు. సాధారణ బ్యాటరీలకంటే ఇవే బాగా పని చేస్తాయని వీటిని రూపొందించిన బృందం అంటోంది.


దేశం కోసం సైనికుల్లా పని చేయండి



న్యూఢిల్లీ: ధనిక భారత దేశం కోసం సైనికుల్లాగా పని చేయాలని 200 మంది యువ సీఈఓలకు ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. నీతీ ఆయోగ్ నిర్వహించిన చాంపి యన్స్ ఆఫ్ చేంజ్ కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొని ప్రసంగించారు. ఈ సందస్సులో 2022 నాటికి నవ భారత్, రైతుల ఆదాయం పెంచడం, రేపటి నగరాలను నిర్మించడం, మేకిన్ ఇండియాను ముందుకు తీసుకుపోవ డం, ఆర్థిక వ్యవస్థను ప్రక్షాలించడం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడం అనే ఆరు అంశాలపై సదస్సులో చర్చించారు. నీతీ ఆయోగ్ చైర్మన్ అయిన ప్రధా ని, ఈ యువ సీఈఓలను తన టీంలో భాగమని చెప్పారు. 2022 నాటికి నగదు రహిత భారత దేశాన్ని తయారు చేయడానికి వీరు పని చేస్తారని చెప్పారు. దీంతో పాటు భార తీయుల సంక్షేమం గురించి కూడా సీఈఓలు ఆలోచించా లని మోడీ హితవు పలికారు. ప్రతి పౌరుడూ దేశం తనదని అనుకుని పని చేయాలని చెప్పారు. అందరూ వృద్ధిలో భాగం పంచుకుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని మోడీ అన్నారు. మహాత్మా గాంధీ నుంచి స్ఫూర్తి తీసుకుని భారతీ యుల సంక్షేమం కోసం పని చేయాలని మోడీ ఉద్బోధిం చారు. పరిశ్రమ పెద్దలు కూడా కడు పేదవారి గురించి ఆలో చించాలని పేర్కొన్నారు. అయితే.. సాంకేతికత సాయంతో ఉత్పత్తుల నాణ్యత పెంచితేనే భవిష్యత్ అని తేల్చి చెప్పారు. నాణ్యతతో రాజీ పడితే మనుగడ కష్టమేనని హెచ్చరించారు. రైతుల ఆదాయం పెంచాలంటే, వారి ప్రతి అంశానికీ విలువ పెంచాలని చెప్పారు. ఉదాహరణకు యూరియా గురించి చెబుతూ.. దీని ఉత్పత్తికి గ్యాస్ సరఫరా నిరాటంకంగా చేయ గలిగితే.. రైతులకు యూరియాను చౌకగా అందించి మేలు చేసినవాళ్లమవుతామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఈ మార్కెట్ ప్లేస్ (జీఈఎం) గురించి మాట్లాడారు. జీఈఎం ద్వారా పలు వస్తువులను ఆన్‌లైన్‌లోనే ప్రభుత్వం ఖరీదు చేయొచ్చని చెపప్రు. ఇప్పటికే జీఈఎం ద్వారా రూ. 1,000 కోట్ల విలువైన వస్తువులను సేకరించామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన 200 మంది సీఈఓలకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. నీతీ ఆయోగ్ చేర్మన్ గా రాజీనామా చేసిన అరవింద్ పనగరియా సేవలను మోడీ కొనియాడారు.

బ్లూవేల్‌పై ముప్పేట దాడి

- సోషల్ మీడియా సంస్థలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు
- బెంగాల్‌లో పాఠశాలల అసోసియేషన్ సదస్సులు
- హర్యానాలో ప్రభుత్వ కౌన్సెలింగ్
- త్వరలో అదే బాటలో ఇతర రాష్ట్రాలు



న్యూఢిల్లీ: యువతీ యువకులను ఆత్మహత్యకు ప్రేరేపిస్తున్న బ్లూవేల్ గేమ్ లింకులపై సోషల్ మీడియా సంస్థలు, ఫేస్‌బుక్, గూగుల్, యాహూల భారత్‌లోని కార్యా లయాలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. స్మార్ట్ ఫోన్ ఇంటర్నెట్‌లో లభ్యమయ్యే లింకులపై ఆయా సంస్థలు సమాధానం చెప్పాలని మంగళవారం జారీ చేసిన నోటీసు ల్లో కోర్టు పేర్కొంది. రష్యాకు చెందిన ఒక ఆన్‌లైన్ సంస్థ ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ గేమ్ వల్ల చాలా మంది చిన్నారులు భారత్‌లోనూ, ప్రపంచవ్యాప్తంగానూ ప్రాణాలు పోగొట్టుకున్నారు. దీంతో గుర్మీత్ సింగ్ అనే లాయర్ సదరు గేమ్ ను ఆన్‌లైన్‌లో ఉంచడంపై పిటిషన్ దాఖలు చేసారు. ఈ పిటిషన్‌ను విచారిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్, జస్టిస్ హరి శంకర్‌లతో కూడిన ధర్మాసనం కేంద్రానికి, ఢిల్లీ పోలీసులకు కూడా నోటీసులిచ్చింది. ఈ విషయంలో వారు తీసుకున్న లేదా తీసుకోబోయే చర్యలు తెలపాలంటూ ఆదేశించింది. సోషల్ మీడియా సంస్థలకు నోటీసులు ఇచ్చిన కోర్టు, కేంద్రం నివేదికపై సందరు సంస్థలు ఏం చర్యలు తీసుకున్నాయో నివేదిక దాఖలు చేయాలని ఆదేశించింది. కేసు విచారణను ఆగస్టు 28 కి వాయిదా వేసింది. కోర్టుతో పాటు ఈ విషయమై పశ్చిమ బెంగాల్, హర్యానాలోని స్కూళ్లు కూడా చర్యలు ప్రారంభించాయి. పశ్చిమ బెంగాల్‌లోని ఐసీఎస్ఈ స్కూల్స్ అసోసియేషన్ ఈ మేరకు ఒక వర్క్ షాప్ నిర్వహించాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో బ్లూవేల్ అనర్థాల గురించి అవగాహన పెంచ డం ఈ సదస్సు లక్ష్యం. ఎంపిక చేసిన విద్యార్థులకు సైబర్ నిపుణులు శిక్షణ ఇస్తారు. ఆ తరువాత ఆ విద్యార్థులు తమ తోటి వారికి అవగాహన కలిగిస్తారు. ఇప్పటికే సెంట్రల్ మోడ ర్న్ స్కూల్ అనే పాఠశాలలో జరిగిన సదస్సు వల్ల సంఘం ఈ నిర్ణయానికి వచ్చింది. హర్యానాలో అయితే.. ఏకంగా ప్రభుత్వమే రంగంలోకి దిగింది. హర్యానా బాలల రక్షణ కమిషన్ (హెచ్‌సీపీసీ) విద్యార్థలకు ఈ విషయమై కౌన్సెలింగ్ నిర్వహించనుంది. అలాగే విచిత్రంగా ప్రవర్తిస్తున్న విద్యార్థు లపై ఒక కన్నేసి ఉంచాలని పాఠశాలలకు, ఉపాధ్యాయులకు సూచించింది. ముఖ్యగా ఐదో తరగతి నుంచి 12వ తరగతి వరకూ విద్యార్థులను అవగాహన కల్పిస్తారు.

షహబుద్దీన్‌పై సీబీఐ చార్జిషీటు



న్యూఢిల్లీ: ఆర్జేడీ నాయకుడు షహబుద్దీన్ పైన సీబీఐ చార్జిషీటు దాఖలు చేసపింది. జర్నలిస్టు రాజ్‌దేవ్ రంజన్ హత్యకు ఆయన కుట్ర చేసారని మంగళ వారం అభియోగాలు మోపింది. నిరుడు డిసెంబర్‌లోనే షహబుద్దీన్‌పై చార్జిషీటు దాఖలు కాగా, తాజా చార్జీ షీటు రెండోది. సీబీఐ దర్యాప్తును తీసుకోవడానికి ముం దే బీహార్ పోలీసులు ఆరుగురిపై చార్జి షీటు దాఖలు చేసారు. ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న షహబుద్దీన్‌పై కుట్ర, హత్య కేసులను సీబీఐ నమోదు చేసింది. సివాన్ నుంచి నాలుగు సార్లు ఆర్జేడీ తరపున గెలిచిన షహబు ద్దీన్.. రంజన్‌ను హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే 45 కేసుల్లో సివాన్ ఎంపీ విచారణను ఎదుర్కొంటున్నాడు. తన కుమారులు ముగ్గురినీ షహబుద్దీన్ హత్య చేసాడని ఆరో పిస్తున్న చంద్రకేశ్వర్ ప్రసాద్ విజ్ఞప్తి మేరకు షహబుద్దీన్‌ను కోర్టు తీహార్ జైలుకు తర లించింది. నిరుడు మే 13న రంజన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు.

షిర్డీలో రక్తసేకరణ కేంద్రం

హై దరాబాద్, ఆంధ్రప్రభ: రక్త ధానం మాధవ సేవకు మించినదని షిర్డీ సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సురేష్ హవారే అన్నారు. మంగళవారం షిర్డీలో రక్త సేకరణ కేంద్రాన్ని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆయన ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. రక్తానికి మించిన ఇతర ప్రత్యామ్నా యం లేదని, దాతలు చేస్తున్న గొప్ప సాయం రక్త ధానమని ఆయన కొనియాడారు. తిరుమలలో భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నట్లుగానే షిర్డీలో భక్తులు రకర్త ధానం చేయాలని ఆయన కోరారు. ఈ లక్ష్యంతోనే దీనిని ప్రారంభజస్తున్నామని చెప్పారు. రక్త దాతలకు అన్ని మెరుగైన అధునాతన వసతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నా రు. రోజుకు 50వేల మంది భక్తులు షిర్డీకి దర్శనార్థం వస్తున్నారని, వీరికి సేవల కల్పన, రక్త దాతలకు ఇతర సౌకర్యాలపై దృష్టి పెట్టామన్నారు. ఇందులో ఒక్క శాతం భక్తులు రక్త దానానికి ముందుకు వచ్చినా 500 బాటిళ్ల రక్తం సేకరించవచ్చని అంచనా వేశామన్నారు. సంస్థాన్ ఇప్పటికే 25 బ్లడ్ బ్యాంకులతో సహకారం కోరిందన్నారు.

మీరు వెనక్కి వెళితేనే పరిష్కారం




- డొక్లామ్ విషయంలో భారత్‌కు చైనా మరో హెచ్చరిక
- రాజ్‌నాథ్ శాంతి ప్రకటన చేసిన 24 గంటల్లోనే చైనా పెడస్వరం

న్యూఢిల్లీ: డొక్లాంపై భారత్ శాంతి వచనాలు పలుకుతున్నా, చైనా మాత్రం ససేమిరా అంటోంది. భారత్ వచ్చినట్లు తాము డొక్లాంలోకి వస్తే ఇంతే సంగ తులని మంగళవారం తాజాగా హెచ్చరించింది. తమ సైన్యం భారత్‌లోకి వస్తే అరాచకమేనని చైనా విదేశాంగ శాఖ ప్రకటించింది. డొక్లాంలో చైనా రోడ్డు తమకు అభద్రతని భారత్ వాదించడంలో అర్థం లేదంది. భారత దేశమే చట్టవిరుద్ధంగా సరిహద్దు దాటి తమ భూభాగంలోకి ప్రవేశించిందని విదేశాంగ శాఖ ప్రతినిధి హువా చున్యాంగ్ ప్రకటించారు. భారత్ వివరణే కనుక నిజమైతే, ప్రతిదేశమూ పొరుగదేశంలోకి ఇష్టం వచ్చినట్లు ప్రవేశిస్తుందని చున్యాంగ్ విమర్శించారు. జూన్ నుంచి భారత్-చైనా దళాలు డొక్లాం విషయంలో ప్రతిష్టంభనలో ఉండడం తెలిసిందే. 1987 నాటి ఘటన తరువాత ఇదే అతి పెద్ద ప్రతిస్థంభన. చైనా దళాలు డొక్లాంలో రోడ్డు వేస్తుంటే భారత సైనికులు అడ్డుకున్నారు. ఆ భూభాగం భూటాన్ తమదని అంటుంటే చైనా కాదంటోంది. ఈ నేపథ్యంలో భారత్ హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చైనాతో డొక్లాం వివాదం శాంతియుతంగా పరిష్కారమవుతుందని ప్రకటిం చారు. ఆయన ప్రకటించిన మరునాడే చైనా మళ్లీ హూంకరించింది. భారత్ షరతుల్లేకుండా డొక్లాం నుంచి వైదొలగితేనే సమస్యకు పరిష్కారమని ప్రకటించిం ది. ఇప్పటికే పలుమార్లు చైనా అధికార పత్రిక గ్లోబల్ టైమ్స్ భారత్‌పై విషం కక్కింది. అయినా భారత్ కిమ్మనలేదు.

దీంతో లడాక్‌లోని ఫింగర్ ఫైవ్ ప్రాంతంలో భారత్‌లోకి చైనా దళాలు చొచ్చుకువచ్చాయి. భారత సైన్యం వీరిని తిరిగిపంపింది. అయినా, శాంతి ప్రేమికులమని చెబుతూనే చైనా భారత్‌ను మాటిమాటికీ హెచ్చరిస్తోంది.

ఇసుకపై ఏపీ నిఘా




అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుం దని ముఖ్యమంత్రిగా తానెన్నిసార్లు స్వయంగా ప్రకటించినా అనేక చోట్ల పెద్ద ఎత్తున వాణిజ్య అవసరాలకు సుదూర ప్రాం తాలకు తరలిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆయన మంగళవారం రాత్రి వెలగపూడి సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇసుక తరలిం పు విషయంలో తనకు ఫిర్యాదులు వస్తున్నా యన్నారు. ఈపరిస్థితుల్లో అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలనుకుంటున్నానని ఆయన చెప్పారు. ముఖ్యంగా తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల సరిహద్దుల్లో తనిఖీ కేంద్రాల ఏర్పాటు ఆవశ్యకమని ఆయనన్నారు. అలాగే మొబైల్ రైడింగ్ పార్టీలను నియమించి ఇసుక అక్రమ దందాలకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇసుకను డ్వాక్రా సంఘాల ద్వారా పంపిణీ చేయాలన్న విధానంలోనూ మార్పులు చేశామన్నారు. ఇసుక సరఫరా విషయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై రాష్ట్రంలో 85 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని ఆయన వెల్లడించారు.


ఏపీలో వైశ్య కార్పొరేషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో వైశ్య కార్పొ రేషన్ ఏర్పాటుకు ప్ర భుత్వం రంగం సిద్ధం చేసింది. వీలైనంత త్వరగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు సోమవారం అధికారులను ఆదేశించారు. వైశ్యుల్లో పేదవారు ఎంతో మంది ఉన్నారని వారిని అన్ని రకాలుగా ఆదుకునే బాధ్యత తాను తీసుకుంటానని సీఎం ఇటీవల నంద్యాలలో పర్యటించిన సందర్భంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. బ్రాహ్మణ కార్పొరేషన్ తరహాలోనే వైశ్య కార్పొరే షన్ ఏర్పాటు చేయాలని ఇందుకు అవసరమైన విధి విధానా లను ఖరారు చేయాలని ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్‌ను ఆదేశించారు. తొలి విడతగా ఈ కార్పొరేష న్‌కు రూ.100 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టాక కాపు, బలిజ, ఒంటరి కులాల కోసం కాపు కార్పొరేషన్, బ్రాహ్మ ణుల కోసం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను చంద్రబాబు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు, మార్గ దర్శకాలను ఖరారు చేసే బాధ్యతను చంద్రబాబు అటవీ, పర్యావరణశాఖ మంత్రి శిద్దా రాఘవరావుకు అప్పగించినట్టు సమాచారం. వైశ్యుల్లో పేదలు, నిరుపేదలు ఉన్నారని ఎంతో మంది ఉపాధి అవకాశాలు లభ్యంకాక చాలీచాలని జీతంతో పనిచేస్తు న్నారని, అటువంటి వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు తాము ప్రారంభిస్తున్న కార్పొరేషన్ ఉపయోగపడుతుందని చంద్ర బాబు భావిస్తున్నారు. విదేశీ విద్యను అభ్యసించేందుకు ఇతర దేశాలకు వెళ్ళే విద్యార్థులకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహా యాన్ని కూడా అందించాలని నిర్ణయించారు. మార్గదర్శకాలు ఖరారయ్యాక ఈ కార్పొరేషన్‌కు చైర్మన్‌తో పాటు పాలక మండలి సభ్యులను నియమించాలని సీఎం నిర్ణయించారు. రాష్ట్రంలో ఎంతమంది వైశ్యులున్నారు, వారి ఆర్థిక పరిస్థితి ఏంటి, ఏయే రంగంలో వారు స్థిరపడ్డారు, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్య చదువుతున్న వారెంతమంది, వృత్తివిద్యా కోర్సులను చదివి ఉద్యోగాల్లో స్థిర పడుతున్న వారి సంఖ్య ఎంత, తదితర వివరాలను సేకరించాలని చంద్రబాబు ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్టు తెలుస్తోంది.

భారత్, అమెరికా, ఆఫ్గాన్‌ల మధ్య త్రైపాక్షిక బంధం!

- పాక్‌పై విరుచుకుపడుతున్న ట్రంప్
- పొరుగు దేశానికి చైనా అండ
- చైనా, పాక్‌లకు వ్యతిరేకంగా భారత్, అమెరికా మైత్రి
- మధ్య ఆసియా దేశాలకు మనకు వారధి కానున్న ఆఫ్గాన్







న్యూఢిల్లీ: న్యూఢిల్లీ: దక్షిణాసియా రాజకీయాలు ఆసియాతో పాటు ప్రపంచ రాజకీయాలనూ ప్రభావితం చేయనున్నాయి. మారుతున్న పరిణామాల క్రమంలో భారత్‌పై తన అనుకూలతను మరో సారి అమెరికా ప్రదర్శిస్తే, చైనా ఎప్పటిలాగే పాక్‌కు తన మద్దతును ప్రకటించింది. మంగళవారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దక్షిణాసియాపై తన విధాన ప్రకటన చేసారు. అఫ్ఘానిస్థాన్‌లో అమెరికా ఎదుర్కొంటున్న సవాళ్లపై దృష్టి కేంద్రీకరించారు. అక్కడి ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న పాక్‌పై విరుచుకుపడ్డారు. సీమాంతరంగా ఉగ్రవాదులకు మద్దతు, ఆశ్రయం దొరకడం పట్ల ఆందోళన వ్యక్తం చేసారు. ట్రంప్ వ్యాఖ్యలతో భారత్ ఏకీభవించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ క ుమార్ ఒక ప్రకటన విడుదల చేసారు. భారత్ కూడా అఫ్ఘాన్‌కు మద్దతుగా నిలుస్తుందని ప్రకటన భరోసా ఇచ్చింది. అఫ్ఘాన్ అభివృద్ధికి, పునర్నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. అఫ్ఘాన్ నుంచి అంత తొందరగా వైదొలగాల్సిన అవసరం లేదని ట్రంప్ వ్యాఖ్యలు భారత్‌కు హర్షం కలిగించగా, పాక్‌తో పాటు చైనాకు ఆగ్రహం తెప్పించాయి. ఇక అమెరికా కోసం పాక్ యుద్ధాలు చేయనక్కర్లేదని పాక్ ప్రతిపక్షనాయకుడు తెహ్రీక్ ఈ ఇన్సాఫ్ నాయకుడు ఇమ్రాన్‌ఖాన్ అన్నారు.

అఫ్ఘాన్‌పై అమెరికా వ్యాఖ్యలను తాలిబన్ తీవ్రంగా విమర్శించింది. దళాలను ఉపసంహరించకపోతే అమెరికా సైన్యానికి అఫ్ఘానిస్థాన్ మరో శ్మశానం అవుతుందని తాలిబన్ అధికార ప్రతినిధి జాబియుల్లా ముజాహిద్ పేరిట ఒక ప్రకటన వెలువడింది. అఫ్ఘాన్‌లో పాక్‌కు బదులు భారత్ పాత్రను అమెరికా కోరుకోవడంతో పాక్‌లో సైన్యానికి, తాలిబన్లతో పాటు చైనాకూ చిర్రెత్తుకొచ్చింది. తాలిబన్ అమెరికాపై విరుచుకుపడగా, ఉగ్రవాదులకు పాక్ ఆశ్రమిస్తోందన్న అమెరికా వాదనను చైనా తీసి పారేసింది. పైగా అఫ్ఘాన్‌లో అమెరికా తన దళాల సంఖ్యను పెంచనుంది కూడా దీంతో పాక్, చైనాలకు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లైంది. తమకు కావాలసిన విధంగా ఉగ్రవాదులను అఫ్ఘాన్‌లో వాడేసి, పాక్‌లో దాచేయడం ఇక కుదరకపోవచ్చు. ఇప్పటికే అఫ్ఘాన్ మీద అమెరికా బిలియన్ల కొద్ది డాలర్లు పెట్టుబడిగా పెట్టడమే కాక, 2,400 మంది సైనికులను కోల్పోయింది. ఈ విషయాన్ని తాలిబన్ ప్రస్తావించగా, ట్రంప్ కూడా ఈ విషయాన్నే పరిగణనలోకి తీసుకున్నట్లు కనబడుతోంది. పాక్ వల్లే అమెరికాకు జననష్టమని ఆయన నమ్మినట్లు విశ్లేషకుల అంచనా. హక్కాని నెట్‌వర్క్ వల్ల అమెరికాకు ప్రమాదమని తెలిసినా, ఆ సంస్థను కట్టడి చేయడంలో, సదరు ఉగ్రవాదులను ఏరి వేయడంలో పాక్ ఏ మాత్రమూ చొరవ చూపడం లేదు. ఇలాంటి పాక్ చర్యల వల్లే అమెరికాకు నష్టం జరుగుతోందని గ్రహించిన ట్రంప్, అఫ్ఘాన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న భారత్ వైపు మళ్లారు.

భారత్ వైపు అమెరికా ఉండడంతో, ఆసియాలో పెద్దన్న పాత్రకు తహతహలాడుతున్న చైనా పాక్‌కు మద్దతు పలికింది. ఉగ్రవాదంపై పోరులోని అంచుల్లో పాక్ ఉందని చైనా ప్రకటించింది. ట్రంప్ ప్రకటన వెంటనే చైనా ఇలా స్పందించడం గమనార్హం. అరాచకాన్ని సృష్టిస్తున్న వారికి పాక్ ఆశ్రయం ఇస్తోందని ట్రంప్ అన్న మాటలు పాక్ కంటే చైనాకు ఎక్కువ కోపం తెప్పించినట్లు ఆ ప్రకటన ఉంది. దీంతో చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి హువా చున్‌యింగ్, "అమెరికా నిర్ణయం భద్రత, స్థిరత్వాలను పెంచాలి" అన్నా రు. అయితే.. పాక్‌పై ట్రంప్ వ్యాఖ్యలను మాత్రం సమర్థిం చకుండా ఉగ్రవాదంపై పాక్ పోరాటాన్ని ప్రశంసించారు. సదరు పోరాటం ద్వారా పాక్ శాంతికి, స్థిరత్వానికి మద్దతు పలుకుతోందని చెప్పారు. ట్రంప్ మాత్రం తమతో పాక్ లాభాలను పొందుతోందని, అయితే.. ఉగ్రవాదులకు మద్దతు వల్ల అంతకంటే ఎక్కువ నష్టం ఆ దేశానికి వస్తుందని హెచ్చరించారు. అమెరికా చైనాల మధ్య భాగస్వామ్యాన్ని హువా పొగిడారు. వారి మధ్య భాగస్వామ్యం ప్రపంచ శాంతికి దోహదం కావాలని ఆమె ఆకాంక్షించారు. అమెరిక న్లను లక్ష్యంగా చేసుకునే ఉగ్రవాదులకు పాక్ మద్దతివ్వడాన్ని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. చైనా దాన్ని పట్టించుకో కపోవడం గమనార్హం. చైనా ఎంత పాక్‌ను వెనకేసుకొచ్చినా, భారత్‌తో వ్యూహాత్మక సంబంధాలకే ట్రంప్ మొగ్గు చూపుతున్నారు. అమెరికా, అఫ్ఘాన్, భారత్‌ల మధ్య ప్రత్యేక త్రైపాక్షిక ఒప్పందం ఉండాలని ఇటీవలే అమెరికా సెనేట్ సాయుధ దళాల కమిటీ సిఫార్సు చేసింది కూడా. అమెరికా విధాన నిర్ణయాలపై ఈ కమిటీ ప్రభావం చాలా ఉంటుంది. అఫ్ఘాన్‌లో భారత్‌కు భాగస్వామ్యం వల్ల ఆ దేశంతో సత్సంబం ధాల విషయంలో చైనా, పాక్‌లపై పై చేయి రావడమే కాక, మధ్య ఆసియా దేశాల నుంచి క్రూడ్‌ను దిగుమతి చేసుకోవ డానికి అఫ్ఘాన్ సహకరిస్తుంది. ఇది భారత్‌కు దీర్ఘకాలంలో చాలా మేలు చేస్తుంది. అఫ్గన్‌లో ఉనికి వల్ల అల్ కాయిదా, ఐసిస్ వంటి సంస్థలను భారత్ బాగా నియంత్రించవచ్చు. పాక్, చైనాలనూ అదుపులో ఉంచొచ్చు. అఫ్ఘాన్ కుదురుగా ఉంటే పాక్‌కు లాభమేమీ ఉండదు. అందుకని అది అల్లకల్లో లమవ్వాలని పాక్ ఆలోచన. భారత్ ఆలోచన అందుకు వ్యతిరేకంగా ఉంటుంది. అఫ్ఘాన్ కుదురుగా ఉంటే అక్కడ పాక్ పోషించిన ఉగ్రవాదులు పాక్‌నే అల్లకల్లోలం చేస్తారు. దీంతో ఆ దేశం భారత్‌ను ఇబ్బంది పెట్టడం కష్టమవుతుందని విశ్లేషకుల అంచనా. మొత్తానికి ట్రంప్ విధానం, ఇక్కడ మోడీ నాయకత్వంలోని భారత్‌కు అనుకూలమవుతోంది.



జడ్జీలు వీరే...

చీఫ్ జస్టిస్ ఖేహర్ (సిక్కు): ఈ యేడాది జనవరిలో చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టిన ఖేహర్ సిక్కు మతస్థుడు. సుప్రీం న్యాయమూర్తిగా 2011 సెప్టెంబర్ 13న నియమితులయ్యారు. న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన చట్టంపై ఏర్పాటైన రాజ్యాంగ ధర్మాసనంలో ఖేహర్ సభ్యుడిగా ఉన్నారు. సహారా చీఫ్ సుబ్రతొ రాయ్‌ని జైలుకు పంపిన బెంచ్‌లోనూ ఈయన జడ్జిగా ఉన్నారు. తలాఖ్ కేసులో ముస్లిం మతాచారంలో కోర్టు జోక్యం తగదని అభిప్రాయపడ్డారు.

జస్టిస్ కురియన్ జోసెఫ్ (క్రైస్తవ): 1979లో లీగల్ కెరీర్‌ను ప్రారంభించిన ఈయన కేరళ రాష్ట్రానికి చెందిన వారు. 2000 సంవత్సరంలో కేరళ హైకోర్టులో న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2010లో హిమాచల్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు. 2013లో సుప్రీం జడ్జిగా నియమితులయ్యారు. తలాఖ్ పద్ధతిని తీవ్రంగా తప్పుబట్టారు. ఇస్లాం దేశాల్లోనే దీన్ని నిషేధించినప్పుడు భారత్‌లో ఎందుకు కొనసాగించాలని వీరు ప్రశ్నించారు. ఇది ఖురాన్‌కు వ్యతిరేకమని చెప్పారు.

జస్టిస్ లలిత్ (హిందూ): 2014లో సుప్రీం న్యాయమూర్తిగా నియమితులు కాక మునుపు క్రిమినల్ లాయర్‌గా మంచి గుర్తింపు పొందారు. 2004 ఏప్రిల్‌లో సుప్రీం సీనియర్ న్యాయవాదిగా పదోన్నతి పొందారు. 2జీ స్పెక్ట్రమ్ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా లలిత్‌ను నియమించుకోవాలంటూ సుప్రీం జడ్జి జీఎస్ సింఘ్వీ సీబీఐకి సూచించారు. తలాఖ్‌కు వ్యతిరేకంగా అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. పురుషుడి ఏకపక్ష నిర్ణయంతో మహిళ హక్కును కాలరాయడం ఆర్టికల్ 14కు విరుద్ధమని పేర్కొన్నారు.

జస్టిస్ నారిమన్ (పార్శీ): సుప్రీం న్యాయవాదిగా విశిష్ట పేరుప్రఖ్యాతులు గాంచారు. 2015లో సుప్రీం జడ్జిగా నియమితులయ్యారు. రాజ్యాంగ, కార్పొరేట్, పౌర చట్టాలపై అమితమైన విషయ పరిజ్ఞానం ఉంది. జులై 2011 నుంచి ఫిబ్రవరి 2013 వరకు భారత ప్రభుత్వ సొలిటల్ జనరల్‌గా కూడా పనిచేశారు. ఇస్లాం అనుసరిస్తున్న విడాకుల విధానానికి వ్యతిరేకంగా తీర్పునిచ్చారు.

జస్టిస్ నజీర్ (ముస్లిం): ఈ యేడాది ఫిబ్రవరిలో సుప్రీం న్యాయమూర్తిగా నియమితులయ్యారు.తలాఖ్ విచారణకు ఏర్పాటైన రాజ్యాంగ ధర్మాసనంలో నజీర్ ఏకైక ముస్లిం జడ్జి. రామజన్మభూమి-బాబ్రీ మసీదు కేసు విచారణ బెంచ్‌లోనూ నజీర్ సభ్యుడిగా ఉన్నారు.

ఇన్‌స్టంట్ తలాఖ్ అంటే ఏమిటి?



ముస్లిం వివాహ పద్ధతిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. హిందూ, క్రిస్టియన్ వివాహాల కోణంలో చూస్తే ఇది వైవిధ్యమైనది. ముస్లిం చట్టం ప్రకారం వివాహం మతవిశ్వాసానికి ప్రతీక కాదు. కేవలం పౌర కాంట్రాక్టు మాత్రమే. నిన్నటి దాకా సుప్రీం కోర్టులో వివాదాస్పదంగా ఉన్న ముస్లిం విడాకుల విధానం పేరు ఇన్‌స్టంట్ (ట్రిపుల్) తలాఖ్ లేదా తలాఖ్ ఇ బిదత్. తలాఖ్ ఉల్ సున్నత్‌కు ఇది భిన్నమైనది. తలాఖ్ ఉల్ సున్నత్ అనేది ముస్లిం వివాహ ఒప్పందాన్ని రద్దుచేయడంలో ఆదర్శరూపం. ఒకసారి భర్త తలాఖ్ చెప్పిన తర్వాత, తిరిగి అతనిలో మార్పు కోసం భార్య మూడు మాసాలు వేచిచూస్తుంది. ఈ సంధి వ్యవధిలో భార్యా భర్తల మధ్య కలయిక జరిగితే తలాఖ్ రద్దవుతుంది. ఇద్దత్ కాలం పూర్తికాకుండా తలాఖ్‌ను వర్తింపజేయడం కుదరదు. కానీ ఇన్‌స్టంట్ తలాఖ్ ఇందుకు భిన్నమైంది. ముమ్మార్ తలాఖ్ చెప్పడమే తరువాయి.. ఇస్లామిక్ పద్ధతి ప్రకారం విడాకులు తీసుకున్నట్లే. ఇందులో స్త్రీ అభిమతానికి గానీ, స్వేచ్ఛకు గానీ తావుండదు. అందుకే ఇది తమ ప్రాథమిక హక్కులకు భంగకరమంటూ పలువురు ముస్లిం మహిళలు న్యాయపోరాటం చేశారు.

తలాఖ్ చెల్లదు





- ముస్లిం మహిళల ప్రాథమిక హక్కులకు భంగం
- ఖురాన్ నియమాలకు ఇది వ్యతిరేకం
- వివాదాస్పద విడాకుల పద్ధతిపై సుప్రీం సంచలన తీర్పు
- 3:2 మెజార్టీతో రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయం
- ఆర్నెల్లలోగా చట్టం తేవాలని కేంద్రానికి ఆదేశం

న్యూఢిల్లీ: వివాదాస్పద ఇస్లామిక్ సాంప్రదాయమైన ట్రిపుల్ తలాక్‌పై సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడింది. ముమ్మారు తలాక్ రాజ్యాంగ విరుద్ధమని, ఈ పద్ధతి చెల్లదని స్పష్టం చేసింది. ఖురాన్ నియమాలకు తలాక్ వ్యతిరేకంగా ఉందని అభిప్రాయ పడిన ధర్మాసనం, దీనిపై పార్లమెంటులో ఆరు నెలల్లోగా చట్టం తేవాలని ఆదేశించింది. అంతవరకూ తలాక్‌పై నిషేధం విధిస్తున్నట్టు స్పష్టం చేసింది. ట్రిపుల్ తలాక్‌పై చీఫ్ జస్టిస్ ఖేహర్ తీర్పును చదివి వినిపించారు. ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో న్యాయమూర్తులు కురియన్ జోసఫ్ (క్రైస్తవ), లలిత్ (హిందూ), నారిమన్ (పార్శీ)లు తలాక్‌ను వ్యతిరేకించారు. ఇస్లాం దేశాల్లోనే దీన్ని నిషేధించినప్పుడు భారత్‌లో ఎందుకు కొనసాగించాలని వీరు ప్రశ్నించారు. పొరుగున ఉన్న పాకిస్తాన్‌తోపాటు, ముస్లిం సంప్రదాయాలను నిక్కచ్చిగా అమలుచేసే సౌదీ వంటి దేశాల్లో తలాఖ్‌పై నిషేధం ఉందని గుర్తుచేశారు.

చీఫ్ జస్టిస్ ఖేహర్ (సిక్కు), జస్టిస్ నజీర్ (ముస్లిం)లు మాత్రం తలాక్ అంశాన్ని పార్లమెంటుకే వదిలేస్తున్నామన్నారు. అది దశాబ్దాలనాటి ఆచారమైనందున కోర్టు జోక్యం చేసుకోలేదని అన్నారు. మెజారిటీ న్యాయమూర్తుల నిర్ణయం ప్రకారం తలాక్‌పై పార్లమెంటులో చట్టం తీసుకురావాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని అదేశిస్తూ, కేంద్రం చట్టం తెచ్చేంత వరకూ ఎలాంటి పిటిషన్లు తీసుకోబోమని స్పష్టం చేసింది. 3:2 తేడాతో కోర్టు ట్రిపుల్ తలాక్ పిటీషన్‌ను కొట్టివేసింది. ఆ పద్ధతి అక్రమమని తేల్చేసింది. ఖురాన్ అంగీకరించని అంశాలను రాజ్యాంగం పరిరక్షించలేదు అని కోర్టు పేర్కొన్నది.

ఇస్లామిక్ దేశాల్లో ట్రిపుల్ తలాక్‌ను బ్యాన్ చేశారని, మరి స్వతంత్ర భారత దేశంలో దాన్ని ఎందుకు తొలిగించలేమని కోర్టు ప్రశ్నించింది. జస్టిస్ రోహింటన్ ఫాలీ నారీమన్, జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు ప్రశ్నించారు. కాగా, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 21, 25లను తలాక్ ఉల్లంఘించినట్లు లేదని ఖేహర్ తెలిపారు. వ్యక్తిగత చట్టం ద్వారా ఆ పద్ధతి అమలులో ఉందన్నారు. ఇస్లాంలో భాగమైన సున్నీ వర్గం ప్రజలు గత వెయ్యేళ్లుగా ట్రిపుల్ తలాఖ్ విధానాన్ని అనుసరిస్తున్నారని జస్టిస్ జేఎస్ ఖేహర్ అన్నారు.

చట్టం తయారు చేసేటప్పుడు ముస్లిం సంస్థల అభిప్రాయాలు, షరియా చట్టాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోర్టు ప్రభుత్వానికి సూచించింది. ఒకవేళ ఆర్నెళ్లలో ట్రిపుల్ తలాక్‌పై చట్టాన్ని చేయలేకపోతే, నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేసింది.ఈ అంశంపై రాజకీయాలను పక్కనబెట్టి, అన్ని పార్టీలు కలిసి ఓ నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం సూచించింది.

సుదీర్ఘ విచారణ..

ట్రిపుల్ తలాక్ రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనం సుదీర్ఘంగా విచారించిన సంగతి తెలిసిందే. వివాదాస్పదంగా మారిన మూడుసార్లు తలాఖ్ చెప్పే విధానం, బహుభార్యత్వం అంశంపై ఈ ఏడాది మే 11 నుంచి ఆరు రోజులపాటు వాదనలు కొనసాగాయి. ఇది మతపరమైన హక్కా? లేదా రాజ్యాంగ బద్ధమైనదా? అన్న అంశంపైనే సుప్రీంలో వాదనలు జరిగాయి.

మే 17న ఈ విషయంలో ముస్లిం మహిళల అభిప్రాయాలను సేకరించాలని కేంద్రానికి సూచిస్తూ తుది తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్‌లో ఉంచింది. ట్రిపుల్ తలాఖ్ విధానానికి వ్యతిరేకంగా పలువురు మహిళలు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు. కేవలం భర్త మూడుసార్లు 'తలాఖ్' అన్న పదాన్ని ఉచ్చరించడం ద్వారా భార్యకు విడాకులు ఇచ్చే ఈ విధానం వల్ల తాము ఎంతో నరకయాతన అనుభవిస్తున్నామని బాధిత మహిళలు సుప్రీంకోర్టు గడప తొక్కారు.

3:2 తీర్పు



ముస్లిం సంప్రదాయమైన తక్షణ విడాకుల పద్ధతి చట్టవిరుద్ధం, పాపపు చర్య అని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో మెజార్టీ న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. త్రిపుల్ తలాఖ్ అనేది మతాచారానికి సమగ్రమైన ప్రక్రియ కాదు. ఈ విధానాన్ని అనుసరించడం రాజ్యాంగ విలువలను అతిక్రమించినట్లేనని ధర్మాసనం పేర్కొంది. మతం మాటున మహిళలకు శాపంగా పరిణమించిన తలాఖ్ పద్ధతి చట్టవిరుద్ధం అని జస్టిస్ కురియన్, జస్టిస్ రోహింగ్టన్ నారిమన్, జస్టిస్ యుయు లలిత్ అభిప్రాయపడ్డారు. త్రిపుల్ తలాఖ్ ఆమోదయోగ్య ఆచారమే కావొచ్చు.. కానీ ఇది తిరుగులేని, అసమర్థ విధానం. దీనిద్వారా వివాహ బంధాలు తరచూ తెగిపోతుంటాయి. ఇది సమానత్వ హక్కును కాలరాస్తుంది అని ముగ్గురు న్యాయమూర్తులు పేర్కొన్నారు. పవిత్ర ఖురాన్ షరియత్‌లకు వ్యతిరేకమైన పద్ధతికి రాజ్యాంగం ఎలా అనుమతిస్తుంది? అని జస్టిస్ నారిమన్ ప్రశ్నించారు. ఇలాంటి దురాచారానికి రాజ్యాంగ భద్రత లేదని జస్టిస్ జోసెఫ్ అన్నారు. కాగా, చీఫ్ జస్టిస్ ఖెహర్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లు త్రిపుల్ తలాఖ్‌ను సమర్థించారు. ఇది పాపపు ఆచారమే కావొచ్చు, కానీ వ్యక్తిగత చట్టాల్లోకి న్యాయస్థానం జోక్యం చేసుకోలేదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 21, 25లను తలాఖ్ ఉల్లంఘించినట్లు లేదు. వ్యక్తిగత చట్టం ద్వారా ఆ పద్ధతి అమలులో ఉంది. ఇస్లాంలో భాగమైన సున్నీ వర్గం ప్రజలు గత వెయ్యేళ్లుగా త్రిపుల్ తలాఖ్ విధానాన్ని అనుసరిస్తున్నారు. అయితే ఈ విధానానికి స్వస్తి పలికేలా పార్లమెంటు చట్టం తీసుకురావాలి అని జస్టిస్ జేఎస్ ఖేహర్ అన్నారు.

ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ముస్లిం మహిళలకు సమానత్వాన్ని ఇస్తోందన్నారు. మహిళా సాధికారత కోసం ఇది చాలా శక్తిమంతమైన చర్య అని మోడీ ట్వీట్ చేశారు. కాగా, ఈ చారిత్రక కేసులో ముస్లిం మహిళల

చారిత్రక తీర్పు



హక్కులను కాపాడేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం పిటీషనర్లకు అండగా నిలిచింది. సివిల్ అంశాలకు సంబంధించి వేర్వేరు మతాల మధ్య బేధాలను రూపుమాపేందుకు ఏకరీతి పౌరస్మృతిని అమలు చేయాలని గత కొంతకాలంగా బీజేపీ డిమాండ్ చేస్తున్నది. భిన్న విశ్వాసాల స్వేచ్ఛను కాపాడేందుకు హేతుబద్ధమైన చట్టాలను తీసుకురావాలన్నది బీజేపీ వాదనగా ఉంది.

ఈ ఐదుగురి పోరాట ఫలితమే...

ముమ్మారు తలాక్‌తో విడాకులు తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ ఐదుగురు బాధిత మహిళలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ ఐదుగురు మహిళల పోరాట ఫలితమే నేటి సుప్రీం తీర్పు. వీరి పోరాటానికి కేంద్రం కూడా మద్దతుగా నిలిచింది. వారే సైరాబానో, ఇష్రత్ జహాన్, ఆఫ్రీన్ రహమాన్, గుల్షన్ పర్వీన్, అతియా సబ్రీ.



సైరా బానో

ఉత్తరాఖండ్‌లోని కాశీపూర్‌కు చెందిన మధ్య తరగతి ముస్లిం కుటుంబంలో పుట్టిన సైరా బానో (35) సోషియాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. 2001లో ఆమె పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత కొన్ని రోజులకే మరింత కట్నం కావాలంటూ వేధించసాగారు. కుటుంబ సభ్యులను కలవనిచ్చేవాడు కాదు. కాలక్రమంలో మగ బిడ్డ, ఆడ బిడ్డ కలిగింది. అయినా బానో భర్తలో పెద్దగా మార్పు రాలేదు. అదనపు సంతానాన్ని పోషించలేనంటూ ఆరేడు సార్లు భార్యకు అబార్షన్ చేయించారు. చివరకు 14 ఏళ్ల తర్వాత, అంటే 2015లో బానోను పుట్టింటికి పంపించారు. ఆ తర్వాత వచ్చి ఇద్దరి పిల్లలను తన వెంట తీసుకెళ్లారు. స్పీడ్‌పోస్టులో తలాఖ్, తలాఖ్, తలాఖ్ అని రాసిన లేఖను పంపారు. ముస్లిం మత పెద్దల వద్దకు వెళ్లగా ఆ తలాఖ్ చెల్లుతుందని చెప్పారు. దాంతో బానో ఓ న్యాయపోరాటాన్ని ప్రారంభించింది.



ఇష్రత్ జహాన్

15ఏళ్ల వైవాహిక జీవితం త్రిపుల్ తలాఖ్‌తో తెగిపోయింది. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఇష్రత్ జహాన్ (31) తన భర్త ముమ్మార్ తలాఖ్ చెప్పడంతో షాక్‌కు గురైంది. దుబాయ్‌లో ఉన్న అతనితో ఫోన్‌లో కొద్దిపాటి గొడవ జరిగింది. అంతమాత్రానికే అతను తలాఖ్ చెప్పేశాడు. కొంతకాలం తర్వాత తిరిగి గ్రామానికి వచ్చిన తర్వాత వేరొక వివాహం చేసుకున్నాడు. ఇష్రత్ వద్ద ఉన్న ఇద్దరు పిల్లలను తనతో తీసుకెళ్లాడు. ఇష్రత్‌కు ఆర్థిక సహాయం అందివ్వలేదు. దీంతో ఆమెకు సోదరి అండగా నిలిచింది. చివరకు ఈమె న్యాయం కోసం సుప్రీంను ఆశ్రయించింది.



ఆఫ్రీన్ రహమాన్

జైపూర్‌కు చెందిన ఎంబీఏ గ్రాడ్యుయేషన్ ఆఫ్రీన్ (28) 2014లో ఇండోర్‌కు చెందిన న్యాయవాదిని పెళ్లి చేసుకున్నారు. ఆమె సోదరులు 25 లక్షల రూపాయల లోన్ తీసుకొని ఆమె పెళ్లి చేశారు. కొన్ని రోజుల నుంచే కుటుంబంలో కలహాలు వచ్చాయి. ఏడాది కాగానే ఆఫ్రీన్‌ను పుట్టింటికి పంపించి వేసిన భర్త స్పీడ్ పోస్ట్‌లో ట్రిపుల్ తలాఖ్‌ను పంపించారు. అప్పటికే బానో కేసు సుప్రీం విచారణలో ఉండడంతో ఆఫ్రీన్ కూడా సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు.



గుల్షన్ పర్వీన్..

ఉత్తరప్రదేశ్‌కు చెందిన గుల్షన్ పర్వీన్ అనే 30 ఏళ్ల మహిళకు 2013లో వివాహం జరిగింది. ఆమెకు ఓ బిడ్డ కూడా ఉన్నాడు. భర్త ఆమెను అదనపు కట్నం కోసం వేధించడంతో పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో 2015లో గుల్షన్ భర్త తలాక్ ద్వారా విడాకులు ఇస్తున్నట్లు రూ.10 స్టాంప్ పేపర్‌పై రాసి పంపాడు.

అతియా సబ్రీ



ఉత్తరప్రదేశ్‌కు చెందిన అతియా సబ్రీ అనే 30 ఏళ్ల మహిళకు 2012లో వివాహమై ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఆమె భర్త అదనపు కట్నం కింద రూ.25 లక్షలు తేవాలని డిమాండ్ చేస్తున్నట్లు 2015 డిసెంబరు 12 న ఆమె షహారన్‌పూర్ మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అడిగినంత ధనం తీసుకురాలేదని శారీరకంగానూ వేధించినట్లు ఫిర్యాదులో తెలిపింది. దీంతో భర్త ఓ పేపర్‌పై మూడుసార్లు తలాక్ రాసి విడాకలు తీసుకున్నట్లు తెలిపాడు.

32 ఏళ్ల కిందట భర్త నిర్లక్ష్యానికి గురైన ఓ ముస్లిం మహిళకు అనుకూలంగా సుప్రీం తీర్పు చెప్పింది. అయితే నాటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఆ ఆదేశాల అమలును తోసిపుచ్చింది. దశాబ్దాల పాటు కాపురం చేసిన భర్త, మరో యువతిని వివాహం చేసుకుని తనను రోడ్డున పడేయడంపై షా బానో (62) న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఐదుగురు సంతానంతో మనుగడ సాగించేందుకు ఆమెకు భరణం చెల్లించాలని 1985లో సుప్రీం కోర్టు ఆదేశించింది. దీనిపై ముస్లిం మహిళా బిల్లును తీసుకురావాలని ఆనాటి రాజీవ్ ప్రభుత్వానికి ధర్మాసనం సూచించింది. అయితే, రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా రాజీవ్‌ను తప్పుదారి పట్టించిన కొందరు ఈ బిల్లును అణచివేశారు. ఆ తర్వాత మరే గాంధీ కూడా తిరిగి ప్రధానిగా బాధ్యతలు చేపట్టలేదు. అంతటితో ముస్లిం మహిళా బిల్లు అటకెక్కింది. తాజాగా ఉత్తరాఖండ్‌కు చెందిన సైరా బానోతో పాటు మరో నలుగురు మహిళలు ముమ్మారు తలాఖ్‌పై చేసిన న్యాయపోరాటం ఫలించింది. సుప్రీం వారికి అనుకూలంగా తీర్పు చెప్పింది. తలాఖ్ నిషేధంపై చట్టం చేయాలని కేంద్రానికి సూచించింది. ఈసారి అధికారంలో ఉన్న ప్రభుత్వం కోర్టు ఆదేశాలను పాటించేందుకు సంసిద్ధంగా ఉండటం కొసమెరుపు.


షాబానో నుంచి సైరాబానో దాకా...



'ముస్లిం మహిళలకు పండుగ'

ట్రిపుల్ తలాక్ చెల్లుబాటు కాదంటూ సుప్రీంకోర్టు మంగళవారంనాడు ఇచ్చిన తీర్పుపై సైరా బానో హర్షం వ్యక్తం చేశారు. తీర్పును స్వాగతిస్తున్నామని, ఇది దేశంలోని ముస్లిం మహిళలు ఎంతో ఆనందించే రోజని అన్నారు. 'అనేక మంది రద్దు కావాలన్నారు. వద్దన్న వారూ ఉన్నారు. ముస్లిం సమాజంలో చట్టం తేవడానికి వారు ఇష్టపడరు. ఈ అంశాలన్నింటినీ సుప్రీంకోర్టు అర్థం చేసుకుని ఈ చారిత్రక తీర్పు ఇచ్చింది' అని సైరాబానో తెలిపారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో ముస్లిం మహిళల స్థితగతులు మెరుగుపడతాయని అన్నారు. సుప్రీంతీర్పును ఎవరూ దయచేసి రాజకీయం చేయవద్దని, రాజకీయ ఎజెండాగా తీసుకోవద్దని కోరారు.

'పీడ' వదిలింది: సోలీ సొరాబ్జీ



తలాక్ రాజ్యాంగవిరుద్ధమని, చెల్లనేరదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రముఖ న్యాయకోవిదుడు, భారత మాజీ అటార్నీ జనరల్ సోలి సొరాబ్జీ స్వాగతించారు. ఇది ప్రగతిశీలక తీర్పు అని ప్రశంసించారు. ముస్లిం మహిళలకు ఏకపక్షంగా, వివక్షా పూరితంగా ఇస్తున్న విడాకుల బెడదకు సుప్రీం ధర్మాసనం తీర్పుతో చరమగీతం పాడిందని అన్నారు. ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును తూచా తప్పకుండా అమలు చేయాలని సూచించారు. 'ఇది చాలా మంచి తీర్పు. ముస్లిం మహిళలకున్న సమానత్వం, గౌరవ హక్కును కోర్టు విస్పష్టంగా చాటిచెప్పింది. ఇది కచ్చితంగా ప్రగతిశీల తీర్పు. దీనిని యథాతథంగా అమలు చేయాలి' అని సోలీ సొరాబ్జీ ప్రశంసించారు.

భవిష్యత్ కార్యాచరణపై ముస్లిం లా బోర్డు కసరత్తు



ట్రిపుల్ తలాఖ్ రాజ్యాంగ విరుద్ధమని, చెల్లనేరదని, ఆరు నెలల్లోగా చట్టం తీసుకురావాలని సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశిస్తూ తీర్పునివ్వడంతో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపీఎల్‌బీ) సెప్టెంబర్ 10న భోపాల్‌లో సమావేశం కానుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో ఎఐఎంపీఎల్‌బీ చర్చించనుంది. బోర్డ్ వర్కింగ్ కమిటీ సభ్యుడు జాఫర్‌యాబ్ జిలానీ తెలిపారు. సమావేశంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును సమగ్రంగా అధ్యయనం చేసి భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటామని చెప్పారు. పలు అంశాలతో పాటు తలాక్‌పై సుప్రీం తీర్పు కూడా కీలకాంశం కానుందని సీనియర్ న్యాయవాది కూడా అయిన జిలానీ తెలిపారు. భోపాల్ మీటింగ్ ఎజెండాలో బాబ్రీ మసీదుపై విచారణ కేసు కూడా ఒకటని చెప్పారు. తలాక్‌పై సుప్రీం తీర్పుపై ఎలాంటి కార్యాచరణ చేపట్టాలని అనుకుంటున్నారని అడిగినప్పుడు తీర్పును అధ్యయనం చేయకుండా ఇప్పుడే ఏమీ మాట్లాడలేమని ఆయన సమాధానమిచ్చారు.

ఎవరేమన్నారంటే

ప్రగతిశీలక తీర్పు: కాంగ్రెస్



ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అభినందనీయమని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. మనీష్ తివారీ మాట్లాడుతూ ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన మెజారిటీ తీర్పు ప్రగతిశీలకమని తెలిపారు. సరైన రీతిలో ఆలోచించగలిగేవారంతా దీనిని స్వాగతించాలన్నారు. అంటరానితనాన్ని నిషేధించడంతో ఈ తీర్పును పోల్చారు.

➥ సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం. ఇస్లామిక్ మత సంప్రదాయమైన త్రిపుల్ తలాఖ్‌పై నిషేధంతో ముస్లిం మహిళలకు సమాన హక్కులు లభిస్తాయి

- ఆలిండియా ముస్లిం ఉమెన్ పర్సనల్ లా బోర్డు అధ్యక్షురాలు

➥ కేంద్ర ప్రభుత్వం దీనిపై త్వరగా చట్టం తీసుకురావాలి. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం **- మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్**

➥ ఇది మంచి తీర్పు. లింగ సమానత్వంలో ఇదొక ముందడుగు.

- మేనకా గాంధీ

➥ తలాఖ్‌పై మొదటి నుంచి పోరాటం చేస్తున్న షియా పర్సనల్ లా బోర్డు తాజా తీర్పుపై హర్షం వ్యక్తంచేసింది. ఇదొక చారిత్రక అధ్యాయం

- మౌలానా యాసూబ్ అబ్బాస్

➥ తీర్పును మేం ప్రశంసిస్తున్నాం. వ్యక్తిగత చట్టాలను ఇది రక్షణకల్పిస్తుంది. అదే సమయంలో త్రిపుల్ తలాఖ్ అమలును ధర్మాసనం వ్యతిరేకించింది

- కపిల్ సిబల్

➥ సుప్రీం తీర్పు విశిష్టమైనది. ఈ నిర్ణయంలో సానుకూల దృక్పథం ఉంది. ఇస్లాంకు వ్యతిరేకంగా విడాకులకు ముస్లింలు అనుసరిస్తున్న విధానానికి ముగింపు పలికింది. మద్యం మత్తులో తలాఖ్ చెప్పడం వంటి పరిణామాలు సరైనవి కావు

- మౌలానా అహ్మద్ బర్కతి (కోల్‌కతా మసీదు ఇమామ్)

➥ ఆ ఐదుగురు మహిళల సాహసోపేత పోరాటానికి లభించిన గౌరవం

- షబానా అజ్మీ

➥ ముస్లిం లాబోర్డు తీర్పును అమలు చేస్తుందా? లేదా అన్న విషయాన్ని పక్కనబెడితే..ఇది మంచి నిర్ణయమని చెప్పగలను

- మాయావతి (బీఎస్పీ)

➥ సర్వోన్నత ధర్మాసనం నిర్ణయంపై నేను ఏమీ వ్యాఖ్యానించలేను. కానీ పశ్చిమబెంగాల్ మంత్రి సిద్ధిఖుల్లా చౌదరి మాత్రం సుప్రీం తీర్పును విమర్శించారు. మా పార్టీ వైఖరి ఏమిటో నాకు తెలీదు. కానీ, ఈ పద్ధతి కొన్ని తరాలుగా అమలులో ఉన్నది. దీనిపై న్యాయస్థానాలు జోక్యం చేసుకోజాలవు

- సిద్ధిఖుల్లా

➥ తలాఖ్‌పై సరైన వాదనలు వినిపించడంలో ఆలిండియా పర్సనల్ లా బోర్డు విఫలమైంది. దరిమిలా విడాకుల పద్ధతిని కోర్టు తప్పుగా అర్థం చేసుకున్నది

- ఢిల్లీ జామా మసీదు ఇమామ్

తీర్పును గౌరవిస్తాం



ముస్లిం మహిళల విషయంలో ట్రిపుల్ తలాఖ్‌పై సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తామని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. అయితే సుప్రీం తీర్పును క్షేత్రస్థాయిలో అమలు చేయడం సాధ్యం కాదని ఆయన చెప్పారు. ట్రిపుల్ తలాఖ్ రాజ్యాంగ బద్ధం కాదని కోర్టు అభిప్రాయపడిందన్నారు. ఈ అభిప్రాయం కేవలం తమ పార్టీది మాత్రమేనని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డుది కాదని ఆయన స్పష్టం చేశారు.



విరాట్ విహారయాత్ర

దంబుల్లా: తొలి వన్డేలో శ్రీలంకను చిత్తు చేసిన తర్వాత సోమవారం భారత క్రికెట్ జట్టుకు ఆటవిడుపు లభించింది. ఈ విరామాన్ని కెప్టెన్ విరాట్ కోహ్లి చక్కగా ఉపయోగించుకున్నాడు. మూడు రోజుల క్రితం స్నేహితురాలు అనుష్కతో కలిసి మొక్కను నాటి నీళ్లు పోసిన విరాట్.. ఈ సారి విహార యాత్రలో వన్య మృగాలను చూడ్డానికి వెళ్లాడు. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టాడు. అమాయకమైన గజరాజులను చూస్తుంటే హాయి కలుగుతోందని ట్వీట్ చేశాడు. ప్రత్యేకించి లయన్ రాక్‌ను చూశానన్నాడు. ''ఈసారి లంకంతా చూస్తున్నాను. ప్రతిసారి పర్యటనల మధ్యలో విరామం ఉండేది కాదు. కానీ కావలసినంత తీరిక దొరికింది. దంబుల్లాలో పెద్దగా తిరగలేదు. మళ్లీ వచ్చినపుడు ముందుగానే ప్రణాళిక వేసుకుంటా'' అని కోహ్లి చెప్పాడు. కోహ్లి స్నేహితురాలు అనుష్క కూడా ఇలాంటి ఫొటోనే సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.



ప్రి క్వార్టర్స్‌లో సింధు

● రెండో రౌండ్లో సునాయాస విజయం ● సాయి ప్రణీత్, అజయ్ శుభారంభం ● సిక్కి రెడ్డి, ప్రణవ్ జోడీ గెలుపు



సైనా నెహ్వాల్ బుధవారం తన పోరును ఆరంభిస్తుంది. ఆమె... సబ్రినా జాక్వెట్‌తో తలపడుతుంది.

సాయి ప్రణీత్

అజయ్

న్యూఢిల్లీ: తెలుగు తేజం పీవీ సింధు.. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ప్రి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకుపోయింది. పురుషుల సింగిల్స్‌లో సాయిప్రణీత్, అజయ్ జయరామ్... మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి, ప్రణవ్ జోడీ శుభారంభం చేశారు. మంగళవారం స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్ పోరులో నాలుగో సీడ్ సింధు 21-16, 21-14 తేడాతో కొరియా షట్లర్ కిమ్ హో మిన్‌పై విజయం సాధించింది. సింధు కేవలం 49 నిమిషాల్లోనే ప్రత్యర్థిని మట్టికరిపించింది. పోరు ఆరంభం నుంచి సింధు దూకుడును ప్రదర్శించింది. తొలి గేమ్‌లో వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించింది. ఐతే కిమ్ తర్వాత రెండు వరుస పాయింట్లు గెలుచుకొని సింధు జోరుకు కాస్త బ్రేకు వేయగలిగింది. తర్వాత సింధు 11-5 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. కిమ్ హోరాహోరీగా పోరాడినప్పటికీ సింధు పట్టు సడలించకుండా ఆధిక్యాన్ని కొనసాగించింది. మొదటి గేమ్‌ను 21-16తో గెలుచుకుంది. రెండో గేమ్‌లో కిమ్ 3-7తో వెనుకబడినా పోరాడి ఆధిక్యంలో అంతరాన్ని రెండు పాయింట్లకు తగ్గించింది. కానీ సింధు 11-8 వద్ద బ్రేక్ తీసుకుంది. తర్వాత నిదానంగా ఆధిక్యాన్ని 17-11కు తీసుకుపోయింది. అదే జోరును కొనసాగిస్తూ గేమ్‌ను 21-14తో గెలుచుకొని మ్యాచ్‌ను వశం చేసుకుంది. సింధు కు తొలి రౌండ్లో బై లభించిన సంగతి తెలిసిందే.

సాయి ప్రణీత్, అజయ్ బోణీ: సింగపూర్ ఓపెన్ విజేత సాయి ప్రణీత్ శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో 21-18, 21-17తో హాంకాంగ్ షట్లర్ వీ నాన్‌ను వరుస గేమ్‌లలో ఓడించాడు. 15వ సీడ్ ప్రణీత్‌కు తొలి రౌండ్లో వీ నాన్ చెప్పుకోదగ్గ ప్రతిఘటన ఎదురైంది. రెండు గేమ్‌లలోనూ విరామ సమయానికి ప్రణీత్ 9-11తో వెనుకబడ్డాడు. 15వ సీడ్ సాయి 48 నిమిషాల పాటు సాగిన పోరులో చివరకు వీ పై విజయం సాధించాడు. మరో సింగిల్స్ పోరులో అజయ్ జయరామ్ 21-14, 21-12తో ఆస్ట్రేలియా షట్లర్ లుకా వ్రెబర్‌పై సునాయాసంగా గెలిచి రెండోరౌండ్లో అడుగుపెట్టాడు.

సిక్కిరెడ్డి, ప్రణవ్ జోడీ ప్రిక్వార్టర్స్‌కు: మిక్స్‌డ్ డబుల్స్ 15వ సీడ్ ప్రణవ్ జెరీ చోప్రా, ఎన్ సిక్కి రెడ్డి 21-12, 21-19 తేడాతో ప్రజక్త సావంత్ (భారత్), యోగేంద్రన్ కృష్ణన్ (మలేసియా) జోడీని ఓడించి ప్రి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో అశ్విని పొన్నప్ప, సిక్కిరెడ్డి 21-15, 21-13తో రిరిన్ అమెలియా (ఇండోనేషియా), చింగ్ యిక్ (మలేసియా)పై గెలిచారు. ఐతే మిక్స్‌డ్ డబుల్ జోడీలు సుమీత్ రెడ్డి, అశ్విని పొన్నప్ప... సాత్విక్ సాయిరాజ్, మనీషాలకు పరాజయాలు ఎదురయ్యాయి. సుమీత్, అశ్విని పోరాడి 17-21, 21-18, 5-21తో 13వ సీడ్ చైనా జోడీ వాంగ్ యిల్యు, హువాంగ్ డాంగ్‌పింగ్ చేతిలో ఓడారు. సాయిరాజ్, మనీషాలు 20-22, 18-21 తేడాతో డెన్మార్క్‌కు చెందిన 14వ సీడ్ జోడీ మథియాస్ క్రిస్టియన్‌సేన్, సారా థిగెసెన్ చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ రెడ్డి, చిరాగ్ షెట్టి జోడీ 8-21, 12-21 తేడాతో జపాన్‌కు చెందిన హిరోయుకి ఎండో, యుతా వాతంబే చేతిలో ఓడింది.

'డాన్' మొదలెట్టేశాడు

గ్లాస్గో: చైనా ప్రముఖ షట్లర్ లిన్‌డాన్.. ప్రపంచ బ్యాడింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆరో స్వర్ణ పతకం కోసం వేట మొదలు పెట్టాడు. తొలి రౌండ్లో ఏడో సీడ్ డాన్ సోమవారం స్కాంట్లాండ్‌కు చెందిన కీరన్ మెరీలీస్‌ను 21-15, 21-10తో సునాయాసంగా ఓడించి స్థానిక అభిమానుల ఆశల్ని నీరుగార్చాడు. ఐతే టాప్ సీడ్ సోన్ వాన్ హో 21-14, 21-16తో ఫిన్లాండ్ షట్లర్ కలే కొల్జొనెన్‌పై చమటోడ్చి గెలిచాడు. తదుపరి రౌండ్లో లిన్.. డెన్మార్క్‌కు చెందిన ఎమిల్‌తో తలపడతాడు. ''సాధారణంగా నా తొలి పోరు తేలిగ్గా ఉండబోదు. గాడిలో పడేందుకు నేను కొంత సమయం తీసుకుంటా'' అని లిన్ అన్నాడు.

'రాజీవ్ ఖేల్‌రత్న' జఝారియా, సర్దార్

● సురేఖ, సాకేత్, పుజారాకు 'అర్జున' ● మరో 14 మందికి కూడా

న్యూఢిల్లీ: పారా అథ్లెట్ దేవేంద్ర జఝారియా, భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్‌లకు అత్యున్నత క్రీడాపురస్కారం 'రాజీవ్ ఖేల్‌రత్న' ఖరారైంది. 2017 సంవత్సరానికి అవార్డుల కమిటీ సిఫా ర్సుల మేరకు ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ అవార్డు విజేతలను కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటించింది. తెలుగు ఆర్చర్ వీజే సురేఖ, టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేనితో సహా 17మందికి అర్జున అవార్డు ఖరారైంది. ఏడుగురికి ద్రోణాచార్య, ముగ్గురికి ధ్యాన్‌చంద్ పురస్కారం ప్రకటించారు. అర్జున దక్కించుకున్న వారిలో క్రికెటర్ చటేశ్వర్ పుజారా, ఇటీవలి ప్రపంచకప్‌లో సత్తా చాటిన మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా ఉన్నారు. ఈ నెల 29న రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో విజేతలకు రాష్ట్రపతి అవార్డులను అందజేస్తారు. ఖేల్‌రత్న అవార్డు గ్రహీతలు మెడల్, ప్రశంసా పత్రంతో పాటు రూ.7.5 లక్షలు నగదు అందుకుంటారు. అర్జున, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ విజేతలు జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో పాటు రూ.5 లక్షలు అందుకుంటారు.



తొలి పారాలింపియన్

ఖేల్‌రత్న అవార్డుకు ఓ పారాలింపియన్ ఎంపిక కావడం ఇదే తొలిసారి. జావెలిన్ త్రోయర్ జఝారియా రెండు పారాలింపిక్ పసిడి పతకాలను గెలిచిన తొలి భారతీయుడు. రిటైర్డ్ జస్టిస్ సీకే ఠాకూర్ నేతృత్వంలోని అవార్డుల కమిటీ.. ఖేల్‌రత్నకు మొదటి ప్రాధాన్యతగా జఝారియాను సిఫార్సు చేసింది. రెండో ప్రాధాన్యతగా మిడ్‌ఫీల్డర్ 31 ఏళ్ల సర్దార్ సింగ్‌ను ఎంపిక చేసింది. ఐతే వీరిద్దరికీ సంయుక్తంగా అత్యున్నత పురస్కారం ఇవ్వాలని కమిటీ సిఫార్సు చేసింది. 2015లో పద్మశ్రీ అవార్డు దక్కించుకున్న సర్దార్ సింగ్ రెండు ఆసియా క్రీడల పతకాలు సాధించాడు. 2010లో గాంగ్‌ఝౌ, 2014లో ఇంచియాన్ ఆసియా క్రీడల్లో జట్టుకు పతకాలు సాధించిపెట్టాడు. సర్దార్ ఖాతాలో ఓ కామన్వెల్త్ రజతం కూడా ఉంది. రెండు సార్లు (2010, 2011) అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఆల్‌స్టార్ జట్టులో కూడా చోటు సంపాదించాడు.

విజేతలు వీరే

రాజీవ్ ఖేల్‌రత్న: దేవేంద్ర జఝారియా (పారా అథ్లెట్), సర్దార్ సింగ్ (హాకీ)

ద్రోణాచార్య: స్వర్గీయ ఆర్. గాంధీ (అథ్లెట్), హీరానంద్ కటారియా (కబడ్డీ), జీఎస్ఎస్‌వీ ప్రసాద్ (బ్యాడ్మింటన్-జీవనసాఫల్య పురస్కారం), బ్రిజ్ భూషణ్ మొహంతి (బాక్సింగ్-జీవనసాఫల్య పురస్కారం), పీఏ రాఫెల్ (హాకీ - జీవనసాఫల్య పురస్కారం), సంజయ్ చక్రవర్తి (షూటింగ్ -జీవనసాఫల్య పురస్కారం), రోషన్‌లాల్ (రెజ్లింగ్ - జీవనసాఫల్య పురస్కారం).

అర్జున: వీజే సురేఖ (ఆర్చరీ), ఖుష్‌బీర్ కౌర్ (అథ్లెటిక్స్), అరోకియా రాజీవ్ (అథ్లెటిక్స్), ప్రశాంతి సింగ్ (బాస్కెట్‌బాల్), లైష్‌రామ్ దేవేంద్రో సింగ్ (బాక్సింగ్), చటేశ్వర్ పుజారా (క్రికెట్), హర్మన్‌ప్రీత్ కౌర్ (క్రికెట్), ఓయినమ్ బెంబెమ్‌దేవి (ఫుట్‌బాల్), ఎస్ఎస్‌పీ చౌరాసియా (గోల్ఫ్), ఎస్‌వీ సునీల్ (హాకీ), జస్వీర్ సింగ్ (కబడ్డీ), పీఎన్ ప్రకాశ్ (షూటింగ్), ఎ.అమల్‌రాజ్ (టేబుల్ టెన్నిస్), సాకేత్ మైనేని (టెన్నిస్), సత్యవ్రత్ కదియన్ (రెజ్లింగ్), మరియప్పన్ (పారా అథ్లెట్), వరుణ్ సింగ్ భాటి (పారా అథ్లెట్).

ధ్యాన్‌చంద్: భుపేందర్ సింగ్ (అథ్లెటిక్స్), సయ్యద్ షాహిద్ హకీం (ఫుట్‌బాల్), సుమరాయ్ టెటె (హాకీ).



జ్యోతి సురేఖ

విజయవాడకు చెందిన 21 ఏళ్ల జ్యోతి సురేఖ.. 2015లో బాంకాక్‌లో జరిగిన ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించింది. 2011లో ఇరాన్‌లోని టెహ్రాన్‌లో జరిగిన ఇదే ఛాంపియన్‌షిప్‌లో కాంపౌండ్ జట్టు విభాగంలో కాంస్యం గెలిచిన సురేఖ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 12వ స్థానాన్ని దక్కించుకుంది. 2013లో చైనాలో జరిగిన ప్రపంచ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో కాంపౌండ్ జూనియర్ మహిళల జట్టు విభాగంలో కాంస్యం వశం చేసుకుంది.

సాకేత్ మైనేని



డేవిస్ కప్ ఆటగాడు హైదరాబాదీ సాకేత్ మైనేని.. 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో సానియా మీర్జాతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం, పురుషుల డబుల్స్‌లో రజత పతకం గెలుచుకున్నాడు. ప్రొఫెషనల్ కెరీర్‌లో 9 ఐటీఎఫ్ టైటిల్స్, రెండు ఏటీపీ సింగిల్స్ టైటిళ్లు కైవసంచేసుకున్నాడు. 2014లో డేవిస్‌కప్‌లో ప్రవేశించాడు.


భారత మహిళలకు నా అర్జున అంకితం: బెంబెమ్ దేవి



న్యూఢిల్లీ: తనకు అర్జున అవార్డు దక్కడం పట్ల బెంబెమ్ దేవి అమితానందం వ్యక్తంచేసింది. ''ఇవి నాకు మధుర క్షణాలు. మాటల్లో వర్ణించలేని ఆనందం కలిగింది. ఎన్నో ఆటుపోట్లను అధిగమించిన దేశ మహిళలకు ఈ అవార్డును అంకితమిస్తున్నా'' అని బెంబెమ్ దేవి చెప్పింది.

ఎదురులేని గుజరాత్

● 35-21తో పుణెరీ చిత్తు ● యోధాపై బెంగాల్ గెలుపు



ఫజల్

లక్నో: ప్రొ కబడ్డీ లీగ్ పోరులో తనకు ఎదురులేదని గుజరాత్ ఫార్చ్యూన్ జయంట్స్ మరోసారి రుజువు చేసింది. మంగళవారం ఏ గ్రూప్‌లో మరో అగ్ర జట్టు పుణెరీ పల్టాన్‌ను 35-21 తేడాతో గుజరాత్ చిత్తుగా ఓడించింది. ఫజల్ అత్రాచలీ గాయంతోనూ తిరుగులేని ప్రదర్శన చేశాడు. 9 టేకిల్ పాయింట్లు సాధించి జట్టుకు ఘన విజయాన్ని కట్టబెట్టాడు. సచిన్ తొలి నిమిషంలోనే గుజరాత్ ఖాతాను తెరిచాడు. ఆరంభంలో హోరాహోరీగా పోరు సాగడంతో రెండు జట్లకు పాయింట్లు సాధించడం కష్టమైంది. ఏడో నిమిషంలో గుజరాత్ ఏకంగా 11 పాయింట్లు సాధించి 16-5 ఆధిక్యంలోకి దూసుకుపోయింది.

ఫజల్ నేతృత్వంలో గుజరాత్ డిఫెన్స్‌కు ఎదురులేకుండా పోయింది. పుణెరికీ వారు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా గోడలా నిలబడ్డారు. సుకేష్ హెగ్డే ఆ దశలో గుజరాత్‌కు మరో రెండు పాయింట్లు సాధించి ఆధిక్యాన్ని 16-7 పాయింట్లకు పెంచాడు. గుజరాత్ రెండో అర్ధం ఆరంభంలో 18-10 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. గుజరాత్ క్రమేపీ స్కోరు పెంచుకుంటూపోయింది. మ్యాచ్‌పై ఆ జట్టు పట్టు బిగించడంతో పుణేరికి పాయింట్లు సాధించడం గగనమైపోయింది. మ్యాచ్ మరో 5 నిమిషాల్లో ముగుస్తుందనగా ఫజల్ 5 పాయింట్లు సాధించి గుజరాత్‌కు తిరుగులేని ఆధిక్యం సాధించిపెట్టాడు. దీంతో గుజరాత్ 25-18 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. తర్వాత చెరో రెండు పాయింట్లు సాధించాయి. చివరకు గుజరాత్ 35-21 తేడాతో గెలిచింది.

గుజరాత్ 10 మ్యాచ్‌లలో 41 పాయింట్లతో జోన్ ఏలో అగ్రస్థానాన్ని ఆక్రమించింది. సీజన్‌లో రెండు ఓటములతో 21 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. మరో పోరులో బెంగాల్ వారియర్స్ 32-31 స్వల్ప తేడాతో యూపీ యోధాపై గెలిచింది.



భారత్ ఏ గెలుపు

పోట్చెఫ్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): కెప్టెన్ కరుణ్ నాయర్ (90), ఓపెనర్ సమర్థ్ (55) రాణించడంతో రెండో అనధికార టెస్టులో భారత్ ఏ 6 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా ఏపై గెలిచింది. 224 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ నాలుగో రోజు మంగళవారం 62.3 ఓవర్లలో 4 వికెట్లకు 226 పరుగులు చేసి గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఏ 276 పరుగులు చేసి దక్షిణాఫ్రికా (322)కు 46 పరుగుల ఆధిక్యాన్ని ఇచ్చుకుంది. ఐతే రెండో ఇన్నింగ్స్‌లో రాజ్‌పుట్ (3-15), నదీమ్ (3-47) విజృంభించడంతో దక్షిణాఫ్రికా 177 పరుగులకే ఆలౌట్ అయింది. సమర్థ్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. రెండు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో డ్రాగా ముగిసింది.

స్టార్టప్స్ కోసం ఆగస్టు ఫెస్ట్

- జయేష్ రంజన్



ఆగస్టు ఫెస్ట్ సెలబ్రిటీ స్పోర్ట్స్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న జయేష్‌రంజన్, జ్వాలగుత్తా తదితరులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్టార్టప్‌ల ఏర్పాటు, మార్కెటింగ్, నెట్‌వర్క్ వ్యవస్థలపై అవగాహన కల్పించేందుకు ఆగస్టు ఫెస్ట్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ఐటిశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ చెప్పారు. ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించే ఈ ఫెస్ట్‌లో విదేశీ నిపుణులు తమ అనుభవాలు వెల్లడిస్తూ స్టార్టప్స్‌పై సందేహాలను నివృత్తి చేస్తారని ఆయన చెప్పారు. ఈ ఆగస్టు ఫెస్ట్ రెండు ఫార్మాట్‌లలో నిర్వహిస్తున్నామని, ఇందులో స్కేల్ ఆఫ్ ఫెస్టివల్, స్పోర్ట్స్ కార్నివాల్ ఉంటాయని మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ప్రముఖ బ్యాట్మింటన్ క్రీడాకారిణి జ్వాలా గుత్తా, ఆగస్టు ఫెస్ట్ చీఫ్ ఆఫ్ ఇన్నోవేషన్ ఆది వేమూరు, కార్నివాల్ ఫౌండర్ కార్తీక్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ, ఇటీవల ముంబైలో ఈ ఫెస్ట్ నిర్వహించారని, క్రీడారంగంలో ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల కాలంలో లీగ్ మ్యాచెస్ ప్రాచుర్యం పొందాయని, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ విస్తృతమయ్యాయని అన్నారు. క్రికెట్‌కు సంబంధించి యాప్ ప్రాజెక్టు తయారవుతోందని, ఫిట్‌నెస్‌పై ఇటి వద్దనుంచే ఎలా చేయాలన్న దానిపై కూడా మరో యాప్‌ను డిజైన్ చేస్తున్నారని ఆయన చెప్పారు. స్టార్టప్స్‌పై ఎదిగేందుకు ఎన్నో అడ్డంకులు ఉన్నాయని, ఖాతాదారులను 20 నుంచి 100, ఆ తర్వాత 500లకు ఎలా పెంచుకోవాలన్న దానిపై ఈ ఫెస్ట్‌లో నిపుణులు వివరిస్తారని జయేష్ చెప్పారు.

హైదరాబాద్‌లో 2500లకు పైగా స్టార్టప్స్ ఉన్నాయని, అయితే హైదరాబాద్‌కు ఫండింగ్ ఆశించిన మేర రావడం లేదని ఆయన చెప్పారు. ఎక్కువ సంఖ్యలో స్టార్టప్స్ ఉన్న నగరాలకే ఫండింగ్ సంస్థల నిపుణులు వచ్చి పరిస్థితులను పరిశీలించి ఫండింగ్‌కు సిఫారసు చేస్తారని ఆయన చెప్పారు. అలాగే అక్టోబర్ చివరి వారంలో హైదరాబాద్‌లో ఇన్వెస్టర్స్ మీట్ నిర్వహిస్తున్నామని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేవారికి భరోసా కల్పించేందుకు ఈ మీట్ దోహద పడనుందని జయేష్ రంజన్ అన్నారు.

12వేల మంది ఔత్సాహికులతో ఫెస్ట్ : ఆది

ఈ ఫెస్ట్‌లో దాదాపు 12వేల మంది పాల్గొంటారని ఆది వేమూరు చెప్పారు. యువ ఔత్సాహికులు, స్టార్టప్స్ కమ్యూనిటీలు ఇప్పటికే 10వేల వరకు పేర్లు నమోదు చేసుకున్నాయని ఆయన తెలిపారు. ఇందులో 300 మంది ఇన్వెస్టర్లు, 150 మంది వక్తలు పాల్గొంటారని, తెలంగాణ ప్రభుత్వం, ఐఎస్‌బి, స్మార్ట్ సెన్స్ డిజిటల్‌తో మరికొన్ని కమ్యూనిటీలు ఆగస్టు ఫెస్ట్‌కు మద్దతు ఇస్తున్నాయని ఆది వేమూరి చెప్పారు. వివిధ క్రీడల్లో ప్రపంచ విజేతలైన అథ్లెట్స్ స్పోర్ట్స్ కార్నివాల్‌లో పాల్గొంటారని కార్నివాల్ ఫౌండర్ కార్తీక్ చెప్పారు. ఇందులో మౌంటనీరింగ్, ఫుట్‌బాల్ నిపుణులు, హైదరాబాద్ హంటర్స్, మిస్టర్ ఇండియా పాల్గొంటారని కార్తీక్ తెలిపారు. క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, యువతను నేరపూరిత ఆలోచనల నుంచి మళ్లించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జ్వాలా గుత్తా అన్నారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

కనీసం ఒక్క ప్రశ్నకైనా

'అవును' అని చెప్పగలరా?

ఇదివరకు న్యాయమైన ధరకు హైదరాబాద్‌లో ఆభరణాలు లభించాయా?

☐ అవును ☐ కాదు

న్యాయమైన ధరకు విక్రయించకుండా, పలురకాల ఆఫర్ల పేరుతో వినియోగదారులను తికమకపెట్టడం సమంజసమేనా?

☐ అవును ☐ కాదు

చెల్లించే డబ్బుకు న్యాయమైన గ్రాముల బంగారాన్ని ఇంటికి తీసుకెళ్తున్నామా అని సరిచూసుకున్నారా?

☐ అవును ☐ కాదు

గ్రాముకు కొంత రాయితీ; మొత్తం బిల్లులో నగదు తగ్గింపు; వజ్రాభరణాలకు బంగారు కాయిన్ ఉచితం,
బంగారు నగలకు వెండి కాయిన్ ఉచితం, తరుగులో 20% వరకు తగ్గింపు, లక్కీడ్రా, ప్రివిలేజ్ కార్డు ఆఫర్...
ఇవన్నీ పరిగణలోకి తీసుకున్న తర్వాత కూడా చెల్లించే డబ్బుకు తగ్గ బంగారాన్ని ఇంటికి తీసుకెళ్తున్నారా?

☐ అవును ☐ కాదు

కష్టపడి సంపాదించిన నగదును అధిక తరుగు కోసం వృథా చేయడం సముచితమైనా?

☐ అవును ☐ కాదు

నగ కొనేటప్పుడు మొబైల్‌లో ఫొటో తీసుకున్నారా?

☐ అవును ☐ కాదు

నగకు ఎస్టిమేట్ స్లిప్ తీసుకున్నారా?

☐ అవును ☐ కాదు

నగలు కొనేముందు మీకు నచ్చిన నగకు ఎస్టిమేట్ స్లిప్, మొబైల్‌లో ఫొటో తీసుకుని నాలుగైదు షోరూంలలో ధరలు పోల్చి చూసి ఎక్కడ తక్కువ ధరకు నగలు లభ్యమవుతాయోనని లెక్కగట్టారా?

☐ అవును ☐ కాదు

BIS 916 హాల్‌మార్క్ బంగారం ఆభరణాలను లలితా జ్యువెల్లరి మాదిరిగా హైదరాబాద్‌లో తయారీ ధరకే,
తక్కువ తరుగుకు విక్రయించే షోరూం ఏదైనా ఉందా?

☐ అవును ☐ కాదు

హైదరాబాద్‌లో ఏ షోరూంలోనైనా చిట్‌స్కీమ్‌కు మొదటినెల వాయిదా ఉచితం మరియు ఏ నగకూ తరుగు లేదన్న వెసులుబాటు ఉందా?

☐ అవును ☐ కాదు

అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్ ద్వారా ఏమాత్రం తరుగు లేకుండా నగలు కొనే సౌలభ్యం ఉన్న స్కీమ్ హైదరాబాద్‌లోని మార్కెట్‌లో ఉందా?

☐ అవును ☐ కాదు

మాకు తెలుసు!... ప్రతి ప్రశ్నకు **'కాదు'** అన్న అతిపెద్ద సమాధానం మీ నుంచి వస్తుంది.
ఈ పరిస్థితిని మార్చేందుకు, మీరు నగలు కొనే విధానంలో సరికొత్త మార్గాన్ని తీసుకొచ్చేందుకు
లలితా జ్యువెల్లరి హైదరాబాద్ మార్కెట్‌లోకి అడుగుపెడుతోంది.

For any clarification or doubts
write to us at
info@lalithaajewellery.com.
We will be glad to reply.

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్.

6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్,
హైదరాబాద్, తెలంగాణ – 500 082.
ఫోన్: 040 - 6748 6677. www.lalithaajewellery.com

Lalithaa™

తిరుపతి • విశాఖపట్నం • చెన్నై • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు



పుస్తకాలు చదవటం...ఇది నేటి జనరేషన్ డిక్షనరీలో కనిపించడం లేదు. ఇంటర్‌నెట్ , సోషల్ మీడియా, టివి, సినిమాలు ఇవే కావాలసినంత కాలక్షేపం, మనోల్లాసం, విజ్ఞానం, కబుర్లు...అన్నీ అందిస్తున్న నేపథ్యంలో పుస్తకం ఎందుకు చదవాలో తెలియని తరం ఇప్పుడున్నది. ఇలాంటిరోజుల్లో ఓ ఇరవై రెండేళ్ళ కుర్రాడు...అదీ బిటెక్ చదివి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న వాడు 'మరణంతో నా అనుభవాలు' అనే పేరుతో నవలని రాసేశాడు. అతని పేరు విజయ్ శేఖర్ ఉపాధ్యాయుల. ఎమెస్కో ప్రచురణ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఆ సంస్థ ప్రచురించిన పుస్తకాల రచయితలలో అతిపిన్న వయస్కుడు అతను. ఈ తరం యువతీయువకులనగానే ...అందరి మనసుల్లోనూ కొన్ని ప్రత్యేకమైన అభిప్రాయాలు బలంగా నాటుకుపోయి ఉన్నాయి. కెరీర్ ఓరియంటెడ్‌గా ఉంటున్నారని... అనుబంధాలకంటే..విదేశాల్లో స్థిరపడటానికి, డబ్బు సంపాదనకు ప్రాముఖ్యతని ఇస్తున్నారని...వగైరా. కానీ అదే యువతరం అక్షరాన్ని...అదీ తెలుగు సాహిత్యాన్ని ఇంకా ప్రేమిస్తున్నారని... వివిధ అంశాలపై సామాజిక దృక్పథాలను విశాలం చేస్తున్నారని విజయ్ అంటున్నాడు. యువతరంలోని సాహితీ ప్రేమకు ప్రతినిధిగా నిలిచిన విజయ్ శేఖర్ ఉపాధ్యాయులను లైఫ్ పాఠకులకు పరిచయం చేస్తున్నాం-

మరణంపై అక్షర తూణీరం!


సాఫ్ట్‌వేర్ ఉద్యోగం...సాహితీ ప్రయాణం

నేటి తరం రచయితలకు... ప్రతినిధి విజయ్ శేఖర్ ఉపాధ్యాయుల

ఒక్క అడుగునుండే ఎంత సుదూర ప్రయాణమైనా మొదలైనట్టుగా ...సాహితీ ప్రయాణంలో తొలిపునాది అనేది చాలామందికి చిన్నతనంలోనే పడుతుంది. అమ్మపాడే లాలిపాటనుండి మనకు సాహిత్యపరిచయం మొదలవుతుంది. కథలు వినని, చెప్పని బాల్యం అనేది ఇదివరకటి రోజుల్లో ఉండేది కాదు. ఇప్పటి పిల్లల విషయంలో అలాంటి అవకాశం చాలా తక్కువ. విజయ్ బాల్యం నాటికే...పిల్లలకు బాలసాహిత్యంతో సంబంధాలు తెగిపోతున్న రోజులు వచ్చేశాయి. కానీ అతను మాత్రం...పుస్తకాలు దొరికే చోటుని కనిపెట్టాడు. తన స్కూలు హెడ్‌మాస్టర్ ఇంట్లో చందమామ, బాలమిత్రలాంటి కథల పుస్తకాలతో లైబ్రరీ ఉండేది. అక్కడినుండి పుస్తకాలు తెచ్చుకుని ఇష్టంగా చదువుకునేవాడు. ఆ ఇష్టం ఆలా పెరుగుతూ వచ్చింది. అలాగే కథల నుండి కల్పనలు, ఊహలు, సొంత ఆలోచనలు..ఇవన్నీ విజయ్‌లో వయసుతోపాటు పెరుగుతూ వచ్చాయి. అలా పదో తరగతికి వచ్చేసరికి కవితలు రాయటం మొదలుపెట్టాడు. విప్లవం, జీవిత సత్యాలు...విజయ్ బుడిబుడి అడుగుల కవితా సాహిత్యం. ఆ తరువాత పుస్తకాలను తన జీవితంలో భాగంగా చేసుకున్నాడు. రామాయణంతో మొదలుపెట్టి విశ్వానాథ, కొడవటిగంటి, శ్రీశ్రీ, చలం, గోపీచంద్ లాంటి రచయితల రచనలను చదివాడు. చలం ప్రేమలేఖలు...ఎన్నోసార్లు చదివాను... అన్నాడతను తన సాహితీ చదువు గురించి చెబుతూ.

కవిసంగమంలో కవిగా...తాతయ్య మరణంతో నవలా రచయితగా

కవితలతో సాహితీ రంగ ప్రవేశం చేసిన విజయ్... కవిసంగమం ఇంటర్‌నెట్ కవిత్వపు వేదికలో కవిగా పరిచయం అయ్యాడు. కవిసంగమం మిత్రులు కలుసుకునే సమావేశాలకు హాజరయ్యేవాడు. సీనియర్స్‌తో తన ఆలోచనలను పంచుకునేవాడు. ఆ సమయంలో ...విజయ్ బిటెక్ రెండో సంవత్సరంలో ఉండగా అతని తాతయ్య చనిపోయారు. అప్పటికే విషయాలను అవగాహన చేసుకుని విశ్లేషంచుకుని...తనదైన ఆలోచనా శైలిని పెంచుకుంటున్న విజయ్‌కి...తాతయ్య మరణంలో విషాదంతో పాటు ఏదో వైచిత్రి తోచింది. తాతయ్య తన కళ్లముందే మాయమవటం...అప్పటివరకు ఆయనతో గడిపిన క్షణాలు, ఆయనతో అనుబంధం...ఒక్కొక్కటిగా గుర్తురావటం మొదలైంది. ఆ ఆలోచనలలోంచే...మరణంతో నా అనుభవాలు పుస్తకానికి పునాది పడింది. చనిపోయిన మనిషికి నిర్వహించే క్రతువులు... పిండాలు పెట్టటం, కాకులు తినటం, ఒక్కోసారి ముట్టుకోకపోవటం...దహన సంస్కారాల్లో తేడాలు.... ఇలాంటివన్నీ గమనిస్తూ వచ్చాడు. ఆధ్యాత్మిక ప్రసంగాల్లో వినిపించిన... మనిషి నిద్రావస్థలో ఉన్నపుడు ఆత్మ శూన్యంలో ప్రయాణం చేస్తుంది...అనే సాంఖ్యయోగంలోని అంశాలు అతడికి మరింత ఆకర్షణీయంగా అనిపించాయి. అలాగే గరుడ పురాణం గురించి..అన్ని మతాల్లోనూ మరణం తరువాత మనిషికి పాపపుణ్యాల లెక్క ఉంటుందనే అంశాలు ఉండటం...ఇలాంటివన్నీ శోధించి మరణంతో నా అనుభవాలు రాశాడు. ఇది ఆన్‌లైన్‌లో కినిగెలో ప్రచురితమైంది. అమ్మకాల్లో రెండోస్థానంలో నిలిచింది కూడా. తరువాత మార్పులు చేర్పులతో పుస్తకంగా వచ్చింది.



తనికెళ్లభరణి మెచ్చుకున్నారు...

రచయిత సొంత అనుభవం నుండి వచ్చిన నవల అయివుంటుందని... పాఠకుడు అనుకోవాలనే..నవలపేరులో నా...అనే అక్షరం చేర్చానని విజయ్ చెప్పాడు. అందులో కొంతవరకు నిజం ఉందనుకోవచ్చు. తనతో టెన్త్ ఇంటర్ బిటెక్ చదివిన ప్రశాంత్...తన సలహా మేరకు అమలాపురంలో బిటెక్‌లో చేరి....యాక్సిడెంట్‌లో మరణించడం...తనని కలచివేసిందని...అతను అక్కడికి రావడానికి...తన సలహా కూడా కారణం కావటం...విధి అని అంటాడు విజయ్. నవలనిండా పదిపేజీలకు ఒక మరణం...ఉండటం గురించి చెబుతూ...మనం గమనించము కానీ మనచుట్టూ... మనం పుట్టినప్పటినుండీ ఎన్నో మరణాలను చూసి ఉంటాము...కనుక ఇవేమీ ఎక్కువ కాదంటాడు. అలాగే తనికెళ్లభరణి...చెప్పిన...మన పుట్టుకనుండే మరణం కూడా మన పక్కనే ఉంటుందనే మాటని కూడా విజయ్ గుర్తుచేసుకున్నాడు. నవలని చదివిన తనికెళ్లభరణి...దీనికిముందు మాట రాశారు. చచ్చినట్టు చదివించే నవల ...అని ప్రశంసించారు. ప్రస్తుతం విజయ్ తండ్రీకొడుకు అనుబంధాన్ని వెల్లడించే పితృణం, థ్రిల్లర్ కథాంశంతో సీతాపహరణ...అనే రెండు నవలలు రాస్తున్నాడు.

> **చెడు పుస్తకాలు తక్కువగా ఉంటాయి..వాటిని చది వినా...ఆచరణలోకి తీసుకోకూడదనే జ్ఞానం పుస్తకాలు చదివేవారికి ఉంటుంది .పిల్లలకు చిన్నప్ప టినుండే పుస్తకాలు చదవటం అలవాటు చేయాలి. పుస్తకాన్ని ఇవ్వటమంటే జీవితాన్ని ఇవ్వడమే.**

నేటి పిల్లలు పుస్తకాలు చదువుతున్నారు

ఇంతకుముందంత స్థాయిలో కాకపోయినా...నేటికీ పిల్లలు పుస్తకాలు చదువుతున్నారని, రాస్తున్నారని, సోషల్‌మీడియాలో ఎంతో మంది పిల్లలు తనని అన్నా...అని పలకరిస్తూ...సాహిత్య విషయాలు మాట్లాడు తున్నారని విజయ్ అన్నాడు. అయితే రచయితకి పాఠకుడికి మధ్య అంతరం పెరిగిందన్నమాట నిజమేనన్నాడు. చదవటం వలన మనలో విచక్షణ పెరుగుతుందని...విజువల్ మీడియాతో పోలిస్తే... చెడు పుస్తకాలు తక్కువగా ఉంటాయని... వాటిని చది వినా...ఆచరణలోకి తీసుకోకూడదనే జ్ఞానం పుస్తకాలు చదివేవారికి ఉంటుందని విజయ్ అభిప్రాయ పడ్డాడు. పిల్లలకు చిన్నప్పటినుండే పుస్తకాలు చదవటం అలవాటు చేయా లని... పుస్తకాన్ని ఇవ్వటమంటే జీవితాన్ని ఇవ్వడమేనంటూ... విజయ్ తన అభిప్రాయాలను వ్యక్తం చేశాడు. ఇప్పటివారు ఇంగ్లీషుని ఎక్కువగా చదువు తున్నారని...తన నవలని ఆంగ్లంలో రాసి ఉంటే...రాత్రికి రాత్రే..గొప్పరచయితగా మారిపోయేవాడినవే ప్రశంస వచ్చిందని...కానీ తనకు తెలుగులో రాయడమే ఇష్టమని విజయ్ తెలిపాడు. తాను కథనాన్ని ఎక్కువ ఆస్వాదిస్తానని... ఒక సన్నివేశాన్ని అక్కడ ఉన్నరెండుమూడు పాత్రల కళ్లతోనే కాకుండా...ఆ వాతావరణంలో ఉన్న ఇతర ప్రాణుల కోణంలోంచి కూడా ఆవిష్కరించవచ్చంటాడు.

ఆధారపడకుండా జీవించాలి..ఒక అభిరుచిని పెంచాలి!

ఇదివరకు పెద్ద ఇల్లు, గార్డెన్, కారు...లాంటివి సంపాదిస్తేనే జీవితం అనిపించేదని...ఇప్పుడు...ఒక చిన్న ఇల్లు...ఒకమంచిలైబ్రరీ...ఉంటే చాలనిపిస్తోందని...యువతరం ఇతరులపై ఆధారపడి బతకటం, ఇతరులు సంపాదించిన డబ్బుతో (వారు సొంతవారైనా సరే) విలాసాలకు అలవాటు పడటం చేయకూడదంటాడు విజయ్. తను అదే పంథాలో జీవిస్తున్నానని తెలిపాడు. పుస్తకాలు చదివే అలవాటు తగ్గిపోయి...ఇప్పుడు సినిమాలు, టివిలు పెరిగిపోయిన మాట నిజమే అయినా...సినిమాలు, టివి సీరియల్స్‌గా మంచికథలు చెప్పవచ్చని...అతను అభిప్రాయపడ్డాడు. కథ చెప్పటం, అదీ మంచికథ చెప్పటం ముఖ్యమని...కంచె, వేదం, గాంధీ లాంటి సినిమాలు చూసినప్పుడు అదే అనిపించిందని , ఆ సినిమాలు తనకు బాగా నచ్చాయని విజయ్ తెలిపాడు. పిల్లల్లో ప్రతి ఒక్కరికీ...ఏదో ఒకకళని పరిచయంచేసి నేర్పించాలని...వారికి మంచి అభిరుచులతో పరిచయం ఉన్నపుడు చెడువైపు ఆలోచనలు వెళ్లవని బలంగా నమ్ముతున్న.... విజయ్ బాటలో మరింతమంది యువతీయువకులు...చదువరులుగా, రచయితలుగా మారతారని...తెలుగు సాహిత్యానికి కొనసాగింపు తరంగా అవతరిస్తారని ఆశిద్దాం.

- వడ్లమూడి దుర్గాంబ

టీనేజిలో స్నేహం... మనసుకి ఔషధం!

> టీనేజికి వచ్చాక పిల్లలు తమతో కంటే స్నేహితులతో ఎక్కువ సమయం గడుపుతున్నారనేది చాలామంది తల్లిదండ్రుల ఫిర్యాదు. వాళ్లు తమతో మాటలు తగ్గించేశారని, అన్నీ స్నేహితులతోనే చెప్పుకుంటున్నారని, అసలు ఆ స్నేహాల వల్లనే తమ పిల్లలు పాడైపోతున్నారని కూడా కొంతమంది తల్లిదండ్రులు అంటూ ఉంటారు. స్నేహితులు లేకుండా ఇంటిపట్టున మౌనంగా ఉండే పిల్లలకు మంచి పిల్లలనే ముద్ర కూడా ఉంటుంది. కానీ...యూనివర్శిటీ ఆఫ్ వర్జీనియాలో జరిగిన ఒక పరిశోధన ఫలితాలను వింటే మాత్రం...అలాంటి తల్లిదండ్రులు ఇక పిల్లల స్నేహాలను నెగెటివ్‌గా చూడకపోవచ్చు.

యవ్వనంలోకి అడుగుపెడుతున్న దశలో పిల్లలు ఎంతగా స్నేహాలు చేస్తే భవిష్యత్తులో వారి మానసిక, భావోద్వేగపరమైన ఆరోగ్యం అంతగా బాగుంటుందని ఈ పరిశోధనకు సారథ్యం వహించిన రేచల్ కె నార్ అంటున్నారు. యాంగ్జయిటీ, డిప్రెషన్, తమ విలువని తాము గుర్తించకుండా కుంగిపోవటం...లాంటి సమస్యలు టీనేజిలో స్నేహితులు ఎక్కువగా ఉన్న పిల్లల్లో...తక్కువగా ఉంటాయని రేచల్ అంటున్నారు.

ఈ పరిశోధన కోసం 15ఏళ్ల వయసున్న పిల్లలను 169మందిని ఎంపిక చేసుకున్నారు. వారి స్నేహాలను, మానసిక ఆరోగ్యాన్ని పదేళ్లపాటు...అంటే వాళ్లంతా 25ఏళ్ల వయసుకి వచ్చేవరకు పరిశీలించారు. హైస్కూలు స్థాయిలో స్నేహాలు ఎక్కువగా చేసిన పిల్లలు తరువాత దశలో మానసికంగా మరింత బలంగా ఉన్నట్టుగా గుర్తించారు. అయితే మరొక గమ్మత్తయిన విషయం ఏమిటంటే స్కూలు స్థాయిలో తోటి పిల్లల్లో ఎక్కువగా పేరున్న పిల్లలు... తరువాత కాలంలో సోషల్ యాంగ్జయిటీకి గురయినట్టుగా గుర్తించారు.

స్నేహితులు ఎక్కువగా ఉండటం...వారితో కలిసిమెలసి ఆనందంగా గడపటం ఉన్నపుడు...అవన్నీ పిల్లల మనసులపై పాజిటివ్ ప్రభావాన్ని చూపుతాయని, ఆ వయసులో ఏర్పడిన అలాంటి పాజిటివ్ ఫీలింగ్స్ తరువాత జీవితంలో మానసిక ఆరోగ్యాన్ని ఇస్తాయని రేచల్ తెలిపారు. అధ్యయనంలో పాల్గొన్న పిల్లలను సంవత్సరానికి ఒకసారి సమావేశపరచి, వారికి సన్నిహిత మిత్రులు ఎంతమంది ఉన్నారు...వారి స్నేహం ఎలా సాగుతోంది...అనే విషయాలను ప్రశ్నించారు. అలాగే వారిలో యాంగ్జయిటీ, డిప్రెషన్, నలుగురు తమని ఎలా చూస్తున్నారో అనే బిడియం ఏ స్థాయిలో ఉన్నాయో నమోదు చేసి..సమీక్షలు చేశారు. అలా చూసినప్పుడు 15ఏళ్ల వయసులో చక్కని స్నేహ బంధాలున్న పిల్లల్లో...అలా స్నేహాలు చేయని పిల్లలతో పోలిస్తే...మానసిక సమస్యలు చాలా తక్కువగా ఉండటం గమనించారు.



ఫ్యాషన్ ఫన్

నియాన్ వెలుగుల నయనాలు










కళ్లే దీపాల్లా వెలుగుతుంటాయని కవులంటారు. కానీ నేటి ఫ్యాషన్ ప్రపంచంలో కళ్లలో మెరుపులు వెలుగులు అక్కర్లేదు. వాటన్నింటినీ ఫ్యాషనే సృష్టిస్తుంది. కనురెప్పలు అందంగా మందంగా కనిపించేలా చేసేందుకు మస్కారాని కళ్లకు వాడుతుంటారు. ఎంత నల్లగా ఈ మస్కారాన్ని కళ్లకు వేసుకుంటే కళ్లు అంత అందంగా కనిపిస్తాయనేది వేసుకునేవారి భావన. కానీ ఇప్పుడు ఈ మస్కారాని సైతం రంగుల్లో వాడుతున్నారు. మరీ ముఖ్యంగా నియాన్ రంగుల మస్కారా ఫ్యాషన్ ప్రపంచంలోకి దూసుకువస్తోంది. గ్రీన్, పింక్, ఆరంజ్ , బ్లూ లాంటి రంగులు బ్రైట్ గా కనబడితే వాటిని నియాన్ రంగులు అంటారు. అంటే నియాన్ లైట్లంత కాంతివంతమైన రంగుల్లో ఈ మేకప్ ఉంటుంది. కనురెప్పలకు నియాన్ రంగుల మస్కారాని వేయడమే కాకుండా కృత్రిమ కనురెప్పలను సైతం ఈ రంగుల్లో తయారుచేస్తున్నారు. దుస్తుల రంగులకు సరిపోయేలా చేతులకు గాజులు, చెవులకు జూకాలు, మెడలో నగలే కాదు...కళ్లకు రెప్పలు కూడా కొని అలంకరించుకోవచ్చన్నమాట.

సద్గతి సాధనకు సప్తమాధ్యాయ పారాయణం

భగవద్గీత ఎంతో పుణ్యప్రదమైనది, ఫలప్రదమైనదనే విషయం తెలిసిందే. ఎంత పుణ్యప్రదమైనదంటే అందులో ఒక అధ్యాయం పారాయణ వల్ల నీచ జన్మలో ఉన్న వారు కూడా సద్గతి పొందుతారు. జంతుజాలానికి సైతం ఇది వర్తిస్తుంది. నీచ జన్మల నుంచి తరింపజేసే ఈ అధ్యాయం మంచి సంస్కారులు, సంపదలు, దాన ధర్మాలు కలవారింట పుట్టేందుకు దోహదం చేస్తుందనే విషయం వేరే చెప్పనక్కర్లేదు. ఈ అధ్యాయ పారాయణ వల్ల కలిగే ఫలితాన్ని వివరించే పురాణ కథ ఇది.



పూర్వం పాటలీపుత్రంలో శంఖ కర్ణుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతను బ్రాహ్మణ పద్ధతులకు వ్యతి రేకంగా ధనకాంక్షా పరుడై, ఎన్నో మార్గాల్లో ధనం సంపా దించి అధికంగా కూడబెట్టాడు. ఒక రోజు ఏదో పనిమీద పక్క గ్రామానికి అడవి మార్గంలో వెడుతుండగా ఒక పాము అతడిని కాటేసింది. ఆ విషం క్షణాల్లో శరీరమంతా వ్యాపించి అతడు వెంటనే మరణించాడు. ఆ తర్వాత అతను పాము జన్మ ఎత్తాడు. తన పూర్వ జన్మ ధనాశను వదలకపోవడం వల్ల తాను సంపాదించి, భూమిలో పాతి ఉంచిన ధనరాశుల చుట్టూ కాపలాగా ఉండేవాడు. అలా కొంతకాలం గడిచాక, ఆ జన్మకు విసిగిపోయి, ఆ జన్మ నుంచి విముక్తి కాగోరి, ఒకరోజున తన కుమారులకు కలలో కనిపించి, 'తాను వారి తండ్రిననీ, తాను భూమిలో ఉంచి దాచిన ధనరాశులకు పాము రూపమెత్తి కాపలా కాస్తున్నానని, తనకు విముక్తి కలిగించే మార్గం చూడమని కోరాడు. తెల్లవారిన తర్వాత అతని కుమారులు తమ తండ్రి నిధి దాచానని చెప్పిన ప్రదేశానికి వెళ్లి గునపాలతో తవ్వసాగారు. ఇంతలో పాము రూపంలో ఉన్న శంఖకర్ణుడు శివుడనే తన కుమారునితో 'నాయనా! భగవద్గీత ఏడవ అధ్యాయం పారాయణ చేసి నాకు ఈ జన్మ నుంచి విముక్తి కలిగించమని కోరగా, వారు తండ్రి తమకు ఇచ్చిన సంపదకు సంతోషించి, భగవద్గీత ఏడవ అధ్యాయం నిత్యం ఆ పాము దగ్గరలో చదవడం మొదలుపెట్టారు. కొన్నాళ్లకు పాము రూపంలో ఉన్న శంఖకర్ణుడు మరణించి సద్గతి పొందాడు.

గీతానాం సప్తమాధ్యాయ మంతరేణ సుధామయం
జంతో జరామృత్యు దుఃఖ నిరాకరణ కారణం

అమృతతుల్యమైన భగవద్గీత ఏడవ అధ్యాయాన్ని ప్రతి దినం భక్తితో పారాయణ చేసిన జీవులకు, శ్రవణం చేసిన జంతుజాలానికి సైతం జన్మ మృత్యు జరాదుఃఖం తొలగిపోతుందని తెలుస్తోంది. శంఖకర్ణుని కుమారుడు, భగవద్గీత ఏడవ అధ్యాయాన్ని నిత్యం పారాయణ చేసి ఆ ఫలితం వల్ల తండ్రికి విముక్తిని కలి గించడమే కాక, ఆ పుణ్యఫలం వల్ల వారూ గొప్ప సంస్కారులై తండ్రి దాచి ఇచ్చిన ధనమంతా దానధర్మా లకు ఖర్చు చేసి పుణ్యం సంపాదించి గీతాధ్యయన ఫలం వల్ల పుణ్యలోకా లకు చేరారని పద్మ పురాణంలోని ఈ కథ చెబుతోంది.

సప్తమాధ్యాయ జపతో ముక్తి
భాజో భవం స్తతః
దేవమిష్ట తమం జ్ఞాత్వా
నిర్వాణార్పిత బుద్ధయః

ఈ అధ్యాయ పఠనం వల్ల మానవులే కాక పితృదేవతలు వారున్న లోకం నుంచి మరిం త ఉత్తమ లోకాలకు పాముల వంటి నీచజన్మ పొందినవారు సైతం దాని నుంచి విముక్తులై పుణ్యలోకాలు పొందుతారు.

- రచన, సేకరణ:
ఆదూరి హైమావతి

సౌభాగ్యాన్నిచ్చే హరితాళిక


రేపు హరితాళికా వ్రతం

భారతీయ సంప్రదాయంలో పుణ్యం కలగడానికి, పాపాలు తొలగడానికి, కోర్కెలు నెరవేరడానికి ఎన్నో వ్రతాలు, నోములు ఉన్నాయి. వాటిలో ఉత్కృష్టమైనదిగా పేర్కొనే వాటిలో హరితాళికా వ్రతం ఒకటి. ఇది అంతగా ప్రచారంలో లేకపోయినా సాక్షాత్తు పరమేశ్వరుడే దీనిని పార్వతికి చెప్పాడని గ్రంథాలలో ఉంది. ప్రస్తుతం ఈ వ్రతం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఆచరణలో ఉంది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, రాజస్థాన్, బీహార్‌లలో ఈ వ్రతాన్ని ఘనంగా జరుపుకుంటుంటారు. తెలుగు రాష్ట్రాల్లో ఇది అంతగా ప్రచారంలో లేదు. కొన్ని ఇతర ప్రాంతాల్లో వేరు వేరు పేర్లతో ఈ వ్రతాచరణం ఉంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలోని కొన్ని ప్రాంతాల్లో ఒక పార్వతీ దేవి విగ్రహాన్ని వాహనంలో ఉంచి మేళతాళాలతో ఊరేగిస్తారు. దక్షిణాదిన తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో దీనిని గౌరి హబ్బ అనే పేరుతో చేసే సంప్రదాయం ఉంది. మంగళ స్వరూపిణి అయిన గౌరీ దేవి తమకు ఆనంద దాయకమైన వైవాహిక జీవితం ఇవ్వమని పార్వతీ దేవిని కోరుకుంటారు. ఉత్తరాదిలో ఈ వ్రతం నిర్వహించేందుకు వివాహితలు తమ పుట్టింటికి వెళ్ళి జరుపుకోవడం ఉంటుంది. ఈ వ్రతం నాడు జరిగే కార్యక్రమాల్లో మహిళలు ఆభరణాలు ధరించి, కాటుక వంటి ఆలంకరణలతో జరుపుకుంటారు. ఆకుపచ్చ రంగు వస్త్రాలు ముఖ్యంగా ధరిస్తారు. కొన్ని చోట్ల మూడు రోజుల పాటు ఉపవాసం చేసే సంప్రదాయం కూడా ఉంది. ఈ వ్రతంలో పూజ సాధారణంగా మధ్యాహ్న సమయంలో ప్రారంభిస్తారు. అన్నం కొబ్బరి పాలతో చేసిన ఒక తీపి వంటకాన్ని కూడా తయారు చేసి దేవునికి నైవేద్యంగా సమర్పిస్తారు. బెల్లం, అన్నం పాతోళీగా చేసుకుని దానిని ఆరిటాకులలో పెట్టుకుని తినడం ద్వారా మహిళలు ఉపవాస దీక్ష విరమిస్తారు.

శ్రమ లేకుండా సంపూర్ణ ఫలమిచ్చే వ్రతం ఏదని పార్వతి అడిగినపుడు శంకరుడు ఈ వ్రతాన్ని ఉపదేశించాడని చెబుతారు. ఈ వ్రతం చేయడం వల్ల సమస్త పాపాలు పోతాయని, గతంలో ఇది చేయడం వల్లనే నువ్వు నన్ను పొందగలిగావు అని కూడా శంకరుడు ఈ సందర్భంగా పార్వతికి చెప్పాడని అంటారు. ఈ వ్రతానికి హరితాళిక అనే పేరు రావడానికి కారణంగా ఒక కథను చెబుతారు. దాని ప్రకారం హిమవంతుడి కూతురిగా పుట్టిన పార్వతిని నారదుని సూచన మేరకు విష్ణువుకిచ్చి వివాహం చేయాలని ఆమె తండ్రి తలంచాడు. అయితే శంకరుణ్ణే మనసులో నిలుపుకున్న పార్వతీదేవి ఆయనను మినహా ఇతరులను వివాహం చేసుకోబోనని చెప్పింది. అంతటితో ఆగక వనంలోకి వెళ్లి భాద్రపద శుక్ల తృతీయ నాడు ఇసుకతో లింగాన్ని చేసి పూజించింది. అప్పుడు శివుడు ప్రత్యక్షమయ్యాడని, ఆయన సమక్షంలోనే పార్వతి వ్రత పరిసమాప్తి చేసిందని చెబుతారు. ఈలోగా అక్కడికి హిమవంతుడు రాగా తనను శివునికిచ్చి వివాహం చేయమని ఆమె మళ్ళీ కోరింది. ఆయన అందుకు మొదట అంగీకరించలేదు. దానితో ఆమె స్నేహితురాళ్లు ఆమెను దాచేపి విష్ణువుతో వివాహం కాకుండా ఆపే ప్రయత్నం చేశారు. సంస్కృతంలో హరత్ అంటే అపహ రించడమని, ఆలికా అంటే స్నేహితురాళ్లు అని. ఆ రోజున పార్వతిని స్నేహితురాళ్లు అపహరించి అంటే మరో చోటికి తీసుకుపోయి ఆమెకు విష్ణువుతో వివాహం కాకుండా ఆపే ప్రయత్నం చేశారని, అందువల్లనే ఈ వ్రతానికి హరితాళికా వ్రతమనే పేరు వచ్చిందని ఒక కథ. ఆ తర్వాత హిమవంతుడు అంగీకరించడంతో పార్వతీపరమేశ్వరుల కళ్యాణం జరిగింది. ఈ వ్రత ఉద్యాపన మర్నాడు చేస్తారు.

ఇక ఇదే తిథినాడు తెలుగు నాట ఆరు కుడుముల తద్ది అనే నోము కొందరు చేస్తారు.

షోడషోమా వ్రతం

ఈ రోజు ప్రారంభించి వరుసగా 16 నెలలు శుక్లపక్షంలో వచ్చే తదియ నాడు గౌరీ పూజ చేసుకునే వ్రతం షోడషోమా వ్రతం. దీని వల్ల సకల సౌభాగ్య సిద్ధి కలుగుతుంది.

- సేకరణ:జిపి

ధర్మం-మర్మం

నేడు కల్కి జయంతి



కలియుగం చివరలో ధర్మం పూర్తిగా కనుమరుగై అధర్మం అన్ని విధాల విజృంభించి వికటాట్టహాసం చేస్తున్నప్పుడు అనగా వేదం, దైవం, ధర్మం, సత్యం, త్యాగం, అహింస, రక్షణ పరిపాలన అనే మాటలు కనుమరుగై పోతాయి. ఆస్తి, దాంపత్య హక్కులు చివరికి బ్రతికే హక్కు కూడా అధర్మంతో హరించబడుతుంది. బలమున్న వానిదే ధనం, రాజ్యం. అన్ని మర్యాదలు, అన్ని ధర్మాలు అడుగంటి మూడు నాలుగు సంవత్సరముల వయస్సు మాత్రమే పరమాయుష్షమై పశుప్రాయమైన జీవితాన్ని, రాక్షస ప్రాయమైన వ్యవహారాన్ని, మృగ ప్రాయమైన ప్రవృత్తిని అలవరుచుకొని ఆహారం, నీరు దొరక్క తోటి మనిషిని మనిషి చంపి తినే దారుణమైన స్థితి వచ్చినప్పుడు పరమాత్మ అధర్మ చరమావధిని పొందించి అపుడు తాను కల్కి రూపంలో అశ్వారూఢుడై కర వాలం చేతబూని అధర్మాత్ములను ఖండిస్తూ, అధర్మాన్ని రూపు మాపేందుకు వచ్చే అవతారం కల్కి అవతారం. దానితో కలియుగం అంతం అవుతుంది. కలియుగం తరువాత మళ్లీ కృత యుగం వచ్చి ధర్మం వెల్లి విరుస్తుంది.




- డా॥ కందాడై రామానుజాచార్య

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

కార్యక్రమ పట్టిక



శ్రీ రమణాశ్రమం
15-8-46

నెలరోజుల క్రిందట మధుర వెళ్లిన సర్వాధికారి నిరంజనానంద స్వాములు నాలుగయిదు రోజుల క్రిందట పట్నం వెళ్లారట. అక్కడున్న రమణభక్తులలో ప్రముఖులైన వారితో ఆలోచించి సెప్టెంబరు ఒకటవ తేదీకి నిర్ణయించిన స్వర్ణోత్సవానికి నడపదలచిన కార్యక్రమమంతా పట్టికగా వ్రాసి పంపగా నిన్న ఉదయం తెచ్చి వినయ విధేయతలతో శ్రీ భగవానులకు సమర్పించి చేతులు జోడించి నిలిచాడు టి.కె. దొరసామయ్యరు.

ఆ లేఖలో ఉత్సవదినం ఉదయం ఏడు గంటలు మొదలు రాత్రి ఏడింటి వరకు జరుపదలచిన కార్యక్రమం వ్రాసి ఉంది. హైకోర్టు జడ్జీలు, ఇంకా పేరు గలపెద్ద మనుష్యులు, ఎందరో ఉపన్యాసకులుగా నిర్ణయింపబడ్డారు. ముసిరి సుబ్రహ్మణ్యయ్యర్, బూదలూరి కృష్ణమూర్తి, అయ్యర్‌గార్ల పాట కచేరీ, ఇంకా యేమేమో కార్యక్రమ పట్టికలో ఉన్నాయి. భగవాన్ అదంతా పరిశీలనగా చదివి మందహాసంతో "సరిపోయింది. వ్యవధిలేని కార్యక్రమం, పోనీ నాకెందుకు, ఏమన్నా చేసుకోనీ, నాకు మాత్రం బయటికి వెళ్లి వచ్చేటందుకు వ్యవధి ఇస్తే చాలును. అయినా ఈ పెద్దలంతా వచ్చి ఉపన్యాసాలిస్తారంటారే, దేన్ని గురించి మాట్లాడుతారబ్బా? ప్రసంగించటానికి యేమున్నదీ? ఉండేది మౌనం. మౌనాన్ని గురించి మాటలతో ఎట్లా చెప్పటం? ఇంగ్లీషులో, సంస్కృతంలో, అరవంలో, తెలుగులో, మళయాళంలో, అరే అప్పా! అన్ని భాషలలో మాట్లాడుతారట గొప్పగొప్పవారు. ఊ...పోనీ, మనకెందుకు, మననేమీ మాట్లాడమనకుండా వుంటే అంతే చాలు" అన్నారు భగవాన్.

ఆ భక్తుడు చేతులు నలుపుకుంటూ ఇందులో ఏదైనా వద్దని భగవాన్ సెలవిస్తే మానేస్తామన్నాడు వినయంగా. "ఓహో, సరిసరి. ఇదంతా నేను కావాలన్నానా ఒకటి వద్దనటానికి? ఏమైనా చేసుకోండి. వారి యిష్టం. మీ యిష్టం. నన్ను మాత్రం ఏ ఉపన్యాసానికీ నియమించకుండా ఉంటే అంతే చాలు. ఇట్లా సోఫామీద కూర్చుంటాను. ఏమైనా చేసుకోం"డన్నారు భగవాన్ చిరునవ్వుతో. "ఔను స్వామీ! వాస్తవమే. భగవాన్ యెదుట నోరెత్తి ప్రసంగించటం ఎవరికీ సాధ్యపడదు. అయినప్పటికీ ఇంత భాగ్యం లభించిందే అని మా సంతోషం వెలిబుచ్చటానికి ఇదంతాను" అంటూ నమస్కరించి వెళ్లాడా భక్తుడు.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

భగవద్గీత

జ్ఞానయజ్ఞం మహత్తరమైంది



అధ్యాయం 4
శ్లోకం 33:

శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్
జ్ఞానయజ్ఞః పరంతప ।
సర్వం కర్మాఖిలం పార్థ
జ్ఞానే పరిసమాప్యతే ॥

తాత్పర్యం: ఓ పరంతపా ! జ్ఞాన యజ్ఞం, ద్రవ్యమయ యజ్ఞం కన్న మహత్తరమైనది. ఓ పార్థా! కర్మ యజ్ఞములన్నియును చివరికి దివ్య జ్ఞానము నందే పరిసమాప్తి పొందుతాయి

భాష్యం: అన్ని విధాలైన యజ్ఞముల లక్ష్యం, జ్ఞానవంతులమై భౌతిక కష్టాల నుండి బయటపడి చివరకు భగవద్భక్తి చేయుటయే. మనం యజ్ఞాలను భౌతిక సంపదల దానధర్మాల వరకే చేస్తూ దివ్య జ్ఞానము కోసం ఉద్దేశించకపోతే అవి భౌతిక కార్యాలుగానే మిగిలిపోతాయి. దివ్యజ్ఞాన లక్ష్యము లేనిదే ఆధ్యాత్మిక ఫలితాలు రావు. మన శ్రద్ధ, విశ్వాసం ఉన్నతి చెంది దివ్యజ్ఞానం లక్ష్యంగా చేస్తామో అప్పుడు దానికి సంబంధించిన కార్యాలన్నీ ఆధ్యాత్మికమవుతాయి. అటువంటి వ్యక్తి కేవలము కామ్య కర్మల " కర్మ కాండను"ను దాటి, జ్ఞాన లక్ష్యమైన " జ్ఞాన కాండ" స్థితికి ఎదుగుతాడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

దినఫలాలు

మేషరాశి
ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో ప్రతికూల మార్పులు చేకూరుతాయి. ఆర్థిక చిక్కులు లేకపోలేదు. శత్రువృద్ధి ఉంటుంది.

వృషభ రాశి
అనుకూల పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల ద్వారా అనుకూలత ఉంటుంది. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో సమస్యలు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథున రాశి
గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం తగ్గుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి
దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచన దోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయమార్గాలు అనుకూలం.

సింహ రాశి
ఆర్థిక ప్రయత్నాలు అనుకూలం. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమయిన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి
ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

తులా రాశి
విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళా రంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమయిన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి
వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు తగ్గుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూలత/ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి
ఉద్యోగ వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆదాయంలో ప్రతికూలత ఉంటుంది. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. కుటుంబ వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి.

మకర రాశి
ఆరోగ్యరీత్యా అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. ఆదాయానికి అనుకూల పరిస్థితులు ఉంటాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలం.

కుంభ రాశి
సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య క్రమశిక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార అనుకూలత ఉంటుంది.

మీన రాశి
విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.

24.8.2017, గురువారం

మేషరాశి
విద్యాప్రయత్నాలు అనుకూలం. వాహన సౌఖ్యం కొనసాగుతుంది. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. రుణ ఒత్తిడులు అవమానాన్ని కలిగిస్తాయి. ఆదాయంలో నూతన అవకాశాలు ఏర్పడతాయి.

వృషభ రాశి
గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ప్రయాణాలు సుఖవంతం. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. వేగవంతమయిన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆదాయంలో విఘ్నాలు.

మిథున రాశి
సాహస నిర్ణయాలు ఉపకరిస్తాయి. స్థిరాస్తి విషయాల్లో అనుకూలత ఉంటుంది. పనులను అనుకొన్న సమయానికి పూర్తిచేయలేకపోతారు. ఆరోగ్యం పర్వాలేదు. అసహన వైఖరి ద్వారా అవమానాలను ఎదుర్కో వలసి వస్తుంది. అధిక ప్రయత్నాలతో అనుకూల పరిస్థితులు ఆదాయ పరంగా ఉంటాయి.

కర్కాటక రాశి
ఆర్థిక లావాదేవీలు కలసి వస్తాయి. సంభాషణలు ఇతరులకు రుచించవు. ఆరోగ్యం క్రమశిక్షణ పెరుగుతుంది. శత్రుభీతి ఉంటుంది. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి
ఆరోగ్య అనుకూలత ఉంటుంది. వృత్తిలో గుర్తింపు లభిస్తుంది. ఒత్తిడులు అన్ని రకాలుగా తగ్గుతాయి. ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి. ఆదాయంలో అసహన పరిస్థితులు తగ్గుతాయి.

కన్యా రాశి
ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆర్థిక ప్రోత్సాహం ఉంటుంది. విదేశీ లావాదేవీల పొరపాట్లు సవరించబడతాయి. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. ప్రత్యర్థులు బలపడతారు. ఆదాయంలో కూడా అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి
శుభ ప్రయత్నాలు కలసి వస్తాయి. రాజకీయ నిర్ణయాలు లాభిస్తాయి. వ్యాపార అనుకూలత పెరుగుతుంది. అకారణ శత్రుత్వాలు పెరుగుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. నమ్మిన వ్యక్తుల ద్వారా మోసపోతారు. ఆదాయంలో మంచి లాభాలు.

వృశ్చిక రాశి
ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. శుభవార్తలు వింటారు. పనులలో అలసత్వం ఉన్నా, అంతిమ విజయాలు కూడా ఉంటాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. చేపట్టే కార్యాలలో ప్రోత్సాహం వెన్నంటి ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి
గృహ విషయాల్లో సందడి పెరుగుతుంది. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. శ్రమ తగ్గు తుంది. పనులలో ప్రోత్సాహం ప్రయత్న పూర్వకంగా లభిస్తుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. కార్యాలలో మందత్వం ఉన్నా నెగ్గుకు రాగలుగుతారు.

మకర రాశి
రుణ ప్రయత్నాలు అనుకూలం. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. వ్యాపార ఒప్పందాలు లాభిస్తాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మానసిక వ్యాకులతలు ఉన్నా నెట్టుకురాగలుగుతారు. ఒప్పులు కూడా తప్పులుగా చిత్రీకరింపబడతాయి. ఆదాయంలో అనుకూలత. ప్రతికూలత కూడా ఉంటాయి.

కుంభ రాశి
వ్యాపార నిర్ణయాలు కలసి వస్తాయి. ఆర్థిక ప్రోత్సాహం ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆకస్మిక ఖర్చులు లేకపో లేదు. ఆరోగ్యం ప్రతికూ లత తగ్గుతుంది. కుటుంబ వ్యవహారాల్లో ప్రోత్సాహం కొనసాగుతుంది. ప్రోత్సాహ పరిస్థితులు ఆర్థికంగా మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి
ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. విధులను సక్రమంగా నిర్వహించగలుగుతారు. ఆరోగ్య రక్షణ ఉంటుంది. ముఖ్యమైన పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



తొలి మహిళ



రైల్వేలకు ఆమె 'సు'రేఖ

పురుషాధిక్య సమాజంలో కొన్ని పనులకు మాత్రమే మహిళలను కేటాయించేవారు. మిగతా పనులన్నింటిని వారే నిర్వహించేవారు. ఆ పనులు చేయడానికి మహిళలు అర్హులు కారన్నట్లుగా భావించేవారు. అలా భావించే వారి మధ్య నుంచి వచ్చి వారు ఊహించని విధులు చేపట్టి వారి అంచనాలు తప్పని నిరూపించిందొక మహిళ. ఆ మహిళ ఎవరు? ఎటువంటి విధులు నిర్వహించి పేరు తెచ్చుకున్నారనే వివరాలు మీకోసం...

సురేఖ యాదవ్ మొట్టమొదటి మహిళా ట్రైన్ డ్రైవర్‌గా 1988లో నియామకమయ్యారు. భారతీయ రైల్వేస్‌లో ఎక్కువగా పురుషాధిక్యతే నడుస్తుంది. అలాంటి సమయంలో ఆమె వారందరికీ సవాళ్లు విసురుతూ మొదటి మహిళా డ్రైవర్‌గా శిక్షణ పొందింది.

బాల్యం

ఆమె మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించింది. తల్లిదండ్రులు సోనాబాయి, లేట్ రామచంద్ర భోన్సలే. అయిదుగురు సంతానంలో ఆమె పెద్దది. సెయింట్ పౌల్ కాన్వెంట్ హైస్కూల్‌లో చదువుకుంది. ఆమె విద్యలోనే కాకుండా క్రీడారంగంలో కూడా ఆల్‌రౌండర్‌గా పేరు సంపాదించుకున్నది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేసింది. ఆమె మొదటగా టీచర్‌గా కావాలని అనుకున్నది. కాని భారతీయ రైల్వేస్‌లో అడుగుపెట్టాక ఆమె నిర్ణయాలు చాలా తారుమారయ్యాయి.

ఉద్యోగ ఎంపిక

''నేను అందరిలాగే ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేశాను. ఆ తరువాత ఉద్యోగావకాశాలకోసం ఎదురుచూస్తున్నాను. అందులో భాగంగా ఎంప్లాయిమెంట్ న్యూస్ చూస్తుంటే నాకు భారతీయ రైల్వేస్‌లో అసిస్టెంట్ డ్రైవర్‌గా పోస్టు ఖాళీ ఉందని తెలిసింది. దానికి అర్హత డిప్లొమా. నేను అప్పటికే డిగ్రీ పూర్తి చేశాను. జాబ్ ఎలా ఉంటుందనే విషయాలేమీ ఆలోచించకుండా ఉద్యోగానికి దరఖాస్తు చేసి ఈరంగంలోకి వచ్చాను'' అని ఆమె చెప్పారు. టెక్నికల్ విద్యార్థి కావడంతో ఆమె దరఖాస్తును నింపి పంపింది. హాల్ టికెట్ వచ్చాక పరీక్షరాయాలని నిర్ణయం తీసుకుంది. పరీక్ష 1987లో జరిగింది. కాని నేను ఫలితాల గురించి ఆశగా ఎదురుచూడలేదు. అనుకోకుండా ఒకరోజు అపాయింట్‌మెంట్ లెటర్ మా ఇంటి గుమ్మం ముందుకు వచ్చింది. నాకు అలా వస్తుందని నేను ఊహించలేదు. నేను అప్లయి చేసిన మొదటి జాబ్ అప్లికేషన్ అదే. అపాయింట్‌మెంట్ లెటర్ చూసి మా కుటుంబ సభ్యులు కూడా ఆశ్చర్యపోయారు. తరువాత నిర్ణయం తీసుకుని సెంట్రల్ రైల్వేలో ట్రైనీ అసిస్టెంట్ డ్రైవర్‌గా చేరాను. అప్పటి నుంచి నేను వెనక్కి తిరిగి చూసే అవసరం రాలేదు. రాతపరీక్షలోగాని, వైవా పరీక్షలోగాని అమ్మాయిని నేను ఒక్కదాన్నే. నాకు అప్పటివరకు తెలియదు ఒక్క మహిళా ఇప్పటివరకూ ఈ రంగంలో పనిచేయలేదని. కొంతమంది ముందడుగు వేసి కూడా వెనక్కి తగ్గారని తరువాత నాకు తెలిసింది. నాకు ఈ అవకాశం వచ్చింది కనుక నేను ఈ ఉద్యోగంలో చేరి నా దేశానికి, నా కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని అనుకున్నాను అని ఆమె చెప్పారు. 2011నాటికి ఈ మహిళా డ్రైవర్ల సంఖ్య 50కి చేరుకుంది. వాళ్లు సబర్బన్ ట్రైన్లు, సబర్బన్ ట్రైన్లు, షంటర్లుగా, అసిస్టెంట్ డ్రైవర్లుగా నేటికీ పనిచేస్తున్నారు.

రైళ్లంటే ఎంతో ఇష్టం

అసిస్టెంట్ డ్రైవర్ నుండి గూడ్స్ డ్రైవర్‌గా, ఆ తరువాత పాసింజర్ ట్రైన్‌కి విధులు నిర్వహించాను. మొదటిసారి ప్రయాణీకులను ఎక్కించుకుని ట్రైన్ నడుపుతున్నప్పుడు కొంచెం భయంగానే అనిపించింది. కాని ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ముందుకు సాగానని అన్నారు. ఆమె మొదటిసారిగా నడిపిన గూడ్స్ ట్రైన్‌ను ఎల్-50 వాడి బుందేర్, కళ్యాణ్‌ల మధ్య నడిపించారు. ఆమె కొత్తగా ఈ ఉద్యోగంలోకి వచ్చినా ట్రైన్‌ని నడిపినప్పుడు ఆమె ఒంటరిగా ఆ ట్రైన్ ఇంజన్ కండీషన్ ఎలాగుందో పరిశీలించారు. అలాగే తను నిర్వహించాల్సిన విధులన్నింటిని విజయవంతంగా నిర్వహించింది. 1998లో ఆమె గూడ్స్ ట్రైన్ డ్రైవర్‌కి పూర్తి బాధ్యతలు చేపట్టారు. ఆమె చేసిన విధులలో ఘాట్ డ్రైవర్ చాలా కష్టమైనది. వెస్టర్న్ ఘాట్ రైల్వేలైన్‌లో 2010లో ట్విన్ ఇంజన్డ్ పాసింజర్ ట్రైన్లకు డ్రైవర్‌గా పనిచేశారు. అక్కడ అనుభవాలను గురించి వివరిస్తూ '' నేను దీనికి డ్రైవర్‌గా నియామకమయినప్పుడు అక్కడ ఉన్న కొంతమంది డ్రైవర్లు ఇప్పటివరకు ఏ మహిళా కూడా ఇటువంటి విధులను నిర్వహించలేదు. ఎంతో బాధ్యతాయుతమైన ఈ పనిని ఒక మహిళకు అప్పచెప్పలేమని'' అన్నారు. కాని సురేఖ వారితో పోరాడి గెలిచింది. నేను మిగతా మగవారిలాగే శిక్షణ పొందానుకదా. నేను నాశిక్షణలో ఉత్తీర్ణత పొందాను. నాలో సామర్థ్యం ఉంది కాబట్టే నేను ఉత్తీర్ణత సాధించాను. నేను దేనినైనా సాధించగలనని నాలో నమ్మకం ఉంది. నేను ఈ విధులను విజయవంతంగా నిర్వహించగలను అని ధైర్యంగా చెప్పానని తెలిపారు. ఆమె మనోధైర్యాన్ని అధికారులు మెచ్చుకుని ఆ బాధ్యతలు ఆమెకు అప్పజెప్పారు.



అసిస్టెంట్ డ్రైవర్‌గా పనిచేసినప్పుడు సురేఖ షంటర్స్‌గా పనిచేసేది. ఆమె మోటార్ వుమెన్ 2000లో అయ్యింది. లేడీస్ స్పెషల్ లోకల్ ట్రైన్‌ని అప్పటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ ఏప్రిల్ 2000లో ప్రారంభించారు. అందులో సురేఖ మొదటి మోటార్ ఉమెన్. 2011 మేలో ఆమెను ఎక్స్‌ప్రెస్ మెయిల్‌కి డ్రైవర్‌గా నియమించారు. అంతేకాదు తాను పొందిన డ్రైవింగ్ విధానాలను మిగతా వారికి కళ్యాన్‌లోని డ్రైవర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో వివరించి చెప్పేవారు. అక్కడ ఆమె సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసేవారు. ఆమె తన 29ఏళ్ల ప్రయాణంలో చాలా అవార్డులను పొందారు. 2011 మార్చి8వతేదీ మహిళా దినోత్సవం నాడు ఆ సంవత్సరానికి ఆసియా మొదటి మహిళా ట్రైన్ డ్రైవర్‌గా ఆమెను ఎంపిక చేశారు.



డక్కన్ క్వీన్ ఫ్రం పుణె టు సిఎస్‌టి. ఆ మార్గం చాలా కష్టతరమైనవి. ఆమెలోని నమ్మకం బలంగా ఉండడంతో విధులను సక్రమంగా నిర్వహించి కుటుంబాన్ని మంచి స్థితికి తీసుకువచ్చింది. ఆమె చేస్తున్న ఈ పనికి కుటుంబసభ్యులు, స్నేహితులు, కొలీగ్స్ అందరూ సహకరించారు. నా సర్వీసులో నేను ఒక మహిళగా వివక్షను ఎదుర్కోలేదు. మీరు మహిళగా రిజర్వేషన్లను పొందుదామనుకుంటే మీ క్రెడిబిలిటీ పోతుందని అన్నారు. నేను నా విధి నిర్వహణలో మంచి ఉద్యోగిగా పేరు తెచ్చుకోవాలనుకున్నారు. అలాగే సాధించాను. మగవారికి, మహిళలకు శరీరాకృతిలో చాలా తేడా ఉంటుంది. కాని చేసే పనివల్ల కలిగే ఫలితం మాత్రం ఒకేలా ఉంటుంది. అలాంటప్పుడు ఆ పని మహిళ చేస్తుందా, పురుషుడు చేస్తున్నాడా అని వివక్షతో చూడడం దేనికని ఆమె ప్రశ్నిస్తున్నారు. ఆమె ట్రైన్ నడిపే సమయంలో రాస్తారోకోలు, చైన్ లాగడాలు చాలా జరిగేవి. ఆమె విధి నిర్వహణలో ఇప్పటి వరకు ఒక్క యాక్సిడెంట్ కూడా జరగలేదని గర్వంగా చెప్పారు. ఆమె లక్ష్యమేమిటంటే పాసింజర్ ట్రైన్‌లో ఎక్కువగా దూరం ప్రయాణించాలని. ఆమె మహారాష్ట్ర గవర్నమెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శంకర్ యాదవ్‌తో 1990లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కొడుకులు అజింక్యా, అజితేష్, వారిద్దరూ ఇంజనీరింగ్ చదువుతున్నారు.

సందేశం

''ఎవరైనా తాము ఏదైతే చేయదలచుకున్నారో ఆ పనిలో ముందడుగు వేయాలి. మీరు దేనినయితే చేయాలని అనుకుంటారో ఆ పనిని సంకోచించకుండా పూర్తిచేయండి. నిజాయితీగా ఉండండి. దేనికీ షైగా ఫీలవ్వద్దు. మీ సమర్థత, తెలివితేటలు, ప్రయత్నంతో మీరు దేనినైనా సాధించగలరు. ముందుగా మీలోని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోండి. ప్రపంచం ఏమనుకుంటుందనేది మీరు ఆలోచించవద్దు. నీమీద నీకు నమ్మకం లేకపోతే ఎవరెంత నమ్మకాన్ని కలిగించినా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేరు. ప్రయత్నం చేయకుండా ఏ పనినీ వదిలివేయవద్దు. మీరు ప్రయత్నిస్తే మీపనిలో ఆనందాన్ని మీరు తప్పకుండా పొందుతారు. అది మీకుటుంబానికి, దేశానికి కూడా ఎంతో సంతోషాన్ని కలుగజేస్తుంది. మగవాళ్లు కట్టుకున్న బురుజులోకి ఎప్పుడైతే మహిళలు ప్రవేశిస్తారో వారు రికార్డు నెలకొల్పినట్లే. మీరు మొదటి టీచర్, క్లర్క్, నర్స్, పైలట్, సైనికురాలా అన్నది ముఖ్యం కాదు. మీరు మీ అవకాశాన్ని ఉపయోగించుకున్నారా లేదా అన్నది ముఖ్యం. నేను ఈ పనిచేయగలిగినప్పుడు ఏ మహిళైనా ఈపనిని చేయగలుగుతుంది కదా''అని ఆమె మహిళలకు తన సందేశాన్ని అందజేశారు.

చదువుకోసం...కఠోర శ్రమ

భారతదేశంలో ఈనాటికీ చాలామంది ఆడపిల్లలు వారి చదువు విషయంలో ఎన్నో అవాంతరాలను, ఆటంకాలు ఎదుర్కొంటూనే ఉన్నారు. అవి ఆర్థికపరిస్థితులు, కట్టుబాట్లు, సంప్రదాయాలు, ఏదైనా కావచ్చు. కొంతమంది వీటిని అధిగమించి ముందుకు దూసుకువెళ్తుంటే మరికొంతమంది ఆ పరిస్థితులను ఎదిరించలేక చదువు మానేసి ఇంట్లోనే ఉండిపోతున్నారు. అలాంటి పరిస్థితులను ఎదురీదుతూ తన కలను సాకారం చేసుకోవడానికి రోజూ పాలను విక్రయిస్తుంది నీతూ శర్మ. ఆమె వివరాలు మీకోసం...

నీతూ శర్మకు 19సంవత్సరాలు. ఆమె ఎనిమిదో తరగతి నుంచి తన గ్రామంలో పాలను సేకరించి వేరే గ్రామాలకు వెళ్లి వాటిని అమ్ముతూ తన చదువుకు కావలసిన ధనాన్ని సంపాదించుకుంటుంది. ఆమె ప్రతిరోజూ ఉదయం నాలుగు గంటలకు లేచి తన గ్రామమైన భాండోర్ కుర్ద్ అంతా తిరిగి పాలను సేకరిస్తుంది. ఆ తరువాత సేకరించిన పాలను భారత్‌పూర్‌కి వెళ్లి ఉదయం 6.30కు అక్కడ అమ్ముతుంటుంది. ఈ పనిలో ఆమె అక్క సుష్మా కూడా సాయపడుతుంది. ఆమె కూడా ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి పాలను సేకరిస్తుంది. ఈ వ్యాపారం చేయడానికని నీతుకి బైక్ నడపడం నేర్చుకుంది. బైక్‌మీద ఉదయంపూట పాలను సేకరించి వేరేగ్రామానికి వెళ్లి వాటిని అమ్మివేసి ఆ బైక్‌ను తీసుకెళ్లి బంధువుల ఇంటి దగ్గర పెట్టేస్తుంది. అక్కడ నుండి రాజస్థాన్ స్టేట్ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ నిర్వహించే కంప్యూటర్ క్లాసెస్‌కు వెళుతుంది. ఆ సమయంలో సుష్మా(ఆమె అక్క) వాళ్ల బంధువుల ఇంటిలోనే ఉంటుంది. ఆమె క్లాసులు అయిపోయాక ఇద్దరూ కలిసి ఇంటికి మధ్యాహ్నం ఒంటిగంటకు వచ్చేస్తారు. సాయంత్రం మళ్లీ రెండోసారి పాలను డెలివరీ ఇవ్వడానికి వెళ్తారు.

స్ఫూర్తి



నీతు తండ్రి బన్వారీలాల్ శర్మకు ఐదుగురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. అందరినీ చదివించే స్థోమత లేక నీతును చదువు మానివేయమని చెప్పాడు. కాని ఆమెకు చదువంటే చాలా ఇష్టం. బాగా చదువుకుని స్కూల్ టీచర్ కావాలన్నదే ఆమె లక్ష్యం. కాని తండ్రికి భారం కాకుండా తన చదువుకు కావలసిన మొత్తాన్ని తానే సంపాదించుకోవాలని నిర్ణయం తీసుకుంది. దానికోసమే ఈ తపనంతా. ఒక్కోసారి ఆమె 5కి.మీ పాలను క్యాన్లను భుజాలమీద మోసుకుని వెళ్లి ఇంటింటికి పాలను ఇచ్చి వచ్చేది. పాలన్నిటిని మాత్రం రోజూ అమ్మే ఇంటికి వచ్చేది. ఇంటి దగ్గర ఉన్న కిరాణా దుకాణాన్ని ఆమె అక్క చూసుకునేది. ఆ షాపునకు కావలసిన సరుకులను వాళ్లు సిటీ నుంచి వచ్చేటప్పుడు టూ వీలర్ మీద తెచ్చుకుని పొదుపు చేసేవారు. పాలను అమ్మగా వచ్చిన డబ్బులలో ఖర్చులు పోను కొంత సొమ్మును వారి చదువుకోసం దాచుకునేవారు. నీతు గవర్నమెంట్ సీనియర్ సెకండరీ స్కూల్ ఇన్ మహారాజ్‌సార్ నుండి పదవతరగతి 56శాతం, ఇంటర్మీడియెట్ 58 శాతం మార్కులతో పాసయ్యింది. ప్రస్తుతం డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతోంది.

''మహిళలు తలచుకుంటే దేనినైనా సాధించగలరు. నేను బైక్‌ను నడపడం ప్రారంభించినప్పుడు మా గ్రామంలోని ప్రజలు నన్ను వెక్కిరించేవారు. అది చూసి మా నాన్న నేను చేసే పనిని మానుకోమని చెప్పేవాడు. మహిళలు ఈవిధంగా తిరగడం మంచిదికాదని నీతులు చెప్పేవాడు. అయినా నేను ఆయన మాటను వినకుండా నాపద్ధతిలో పాలను విక్రయించి చదువుకోవడానికి కావాలసిన ధనాన్ని సంపాదించుకుంటున్నాను'' అని హిందూస్థాన్ టైమ్స్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

నీతు ఆడపిల్లలందరిలో చిన్నది. మొత్తం ఐదుగురు అక్కాచెల్లెళ్లు. ఇద్దరికి పెళ్లిళ్లు అయ్యాయి. తన అక్కలైన సుష్మా, రాధ పెళ్లిళ్లయ్యేవరకు తన వ్యాపారం ఇలాగే కొనసాగిస్తానని ఆమె తెలిపారు. రాధ కిరాణా షాపును నడుపుతుంది. వారికి ఒక తమ్ముడున్నాడు. అతను పదవతరగతి చదువుతున్నాడు. రోజుకు ఉదయం 30లీటర్లు, సాయంత్రం 30లీటర్లు పాలను అమ్మి నెలకు 12వేల రూపాయలను సంపాదిస్తుంది. ఆమె చదువుకోసం తీసుకున్న నిర్ణయం పరిపూర్ణమవ్వాలని, ఆమె కలలను సాకారం చేసుకోవాలని ఆశిద్దాం. ఎన్నో అడ్డంకులున్నా మనోధైర్యంతో ముందుకు సాగుతున్న నీతు నేటి యువతకు స్ఫూర్తిదాయకం. చదువుకోవాలనే తపనతో ఎన్నో కష్టాలను భరిస్తున్న నీతు తన లక్ష్యం చేరుకోవాలని మనందరం కోరుకుందాం.


ఆదర్శం

'దివ్య'మైన ఆలోచన...

రోజురోజుకీ సమాజం ఎలా తయారవుతుందంటే. మనపని, మన సంపాదన, మన కుటుంబం అనే ధోరణిలో ముందుకు సాగుతుంది. ప్రక్కవాళ్ల గురించి ఆలోచించే తీరిక లేదు. సహాయం అందించే సమయమూ లేనివిధంగా అందరూ బిజీ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ఇంత బిజీ లైఫ్‌లో కూడా తమ తోటి వారి గురించి ఆలోచిస్తూ తన వ్యాపారాన్ని నిర్వహించుకుంటూనే సమాజంలో మార్పుకోసం కృషి చేస్తున్నారు దివ్యరామచంద్రన్. ఆమె చేస్తున్న పని ఏమిటో తెలుసుకుందాం....



గోడల నిండా అందమైన రంగురంగుల చిత్రాలతో ఉన్న స్కూల్లో చదవాలని అనిపించకుండా ఉంటుందా ఎవరికైనా? ఎండిపోయిన గోడలమీద క్రియేటివ్ ఆర్ట్‌తో అందమైన రంగుల బొమ్మలను గీయాలనిపించినా మీరు తడబాటుకు గురై ఆగిపోతున్నారా? ఇలాంటి వారికోసం అవకాశం కల్పిస్తోంది బెంగళూర్, చెన్నై వీధిగోడలమీద ప్రారంభించిన ది హాపీ వాల్ ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించినవారు దివ్య రామచంద్రన్. డిజైన్ టీచర్. 2015సంవత్సరంలో నగరాన్ని ఎంతో అందంగా తయారుచేయడానికి ఈప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. అలా ప్రారంభమైన ఈ ప్రాజెక్టు నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఇప్పటి వరకు వంద గోడలమీద (ప్రభుత్వ కార్యాలయాలలో, స్కూళ్లలో, కేఫెలలో, జిమ్స్, వృద్ధాశ్రమాల్లో, రైల్వేస్టేషనల్లో) రంగురంగుల బొమ్మలను గీశారు.



''ఇది నాకు ఫేస్‌బుక్‌లో వచ్చిన రిక్వెస్ట్ పోస్టు ద్వారా నాలో ఈ ఆలోచన మొదలైంది. నేను బెంగళూరులో సృష్టిస్కూల్‌లో ఆర్ట్‌డిజైన్, టెక్నాలజీ టీచర్‌గా పనిచేస్తున్నాను. అక్కడనా ఈ ఆలోచనను రూపొందించేందుకు చాలా మంది వ్యక్తులు కలిసారు. వారి దగ్గర నాకు కావలసిన దానికంటే ఎక్కువగా ఉంది. వారిలో ప్రొఫెసర్స్, విద్యార్థులు కూడా ఉన్నారు. వారితో కలిసి ఆలోచించి పనిచేయడం వల్ల నా ప్రాజెక్ట్‌కు కావలసిన చాలా ఆలోచనలు వచ్చాయి అని 29 సంవత్సరాల'' దీప తెలిపారు.

తను సొంతంగా చేయదలచుకున్న గోడలకు ఆమె ఒక్కరే రంగులను వేసేవారు. రంగులకు ఎక్కువ ఖర్చు అవుతుందనుకున్నప్పుడు మాత్రం తన స్నేహితులు, వాలంటీర్ల సహాయం తీసుకునేది. ఇది కేవలం గోడలకు రంగులద్దే కార్యక్రమం మాత్రమే కాదు. ఆమె వేసిన రంగుల ఆర్ట్‌లో ఎంతో మంచి సందేశాన్ని తెలియజేస్తుంది. ఆమె ఆలోచనతో రూపుదిద్దుకున్న ఆ గోడలు ప్రతి ఒక్కరికీ ఒక సందేశాన్ని గాని, ఆ ప్రదేశ సారాంశాన్ని కూడా తెలియజేస్తుంది.

''నేను పర్సనల్‌గా చేపట్టిన ప్రాజెక్ట్ ఒకటుంది. ఒక గిటారిస్ట్‌తన ఇంటి గోడలను రంగులతో డిజైన్ చేయమన్నాడు. నేను అప్పుడు ఆ గోడలమీద సంగీతంలో అక్షరాలతో డ్రాయింగ్ వేశాను. అది ఆయనకు చాలా నచ్చింది. ఆయన సంతోషాన్ని చూసిన నాకు చాలా సంతృప్తి కలిగిందని'' ఆమె తెలిపారు. ఏ పనినైనా ఆమె ఎంతో బాధ్యతాయుతంగా పూర్తిచేస్తుంది. ఆమె పెయింటింగ్ చేయడానికి ఎక్కువగా వెనకబడిన ప్రాంతాలలో ఉన్న స్కూళ్లను ఎంచుకునేది. వాటిని ఉన్నతస్థితికి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఈ పనిచేసేదాన్నని, నా పనితనం మీద నాకు నమ్మకం కుదిరాక నేను టీచ్ ఫర్ ఇండియా ఫౌండేషన్‌తో కలిసి ప్రయాణం ప్రారంభించాను'' అని ఆమె చెప్పారు. స్కూళ్లల్లో విద్యను ఆహ్లాదకర వాతావరణంలో అందజేయాలనే సదుద్దేశ్యంతో ముందుకు సాగుతూ, ఇలాంటి గోడలను వందదాకా రంగులతో నింపిన దివ్యరామచంద్రన్‌కి అభినందనలు తెలియజేయాల్సిందే.



మహేష్ వర్కింగ్ స్టైల్‌ను మరొకరితో పోల్చలేం

స్పైడర్ దర్శకుడు ఎ.ఆర్.మురుగదాస్



స్పైడర్ సెట్‌లో మహేష్‌తో మురగదాస్

గజని, స్టాలిన్, కత్తి, తుపాకీ వంటి సక్సెస్ సినిమాలను అందించిన దర్శకుడు మురుగదాస్. ఆయన సినిమాలు భారీ వ్యయంతో తెరకెక్కుతాయి. వందశాతం విజయం గ్యారంటీ అని సినీ వర్గాలు నమ్ముతాయి. మురుగదాస్ తాజాగా మహేష్‌బాబుతో స్పైడర్ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం కోసం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుతున్నారు. సెప్టెంబర్ 27న దసరా కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా స్పైడర్ విశేషాల గురించి ఆ చిత్ర దర్శకుడు మురుగదాస్ మాటల్లోనే....

స్పైడర్ సినిమా చాలా బాగా వచ్చింది. స్టాలిన్ తర్వాత పదేళ్ళ విరామం తర్వాత తెలుగులో చేస్తున్న చిత్రమిది. ఒక సందర్భంలో ఒక్కడు సినిమా చూశాను. అందులో మహేష్ సెటిల్డ్ పర్‌ఫార్మెన్స్ నాకు బాగా నచ్చింది. మరోసారి పోకిరి పాట చిత్రీకరణ సందర్భంలో మహేష్‌ను కలిశాను. ఆ తర్వాత మరో సందర్భంలో మహేష్‌ను కలిసినపుడు మీతో సినిమా చేయాలని అనుకుంటున్నాను అని చెప్పాను. తను కూడా పాజిటివ్‌గానే స్పందించారు. ఆ తర్వాత కొద్ది రోజులకు తెలుగు, తమిళంలో సినిమా చేయాలని కథను అనుకున్నాను. కథలో హీరోయిజం ఉండాలి. ఫ్యామిలీ ఆడియన్స్, ఫ్యాన్స్, రెగ్యులర్ ఆడియన్స్‌కు సినిమా నచ్చేలా ఉండాలి. అలాగే తమిళంలో మహేష్ తొలిసారి చేస్తున్నారు కాబట్టి సమతుల్యత ఉండాలి. కాబట్టి స్క్రిప్ట్ మోడరన్‌గా ఉండాలని భావించాను. ఆ ప్రకారం స్పైడర్ తెరకెక్కించాం. డబ్బింగ్ పనులు పూర్తయ్యాయి. ఒకపాట చిత్రీకరణ మాత్రం మిగిలి ఉంది.

మహేష్‌తో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. నేను చాలా మంది సూపర్‌స్టార్స్‌తో పనిచేశాను. మహేష్ వర్కింగ్ స్టైల్‌ను మరొకరితో పోల్చలేం. అందరు దర్శకులు మహేష్‌తో ఒక్క సినిమా అయినా సరే చేయాలని నేను కోరుకుంటున్నాను. తను దర్శకుల హీరో. స్పైడర్ సినిమాను 80 రోజుల పాటు రాత్రి షూటింగ్ చేశాం. మహేష్ ఎంతో సహకరించారు. స్క్రిప్ట్ విన్న తర్వాత తనెక్కడా ఇన్‌వాల్వ్ కాలేదు. చాలా ఎఫర్ట్ పెట్టి నటించేవారు. ఇండటియాలో మరే సూపర్‌స్టార్ ఇంతలా కష్టపడటం నేను చూడలేదు. స్పైడర్‌లో మహేష్‌ను తప్ప మరే హీరోను ఊహించుకోలేనంతగా ఇమిడిపోయారు. సినిమాను రెండు భాషల్లో సమాంతరంగా షూట్ చేశాం.

స్పైడర్ జేమ్స్‌బాండ్ తరహాలో పూర్తిస్థాయి ఫ్యూచరిస్టిక్ మూవీకాదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఇంటిలిజెన్స్ వ్యవస్థ మనదేశంలో ఎలా పనిచేస్తుంది?. వారు దేశంలో మన కోసం ఏం చేస్తున్నారు అనేవి సినిమాలో చూపిస్తున్నాం. అన్ని ఎమోషన్స్ ఉంటాయి. మనిషిలో హ్యూమానిటీ తగ్గిపోయినపుడు సమాజంలో లంచం పెరిగిపోతుంది లేదా మరేదైన వైపరీత్యం సంభవిస్తుంది. ఈ సందేశం స్పైడర్‌లో అంతర్లీనంగా ఉంటుంది.

ఈ సినిమా చేయాలని అనుకున్నపుడు మహేష్‌గారు ఠాగూర్ మధు, తిరుపతి ప్రసాద్ నిర్మాతలు అయితే ఎలా ఉంటుందని నన్ను అడిగారు. వారితో నాకు చాలాకాలంగా పరిచయం ఉంది. దాంతో ఎస్ అని చెప్పాను. సినిమా మొదలయ్యాకమేం అనుకున్న దానికంటే గ్రాండియర్ ఇంకా ఎక్కువైంది. నిర్మాతలిద్దరు ఎంతో సపోర్ట్ చేశాను. గ్రాఫిక్స్ కూడా లండన్, రష్యా టెక్నీషియన్స్‌తో చేయిస్తున్నారు.

విలన్‌గా ఎస్.జె.సూర్యను తీసుకోవడానికి కారణం ఉంది. విలన్ అంటే ఆరడుగుల, ఆరు పలకల దేహం ఉండాల్సిన అవసరం లేదు. మాకథకు తగినట్టుగా బుద్ధిబలం ఎక్కువగా ఉండే విలనిజం కనిపించాలి. హీరోకు కనిపించకుండా గెరిల్లా ఎటాక్‌లా హీరోతో ఫైట్ చేయాలి. అందుకు ఎస్.జె.సూర్య అయితే బావుంటాడని అనిపించి తీసుకోవడం జరిగింది.

స్పైడర్ తెలుగు, తమిళం, మలయాళం, గల్ఫ్ కంట్రీస్‌లో అరబిక్‌లో కూడా సెప్టెంబర్ 27న రిలీజ్ చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు అని పేర్కొన్నారు.



బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న అల్లు అరవింద్, రామ్‌చరణ్

సైరా నరసింహారెడ్డి చిరంజీవి ఫస్ట్‌లుక్

నా ఆశలకు.. మీ ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలిచే పాత్ర

సైరా నరసింహారెడ్డి

- చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవి మళ్లీ సినిమాలను చేస్తుండటంతో ప్రేక్షకాభిమానుల్లో పండగ వాతావరణం నెలకొంది. ఆయన చేయబోయే 151వ చిత్రానికి ఎలాంటి టైటిల్ పెడతారు? ఫస్ట్‌లుక్ ఎప్పుడు విడుదలవుతుందన్న ఆసక్తి తారాస్థాయికి చేరుకున్న నేపథ్యంలో మెగాస్టార్ జన్మదినోత్సవంలో దానికి తెరదించారు. మంగళవారం హైదరాబాద్‌లో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అభిమానుల సమక్షంలో చిరంజీవి జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల వేదికపై ఈ చిత్రానికి సైరా నరసింహారెడ్డి అనే టైటిల్‌ను ప్రకటించడంతో పాటు మోషన్ పోస్టర్‌ను విడుదలచేశారు. చిరంజీవి టైటిల్ పాత్రలో సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై సురేఖ సమర్పణలో రామ్‌చరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను ఎస్.ఎస్.రాజమౌళి, టైటిల్ లోగోను అల్లు అరవింద్, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన పోస్టర్స్‌ను వరుణ్‌తేజ్, పరుచూరి బ్రదర్స్ చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. చిరంజీవి బర్త్‌డే కేక్‌ను అల్లు అరవింద్, రామ్‌చరణ్ తదితరులు కట్‌చేశారు.

ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌ను ఈ వేడుకల్లో ప్రదర్శించారు. ప్రత్యక్షంగా కుదరకపోయినా పరోక్షంగా అయినా అభిమానులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని చిరంజీవి అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, ఈ రోజు నాకు చాలా ప్రత్యేకం. దానికి కారణం నా వృత్తి సినిమా...నా ప్రవృత్తి సినిమా. ఈ రెండు అనుభూతులను ఈ రోజు ఇక్కడ ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రులు చేసిన పూజలో లేక నేను చేసుకున్న పుణ్యమో గానీ ఇంతమంది అభిమానులను నాకిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఇంతే ఆదరణ చూపిస్తున్నారు. అలాంటి మీకోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. మీరు గర్వపడేలా సినిమాలు చేయగలను. పదికాలాల పాటు చెప్పుకునే పాత్రలు చేయగలను. అందుకే స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కథను తీసుకున్నాం. ఫ్రీడమ్ ఫైటర్ పాత్ర చేయాలని ఎప్పట్నుంచో ఉంది. భగత్‌సింగ్ పాత్రలో నటించాలని చాలాసార్లు అనుకున్నా. ఇన్నాళ్లకు ఉయ్యాలవాడ రూపంలో నా ఆశలకు...మీ ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలిచే పాత్ర దొరికింది. మెగా అభిమానులంతా గర్వపడే సినిమా అవుతుంది అని అన్నారు.

వేడుకలలో పాల్గొన్న నిర్మాత రామ్‌చరణ్ మాట్లాడుతూ, నా కెరీర్‌లోనే చాలా పెద్ద చిత్రం మగధీరను రాజమౌళిగారే దర్శకత్వం వహించారు. అలాగే భారతదేశంలోనే పెద్ద చిత్రం బాహుబలిని కూడా రాజమౌళిగారే తెరకెక్కించారు. ఆయన చేతులమీదుగా సైరా నరసింహారెడ్డి మోషన్ పోస్టర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. గత నెల రోజులుగా ఈ సినిమాను ఎలా తీయాలని ఒకరకమైన టెన్షన్ పడుతున్నాను. వాస్తవానికి ఇది చాలా కష్టమైన పని. అయినా విజయం సాధించడం కోసం రంగంలోకి దిగాను. అడగ్గానే అమితాబ్, రెహమాన్ వంటి నటీనటులు, టెక్నీషియన్లు సినిమా చేయడానికి అంగీకరించారు. కొణిదెల ప్రొడక్షన్స్ బేనర్‌లో ఆంజనేయస్వామి ఫొటో ఉంటుంది. ఆయన ఆశీర్వాదమో, అభిమానుల బలమో కానీ ఈ సినిమాకు అన్నీ చక్కగా అమిరాయి. చిరంజీవిగారి జన్మదినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా 42 వేల మంది రక్తదానం చేశారు. అభిమానులు ఇలా సేవ చేయడమే నాన్నగారికిచ్చే గొప్ప బర్త్‌డే కానుక అని అన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ, టైటిల్‌తో మోషన్ పోస్టర్ అద్భుతంగా ఉన్నాయి. బాహుబలి సినిమా అంత పెద్ద విజయం సాధించడానికి సాంకేతిక నిపుణులే పెద్ద కారణం. ఈ సినిమాకు కూడా మంచి సాంకేతిక నిపుణుల బృందం కుదిరింది. చిరంజీవిగారి 151వ సినిమా ఇది. అయినా ఆయన ఒకటో సినిమాలా అంతబాగా ఫస్ట్‌లుక్ సహా అన్ని అంశాలు కుదిరాయి అన్న అభిప్రాయం వ్యక్తంచేశారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ, చిరంజీవిగారితో 37 ఏళ్ల అనుబంధం ఉంది. ఆయనెంతో కష్టపడి ఓ రోడ్డు వేశారు. ఆ రోడ్డుపైనే పవన్‌కల్యాణ్ అయినా రామ్‌చరణ్ అయినా, అర్జున్, తేజ్, వరుణ్‌లు అయినా నడుస్తున్నారు. చరిత్రలో నిలిచిపోయేలా ఈ సినిమా ఉంటుంది అని అన్నారు. దర్శకుడు సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, సైరా నరసింహారెడ్డి టైటిల్ వినగానే నాలో వణుకు పుడుతుంది. ఈ చిత్రానికి చాలా మంచి టీమ్ కుదిరింది. మెగా అభిమానుల అండతో ముందుకెళ్తా అని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.కె.వెంకటేశ్వరరావు, పరుచూరి బ్రదర్స్, సి.కిరణ్, సుకుమార్, సాయిధరమ్‌తేజ్, వరుణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో అమితాబ్‌బచ్చన్, జగపతిబాబు, సుదీప్, విజయ్ సేతుపతి, నయనతార, నాజర్, రవికిషన్, ముఖేష్‌రుషి, రఘుబాబు, పరుచూరి వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, వి.జయప్రకాష్, రఘు కారుమంచి తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కథ, పరుచూరి బ్రదర్స్, మాటలు: సాయిమాధవ్ బుర్రా, రచనా సహకారం: సత్యానంద్, భూపతిరాజా, డి.ఎస్.కన్నన్, మధుసూదన్, వేమారెడ్డి, సినిమాటోగ్రఫీ: రవివర్మన్, సంగీతం: ఎ.ఆర్.రెహమాన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: వాకాడ అప్పారావు, వి.వై.ప్రవీణ్‌కుమార్, నిర్మాత: రామ్‌చరణ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సురేందర్‌రెడ్డి.

ఆ క్రేజ్‌తో ఆఫర్లు



పూజా హెగ్డే

పూజాహెగ్డే ఎదురుచూపులు ఊరకేపోలేదు. ఎట్టకేలకు ఆమె ఆశలు ఫలించాయి. లోగడ తెలుగులో రెండు సినిమాలు చేసినా రాని క్రేజ్ ఇప్పుడు దువ్వాడ జగన్నాథమ్ చిత్రంతో ఒక్కసారిగా ఆమెకు లభించింది. దాంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ముగమూడి అనే తమిళ చిత్రం ద్వారా ఈమె అరంగేట్రం జరిగింది. అయితే ఆ చిత్రం ఆమె కెరీర్‌ను మలుపు తిప్పలేకపోయింది. రెండేళ్ల గ్యాప్ తర్వాత తెలుగు సినీరంగంలోకి ప్రవేశించిన ఆమె నాగచైతన్య సరసన ఒక లైలా కోసం, వరుణ్‌తేజ్ సరసన ముకుంద చిత్రంలోనూ నటించింది. అయితే ఆ రెండు చిత్రాలు కూడా అనుకున్న స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. అయితే అదే సమయంలో బాలీవుడ్‌లో అవకాశం రావడంతో అక్కడికి పరుగులు తీసిన ఆమెకు నిరాశే ఎదురైంది. హిందీలో ఆమె నటించిన మొహెంజోదరో చిత్రం బాక్సాఫీసు వద్ద పరాజయం పొందింది. దాంతో బాలీవుడ్ అవకాశాల కోసం ఎదురు చూడటం కంటే మళ్లీ తెలుగు సినీరంగంపై దృష్టిసారించడమే ఉత్తమమని అనుకుందో! ఏమో ! ఇప్పుడు టాలీవుడ్‌లో రాణించాలని పట్టుదలతో ఉందని అంటున్నారు. ఇందులో భాగంగా అల్లు అర్జున్ సరసన ఆమె నటించిన దువ్వాడ జగన్నాథమ్ చిత్రం బాక్సాఫీసు వద్ద మంచి కలెక్షన్లను సాధించింది. గ్లామర్ పరంగా ఈ చిత్రంలో ఆమెకు మంచిమార్కులు పడ్డాయి. ఇలా లభించిన తొలి విజయం ద్వారా తమ సినిమాల్లోకి ఆమెను తీసుకునేందుకు టాలీవుడ్ దర్శక, నిర్మాతలు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే బెల్లంకొండ శ్రీనివాస్, దర్శకుడు శ్రీవాస్‌ల కలయికలో అభిషేక్ నామా నిర్మించే చిత్రంలో పూజా హెగ్డేను ఎంపిక చేయగా, మహేష్‌బాబు, వంశీ పైడిపల్లి కలయికలో రూపొందబోయే చిత్రంలోనూ పూజా హెగ్డే పేరు పరిశీలనలో ఉందని పరిశ్రమలో చెప్పుకుంటున్నారు. ఇదిలావుండగా, అల్లు అర్జున్ అద్భుతంగా డ్యాన్స్ చేస్తారని, ఆయనతో కలిసి దువ్వాడ జగన్నాథమ్ చిత్రంలో నటించడం ఓ మంచి అనుభూతిని కలిగించిందని , మళ్లీ ఆయనకు జోడీగా నటించేందుకు ఎప్పుడూ సిద్ధమేనని పూజా అంటోంది.

ప్రేక్షకులే నాకు డబ్బింగ్ చెప్పాలి

- విజయ్ దేవరకొండ



హృదయాన్ని తాకే ప్రేమకథతో అర్జున్‌రెడ్డి చిత్రం రూపుదిద్దుకుంది. నేను ఈ మధ్యకాలంలో విన్న ప్రేమకథలలో ఎంతగానో ఆకట్టుకున్న కథ ఇది. నిజమైన ప్రేమకు నిర్వచనం చెప్పేలా ఉంటుంది అని శర్వానంద్ అన్నారు. విజయ్ దేవరకొండ, షాలిని హీరోహీరోయిన్లుగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మిస్తున్న అర్జున్‌రెడ్డి చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లోని ఎన్.కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో బిగ్ సీడీ, ఆడియో సీడీలను కూడా విడుదలచేశారు. అతిథిగా పాల్గొన్న హీరో శర్వానంద్ మాట్లాడుతూ, అర్జున్‌రెడ్డి చిత్రబృందాన్ని చూస్తుంటే సినిమా కోసం రక్తం పెట్టి చేసినట్లు కనిపిస్తోందని, తప్పకుండా ఈ చిత్రం విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. చిత్ర హీరో విజయ్ దేవరకొండ ప్రసంగం ఉద్వేగభరితంగా ఇలా సాగింది. థియేట్రికల్ ట్రైలర్ విడుదల రోజున ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుందని చెప్పాను. అందుకోసం పందెం కాయడానికైనా సిద్ధమన్నట్లుగా మాట్లాడాను. అయితే నా మాటలను కొందరు వేరే రకంగా అర్థం చేసుకున్నారు. ఓ నటుడికి తన సినిమాపైనే నమ్మకం లేకుంటే అది వృధా. నాకే నమ్మకం లేకుంటే ఇంకెవరికి ఉంటుంది. సెన్సార్ వాళ్లు మా సినిమాకు ఎ సర్టిఫికెట్ ఇచ్చారు. కథ వినగానే ఇది చిన్న పిల్లల సినిమా కాదని అనుకున్నాను. ఏ మాట్లాడుతున్నావ్ రా...అనే పదాన్ని కూడా మ్యూట్ చేశారు. నన్ను మ్యూట్ చేశారు కానీ, ప్రేక్షకులను మ్యూట్ చేయలేరు. కాబట్టి ప్రేక్షకులే థియేటర్‌లో నాకు డబ్బింగ్ చెప్పాలి. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రలో షాలినిని చూసిన తర్వాత ఆమె తప్ప ఆ పాత్రను ఇంకెవరూ చేయలేరని అనిపించింది అని అన్నారు.

దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా మాట్లాడుతూ, నేను ఎలాగైతే ఊహించుకుని ఇందులోని పాత్రలను రాశానో విజయ్, షాలిని సరిగ్గా అలాంటి నటననే కనబరిచారు. మేం పదిరోజులు వర్క్‌షాప్‌ను నిర్వహించాం. అప్పుడే సినిమా పెద్ద హిట్ అవుతుందని తెలిసిపోయింది. శర్వానంద్ అర్జున్‌రెడ్డిగా నటించాల్సింది. స్వప్నగారు సినిమాను నిర్మించాల్సింది కానీ కుదరలేదు. వీరిద్దరూ విజయ్‌తో సినిమా చేయమని అనడంతో తనకు కథ చెప్పాను. కుటుంబ సభ్యులతో కలిసి ఈ సినిమాను చూడొచ్చు అని అన్నారు. నిర్మాత ప్రణయ్‌రెడ్డి వంగా మాట్లాడుతూ, విజయ్, షాలిని తమ పాత్రలను అద్భుతంగా పోషించారు. వారిద్దరూ లేకుంటే సినిమా ఇంతబాగా వచ్చేది కాదు. ఈ నెల 25న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తున్నాం అని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో నందినీరెడ్డి, క్రాంతిమాధవ్, స్వప్నదత్, తరుణ్‌భాస్కర్, శివ నిర్వాణ తదితరులు పాల్గొన్నారు.

తొలి సినిమానే బ్రేక్‌నిస్తుంది

- చంద్రకాంత్



అందమైన రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో ప్రేమ ఎంత మధురం..ప్రియురాలు అంత కఠినం చిత్రం రూపుదిద్దుకుంది. మంచి టీమ్‌తో కలిసి ఈ చిత్రం చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నా అని హీరో చంద్రకాంత్ అన్నారు. థర్డ్ ఐ క్రియేషన్స్ పతాకంపై చంద్రకాంత్, మెహరోత్రాలను హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ రఘురాం రొయ్యూరుతో కలిసి గోవర్ధన్.జి. స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ చిత్రం విడుదలకు సన్నద్ధమవుతోంది. ఈ సందర్భంగా మంగళవారంనాడు హైదరాబాద్‌లో కథానాయకుడు చంద్రకాంత్ కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ వివరాలేమిటో ఆయన మాటల్లో... నేను పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లో. ఇంజనీరింగ్ పూర్తిచేసిన తర్వాత నటనను కెరీర్‌గా తీసకోవాలని అనుకున్నాను. అందులో భాగంగా ఈ చిత్రంలో నటించడంతో పాటు అమెరికాలో నట శిక్షణ పొందుతున్నాను. ఈ చిత్రం కోసం దర్శకుడు గోవర్ధన్ ప్రాణం పెట్టారు. తొలి చిత్రంతోనే తనికెళ్ల భరణి, తులసి వంటి సీనియర్స్‌తో నటించడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. హీరోయిన్లుగా పరిచయమవుతున్న రాధిక, పల్లవి తమ పాత్రల్లో చక్కటి నటనను కనబరిచారు. ఈ తొలి చిత్రం కెరీర్ పరంగా తప్పకుండా నాకు బ్రేక్ నిస్తుందన్న నమ్మకం ఉంది అని అన్నారు.